epaper.ninadamnews.com

తెలుగు దినపత్రిక

# నినాదం

నిఖార్సైన జర్నలిజం

శుక్రవారం, జులై 24, 2026 | సంపుటి - 22 | సంచిక 296 | వెల - 7 | పేజీలు - 12 - 8

Circulated from TS and AP.. Hyderabad, Karimnagar, Khammam, Mahabubnagar, Nalgonda, Nizamabad, Warangal, Vijayawada, Guntur, Ongole, Nellore, Tirupathi, Kadapa, Ananthapur, Kurnool, Tadepalligudem, Rajahmundry, Visakhapatnam, Srikakulam

## పేపర్ లీక్ కేసుల విచారణ కోసం ఫాస్ట్‌ట్రాక్ కోర్టు




**ఎక్స్ వేదికగా స్పందించిన ప్రధాని మోడీ**

**న్యూఢిల్లీ,జూలై23(నినాదం):** నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన భారీ నిరసనల నేపథ్యంలో ప్రధాని మోదీ ఎట్టకేలకు స్పందించారు. పేపర్ లీక్ కేసుల విచారణ కోసం ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని ప్రధాన మంత్రి ఎక్స్ వేదికగా తెలిపారు. పేపర్ లీక్ ఘటనల్లో ప్రమేయం ఉన్నవారికి త్వరితగతిన కఠిన శిక్షలు పడేలా చూసేందుకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలని నిర్ణయించామని పేర్కొన్నారు.

▸▸తరువాయి2లో..

## దమ్ముంటే నీట్‌పై చర్చకు రావాలి

6

విపక్షాలకు బిజెపి అధ్యక్షుడు నితిన్ నబిన్ సవాల్



# మూడు ఠాణాలు.. నలుగురు బియ్యం స్మగ్లర్లు

- మల్యాల, పెగడపల్లి, గొల్లపల్లి నుండి తెచ్చి..
- గుంజపడుగులో భారీ డంపు
- ఖాకీలకు మాత్రమే కనిపించరు.. సామాన్యులందరికి దర్శనమిస్తరు
- జగిత్యాల అన'కొండ' దే ధీమా
- నిత్యం వందల క్వింటాళ్ల బియ్యం రవాణా

పీడీ యాక్టు పడినా ఏమాత్రం మారని ఓ రెగ్యులర్ అఫెండర్,ప్రతినెలా కోట్లాది రూపాయల సర్కారుసొమ్ము లూటీకి పాల్పడుతున్న సదరు ఆర్థిక నేరస్తుని కట్టడికి 'నినాదం' ఏడాదిగా శ్రమిస్తోంది.తగిన ఆధారాలతో ఈ ఏడాదికాలంగా అనేక వార్తాకథనాలు ప్రచురించింది. దురదృష్టానికి కొందరు అవినీతి అధికారుల స్వార్ధం కారణంగా సదరు అక్రమ అన'కొండ' తన విధ్వంసాన్ని ఇంకా కొనసాగిస్తూనే ఉన్నాడు.రాష్ట్ర కొత్త డీజీపీగా సీవీ ఆనంద్ ఇటీవల బాధ్యతలు చేపట్టిన నేధ్యంలో ఇక్కడి సామాజికవాదులు,నెటిజన్లలో కాస్త ఆశలు రేకెత్తాయి.ఈయనతోనైనా ఈ బాగోతానికి ఫుల్ స్టాప్ పడుతుందనే ధీమా పెరిగింది.వారి ఆకాంక్షలకు అనుగునంగా నినాదం సైతం సమస్యపై యధావిధిగా పోరాటం సాగిస్తోంది.



పెగడపల్లి ఠాణా పరిధిలో నిలిపి ఉన్న మోపెడ్



గొల్లపల్లి ఠాణా పరిధిలో రేషన్ బియ్యంతో వెళ్తున్న వ్యక్తి



మల్యాల ఠాణా పరిధిలో...

**(ప్రత్యేక ప్రతినిధి - నినాదం ):**

### గుండెకాయలా గుంజపడుగు....

ఈ జగిత్యాల గజదొంగ దందాకు జిల్లాలోని గొల్లపల్లి మండలం గుంజపడుగు ఓ కల్పతరువుగా మారింది. దీన్ని కేంద్రంగా చేసుకున్న కనకయ్య,అనిల్,దేవాతో పాటు మరో వ్యక్తి కలిసి ఒక ముఠాగా ఏర్పడ్డారు.వీరంతా మల్యాల,పెగడపల్లి,గొల్లపల్లి మొదలగు మండలాల్లో ఆటోలు,టీవీఎస్ మోపెడ్ ల ద్వారా రేషన్ బియ్యాన్ని సేకరిస్తారు. వారి వారి అనుచరులతో ఆ బియ్యాన్ని తెప్పించుకుని గుంజపడుగులో భారీగా నిల్వచేస్తారు. ఆపై డే బై డే జగిత్యాలకు చెందిన సదరు అన'కొండ'కు చేరవేస్తారు. ఈ తంతులో వీరికి ఎలాంటి ఆటంకం కలగకుండా సదరు అనకొండ చూసుకుంటాడు.

### తిరిగేది పగలే...అయినా ఆపేదేలే

కాగా ఇదంతా ఏ అర్ధరాత్రో జరుగుతుందనుకుంటే పొరపాటే. పట్టపగలు అత్యంత ధర్జాగా, చెప్పాలంటే పోలీసు ఠాణాల ముందునుండే నడుస్తుంటది. బియ్యాన్ని సేకరించే సదరు వ్యక్తులు తమకేదో ప్రత్యేక లైసెన్సే ఉంది అన్నంత ధీమాగా సంచులతో తిరుగుతూ ఉంటరు.ఇది అందరికీ కనిపించినా పోలీసులు,సివిల్ సప్లై,రెవెన్యూ బాధ్యులకు మాత్రం కనిపించవేమో అన్నట్లుగా ఉంటది అక్కడి తీరు.

### డీజీపీ మార్కుపైనే అంచనాలు..

గుంజపడుగులోని స్మగ్లింగ్ స్థావరం కరుడుగట్టిన రౌడీలు,గంజాయి బ్యాచ్ ఆదీనంలో ఉంటుంది. ఇక్కడికి కేవలం యూనిఫామ్ సర్వీసు వాళ్లు (పోలీసులు) మాత్రమే వెళ్లగలుగుతారని పలు సందర్భాల్లో స్థానిక సివిల్ సప్లై సిబ్బందే చెప్పటం గమనార్హం. మరి ఇలాంటి పరిస్థితిని హ్యాండిల్ చేయటమంటే కొత్త డీజీపీ స్పెషల్ మార్కు తోనే సాధ్యపడుతుందని, ఆ ధైర్యం,పవర్ స్థానిక పోలీసులకు ఇవ్వాలని ఆయన అడ్మినిస్ట్రేషన్ గురించి తెలిసిన పలువురు కోరుతున్నారు. డీజీపీ సీవీ ఆనంద్ తోనే జగిత్యాలలోని ఈ క్రైమ్ కు ఖచ్చితంగా ముగింపు పడనుందని స్థానికులైన కొందరు భారీ అంచనాలు వేసు కుంటున్నారు.



# గ్లోబరీనా కేటీఆర్ బినామీ సంస్థ

**ఆ సంస్థ తప్పిదాల వల్ల 27 మంది బలి**

**ఆ తప్పులకు కెటిఆర్ క్షమాపణలు చెప్పాలి**



- పేరు మార్చుకొని పరీక్షల కాంట్రాక్ట్ పొందింది
- ధర్మేంద్ర రాజీనామాను బిఆర్ఎస్ ఎందుకు డిమాండ్ చేయదు
- బిఆర్ఎస్, బిజెపిలు రెండూ ఒక్కటే
- సర్ ప్రక్రియలో ఎస్సీఎస్టీ ఓట్లు తొలగించే కుట్ర
- అందుకే అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నాం
- ఓటు లేకపోతే పథకాలు పోతాయని హెచ్చరిక
- మీడియాతో చిట్‌చాట్‌లో సిఎం రేవంత్ రెడ్డి

***గ్లోబరీనా ముమ్మాటికీ కేటీఆర్ బినామీ సంస్థ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరోమారు ఆరోపించారు. గురువారం మీడియాతో నిర్వహించి చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. గ్లోబరీనా తప్పిదాల వల్ల 27 మంది చనిపోయారని.. ఆ సంస్థ పేరు మార్చుకొని పరీక్షల కాంట్రాక్టు పొందిందని వ్యాఖ్యానించారు. వీటి ఆధారంగానే నీట్ కుంభకోణం జరిగిందన్నారు. గ్లోబరీనా తప్పిదాలపై కేటీఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అమరవీరుల స్తూపం వద్ద కేటీఆర్ ముక్కు నేలకు రాయాలన్నారు. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ విషయంలో బీఆరఎస్ ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు.***

**హైదరాబాద్,జులై 23(నినాదం):** ఈ సందర్భంగా బీఆరఎస్ నేత కేటీఆర్, బీజేపీపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.కేటీఆర్ బర్త్ డే పై సీఎం రేవంత్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'కేటీఆర్ పుట్టిన రోజు దావత్ ఇస్తాడో అడగాలి. కేటీఆర్ ఇచ్చే దావత్ నేను తీసుకోలేనేమో. ఆయనవి అన్నీ వేరే పార్టీలు' అంటూ సెటైర్ విసిరారు. హరీశ్ గొప్పవాడైతే మంత్రి పదవి నుంచి ఎందుకు తీసేశారని ప్రశ్నించారు. అతి తెలివి తేటలతో ఏదిపడితే అది మాట్లాడతానంటే నడవదని హరీశ్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు.

▸▸తరువాయి2లో..

# గ్లోబరినాతో మీరెందుకు ఒప్పందం చేసుకున్నరు

**ఆ సంస్థతో నాకు సంబంధం లేదు**



- రేవంత్ క్షమాపణలు చెప్పకుంటే లీగల్ చర్యలు
- సీఎం వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరిక
- పగలు కాంగ్రెస్, రాత్రి బిజెపితో సీఎం సావాసమని వ్యాఖ్య

**హైదరాబాద్,జూలై23(నినాదం):** 2019 ఇంటర్ ఫలితాల్లో కేటీఆర్ బినామీ సంస్థ గ్లోబరీనా అవకతవకలకు పాల్పడిందని సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలపై బీఆరఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో మండి పడ్డారు. ముఖ్యమంత్రి హోదాకు తగిన విధంగా ఒక్కసారైనా వ్యవహరించాలని సూచించారు. పేపర్ లీక్ వంటి అత్యంత దురదృష్టకర ఘటనను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగిస్తూ తప్పుడు ప్రచారం చేయడం ముఖ్యమంత్రి పదవికే మచ్చ తెచ్చే చర్య అని ఆయన ఆరోపించారు. గ్లోబరీనా సంస్థతో బీఆరఎస్‌కు, తన కుటుంబానికి లేదా తనకు ఎలాంటి సంబంధం లేదని కేటీఆర్ మరోసారి స్పష్టం చేశారు. ఈ విషయంలో చేసిన ఆరోపణలపై క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో న్యాయపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని తెలిపారు.

▸▸తరువాయి2లో..

*'గ్లోబరీనా నిజంగానే నా బినామీసంస్థ అయితే, అదే సంస్థతో కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు ఒప్పందాలు చేసుకుంది? మీప్రభుత్వమే ఆ సంస్థతో ఒప్పందాలు చేసుకుని, ఇప్పుడు అది నా బినామీసంస్థ అని చెప్పడం ఎంతవరకు సమంజసం?' అని కేటీఆర్ ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి పగలు కాంగ్రెస్‌తో.. రాత్రి బీజేపీతో ఉంటారంటూ దుయ్యబట్టారు.*

## నీట్‌పై విద్యార్థుల ఆక్రందన సబబే

దానికి సానుకూలంగా స్పందించాల్సిందే

ప్రభుత్వ విధానాలను తూర్పారా బట్టిన కమల్ హాసన్



6 వివరాలు

## కోచింగ్ సెంటర్లకు నీట్ దాసోహం

వెంటనే రద్దు చేసి, రాష్ట్రాలకే బాధ్యతలు ఇవ్వాలి

విద్యార్థుల ఆందోళనకు మద్దతు పలికిన మాజీ సిఎం స్టాలిన్



## నేడు దేశవ్యాప్త ఆందోళనలు

- కాక్రోచ్ జనతా పార్టీ పిలుపు
- శాంతియుతంగా నిరసనలు తెలపాలని సూచన

## సిజెపి ఆందోళనలపై పోలీసుల దృష్టి

- హింసాత్మక ఘటనలపై పోలీసుల కూపీ
- అవసరమైతే పాస్‌పోర్టులు రద్దు చేసేందుకు సిద్ధం?

2 వివరాలు




## విద్యార్థుల భవిష్యత్ నాశనం చేసిందే బిజెపి

- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందే
- మోడీ ట్వీట్‌పై రాహుల్, అభిజిత్ దీప్కె

**న్యూఢిల్లీ,జూలై23(నినాదం):** విద్యార్థుల జీవితాలను దెబ్బ తీసింది కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమేనని, ప్రధాని నరేంద్ర మోదీ ట్వీట్‌పై రాహుల్ గాంధీ ఘాటుగా స్పందించారు.విద్యార్థుల జీవితాలను నాశనం చేసిన కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ విద్యార్థులకు క్షమాపణలు చెప్పి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

▸▸తరువాయి2లో..

# పార్లమెంటులో ప్రతిష్టంభన

- నీట్ లీకేజీపై చర్చపై కుదరని ఏకాభిప్రాయం
- ధర్మేంద్ర రాజీనామా చేయాల్సిందేనని పట్టు
- విపక్షాల పట్టుతో పార్లమెంట్ నేటికి వాయిదా
- పార్లమెంట్ వెలుపల పరస్పర నినాదాలు




**న్యూఢిల్లీ,జూలై23(నినాదం):** పార్లమెంటులో ప్రతిష్ఠంభన కొనసాగుతోంది. గురువారం ప్రారంభమైన రెండు నిముషాలకే ఉభయసభలు తొలుత 12గంటలకు వాయిదా పడ్డాయి. అనంతరం సమావేశమైనా సభలు సాగలేదు. ధర్మేంద్ర ప్రదాన్ రాజీనామా చేస్తేనే చర్చకు అంగీకరిస్తామని రాజ్యసభలో మల్లికార్జున ఖర్గే తెగేసి చెప్పారు. నీట్ పేపర్ లీక్ అంశంపై ప్రతిపక్షాల నిరసనల నడుమ లోక్‌సభ నేటికి వాయిదా పడింది.

▸▸తరువాయి2లో..

## డిజిపి కార్యాలయంలో కానిస్టేబుల్ ఆత్మహత్య

- సర్వీస్ తుపాకీతో కాల్చుకున్నట్లు గుర్తింపు
- సూసైడ్ నోట్ ఆధారంగా పోలీసుల దర్యాప్తు



వివరాలు 2

## మెట్రో స్టేషన్ల మూసివేతపై సిజెఐ ఆగ్రహం

ప్రజలకు ఇబ్బంది కలిగితే జోక్యం తప్పదని హెచ్చరిక

సిజెపి ఆందోళనకు సుప్రీం లాయర్ల మద్దతు



వివరాలు 2

# మహానగరం నడిబొడ్డున పేదోడికి ఇల్లు ఉండొద్దా

**పేదలకు ఇళ్లు కడితే... ఎందుకంత కడుపుమంట?**

- పదేళ్లు చేయలేనిది కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుంటే... విష ప్రచారమా?
- కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూముల్లో పేదలకు వాటా ఇస్తే తప్పా?
- రూ. 60 లక్షల విలువైన ఇంటిని ఆరు లక్షలకే ఇస్తుంటే బీఆర్ఎస్‌కు కడుపుమంట
- డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పేరుతో పేదలను దగా చేసింది బిఆర్ఎస్
- ఇండ్ల కేటాయింపులో బడుగు బలహీన వర్గాలకు 50 శాతం రిజర్వేషన్లు
- బీఆర్ఎస్ తీరుపై మండిపడ్డ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

హైదరాబాద్ మహానగరం నడిబొడ్డులో పేదలకు గౌరవ ప్రదమైన సొంతింటిని అందించాలనే ప్రజా ప్రభుత్వ సంకల్పాన్ని చూసి బీఆరఎస్ నాయకత్వం తీవ్ర అసహనానికి గురవుతోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార,పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు.

2 వివరాలు





# పార్లమెంటులో ప్రతిష్టంభన

రాజ్యసభను కూడా మధ్యాహ్నం మూడు గంటల వరకూ వాయిదా పడింది. నీట్ పేపర్ లీక్ ఉదంతానికి ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలని లోక్‌సభ ప్రారంభం కాగానే ప్రతిపక్షాలు డిమాండ్ చేయడం ప్రారంభించాయి. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందేనని పట్టుబట్టాయి. ఈ క్రమంలో సభ పలుమార్లు వాయిదా పడింది. పేపర్ లీక్ జరిగినట్టు ప్రభుత్వం అంగీకరిస్తే వెంటనే విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్ డిమాండ్ చేశారు. రూల్ 267 కింద చర్చ చేపట్టాలని కోరుతుంటే ప్రభుత్వం అంగీకరించట్లేదని కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అన్నారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీని కేంద్రం అవమానించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా తరువాతే తాము ఏ చర్చకైనా సిద్ధమని స్పష్టం చేశారు. ప్రతిపక్షాల తీరుపై పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు మండిపడ్డారు. నీట్‌పై చర్చ నుంచి తప్పించుకోవాలని ప్రతిపక్షాలు చూస్తున్నాయని ఆరోపించారు. చర్చ ముందు షరతులు పెట్టడం భావ్యం కాదని అన్నారు. ఈ అంశంపై తన వాదన వినిపించే హక్కు ప్రభుత్వానికి కూడా ఉంటుందని అన్నారు. ఇదిలా వుంటే పార్లమెంట్ వెలుపల విపక్షాలు, బిజెపిలు పరస్పర ఆందోళనలకు దిగారు. నిరసలనతో హోరెత్తించారు. కాంగ్రెస్ ఇండియా కూటమి ఒకవైపు, ఎన్‌డిఎ నేతలు మరో వైపు నిలబడి నినాదాలు చేశారు.

# ఎల్‌నినోతో రాష్ట్రంలో తీవ్ర వర్షాభావం

## అధికారులతో మంత్రి పొన్నం సమీక్ష

## కార్యాచరణతో ముందుకు సాగాలని సూచన

సిద్దిపేట,జూలై23(నినాదం): ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయని తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు. దీనినుంచి బయటపడేలా కార్యాచరణతో సాగాలని అన్నారు. గురువారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ ఐఓసీ కార్యాలయంలో సిద్దిపేట, కరీంనగర్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు, అధికారులతో ఎల్‌నినో ప్రభావంపై మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హుస్నాబాద్ నియోజకవర్గంలోని ఏడు మండలాల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ..గ్రామీణ ప్రాంతాల్లో అధికారులు క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. స్వేచ్ఛగా ఎలాంటి ఒత్తిడి లేకుండా ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. భవిష్యత్తులో తాగునీటికి సంబంధించి ప్రధాన సమస్య వచ్చే అవకాశం ఉందని తెలిపారు. వచ్చే జూన్ వరకు వర్షాలు లేవని శాస్త్రవేత్తలు చెబుతున్నారన్నారు. పశువులకు పశుగ్రాసం ఇబ్బందులు తలెత్తకుండా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. వ్యవసాయానికి సంబంధించి కరవు పరిస్థితిలో ఆరుతడి పంటలు వేయాలని అన్నదాతలకు సూచిస్తున్నామని అన్నారు. గ్రౌండ్ వాటర్ రోజురోజుకూ పడిపోతోందని.. దీనిని పెంచేందుకు ప్రత్యేక యాక్షన్ ప్లాన్ ద్వారా ముందుకెళ్లాలని దిశానిర్దేశర చేశారు.

# గ్లోబరీనా ముమ్మాటికీ కేటీఆర్ బినామీ సంస్థ



బీఆరఎస్ నేతలు కన్నెపెల్లి పంపు హౌజ్ గురించి మాట్లాడుతున్నారని... మేడిగడ్డ గురించి ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. మేడిగడ్డ గురించి మాట్లాడితే ప్రజలు చెప్పుతో కొడతారని మండిపడ్డారు. మేడిగడ్డ కట్టింది, కూల్చింది బీఆరఎస్ వాళ్లే అని వ్యాఖ్యానించారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పక్రియ అయిపోయే వరకూ ఎమ్మెల్యేలను గ్రామాల్లోనే ఉండమని చెప్పానని ముఖ్యమంత్రి అన్నారు. సర్ నాయకులకు సంబంధించింది కాదని, ప్రజలకు సంబంధించిందని స్పష్టం చేశారు. 'తెలిసీ తెలియక నాకు రెండు ఓట్లు ఉన్నాయని అంటున్నారు. కలెక్టర్ అనుమతి తీసుకొని నా గ్రామంలో ఉన్న ఓటును కొడంగల్‌కు మార్చుకున్నాను. గతంలో కొడంగల్ ప్రాంతం కర్ణాటకలోని జిల్లాలో ఉండేది. భాషా ప్రయుక్త రాష్ట్రాలు చేసినప్పుడు కొడంగల్ పాలమూరులోకి వచ్చిందని చెప్పారు. బీజేపీ కుట్రపూరితంగా ఓట్లను తొలగించే అవకాశముందని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. గ్రామీణ ప్రాంతంలో అమాయకుల ఓట్లు పోయే అవకాశముందన్నారు. సర్ ఉద్దేశం ప్రక్షాళన అని.. కుట్రపూరితంగా సర్‌ను వాడుతున్నారని ఆరోపించారు. సర్ పట్ల జాగ్రత్తగా ఉండాల్సిందే అని చెప్పుకొచ్చారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ఓట్లు పోతే.. కాంగ్రెస్ ఓట్లు పోయినట్టే అని అన్నారు. అవగాహన లేకపోవడం, సరైన సమయంలో స్పందించకపోవడం వల్ల ఓట్లు పోయే అవకాశముందన్నారు. 'ఓటుహక్కు లేకపోతే పథకాలు పోతాయి.. ఓటుహక్కు లేకపోతే ఆధార్ పోతుంది. ఓటుహక్కు లేకపోతే గుర్తింపే ఉండదు... ఓటుహక్కు లేకపోతే సంక్షేమం రాదు' అని అన్నారు. బీజేపీలో అంతర్గత కలహాలు ఉన్నాయని రేవంత్ రెడ్డి అన్నారు. బీజేపీ నాయకులకు ఒకరంటే ఒకరికి పడదన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ఓట్లు ఎక్కడుంటాయో బీజేపీకి తెలుసని వెల్లడించారు. చిన్నచిన్న కారణాలతో ఓట్లు తొలగిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లకు 5 లక్షలు ఇవ్వాలని డిసైడ్ అయిందని చెప్పారు. బీఆరఎస్ నేతలు.. బ్రోకర్లకు అమ్ముకొని దళారీ వ్యవస్థ తెచ్చారని మండిపడ్డారు. 'మేం ఏం చేస్తున్నామో అదే చెప్తున్నాం' అని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 70 శాతం ఎసఐఆర్ పూర్తయిందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రక్షాళన పేరుతో ఓట్లు తొలగించే అవకాశం ఉందని.. అలా జరగకుండా ఉండేందుకు బీఎల్‌వోలను పెట్టామన్నారు. ఓట్లు లేకుంటే ప్రభుత్వ పథకాలు ఎలా వస్తాయని సీఎం ప్రశ్నించారు. గతంలో జీహెచఎంసీ పరిధిలో ఉన్న ఆంధ్ర ఓట్లన్నీ తొలగించారు. కాంగ్రెస్ పార్టీ కోర్టుకు వెళితే.. జీహెచఎంసీ కమిషనర్‌పై న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. హైడ్రా బాగా పనిచేస్తోంది.. చాలా ఆస్తులు స్వాధీనం చేసుకుంది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో నాణ్యతకు తిలోదకాలు ఇచ్చారు. ఆ ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతికి పాల్పడినందుకే హరీశ్‌రావుకు కొన్నాళ్లు మంత్రి పదవి ఇవ్వకుండా కేసీఆర్ పక్కన పెట్టారు. గత ప్రభుత్వంలో ఇంటర్ పేపర్ల మూల్యాంకనంలో జరిగిన తప్పిదాలతో 27 మంది విద్యార్థులు బలయ్యారు. గ్లోబరీనా సంస్థ విషయంలో కేటీఆర్ నిజాయతీ నిరూపించుకోవాలన్నారు. విద్యార్థుల మృతికి కారణమైన ఆయన క్షమాపణ చెప్పాలి. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు బీఆరఎస్ ఎందుకు డిమాండ్ చేయలేదని అన్నారు. పేదలకు ఇచ్చే ఇళ్లను బీఆరఎస్ నేతలు దళారులకు అమ్ముకున్నారు. జన్వాడ ఫాంహౌస్ భూములపై కేటీఆర్ విచారణ కోరాలి. మేం అధికారంలోకి వచ్చాకే ఇందిరాపార్కు వద్ద ధర్నా చౌక్‌ను తిరిగి ఓపెన్ చేశాం. నాడు వాళ్లు మూసిన ధర్నా చౌక్‌లోనే కేటీఆర్ ధర్నా చేస్తామంటున్నారని రేవంత్ వ్యాఖ్యానించారు.

# పేపర్ లీక్ కేసుల విచారణ కోసం ఫాస్ట్‌ట్రాక్ కోర్టు

ఈ విషయంలో అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. విద్యార్థుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు తాము కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు. అలాగే మన యువత భవిష్యత్తుకు హాని కలిగించే వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదు అని ఆయన స్పష్టం చేశారు. విద్యార్థుల ప్రయోజనాలను కాపాడటమే తమ తొలి ప్రాధాన్యమని పేర్కొన్నారు. 'మన యువత సంక్షేమం, వారి భవిష్యత్తు కంటే.. ఏదీ ముఖ్యం కాదు! పేపర్ లీకేజీల్లో ప్రమేయం ఉన్నవారికి త్వరితగతిన కఠిన శిక్షలు పడేలా ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. దీనికి సంబంధించి అవసరమైన అన్ని చర్యలు వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించాను. విద్యార్థుల ప్రయోజనాలను కాపాడేందుకు మేము తీసుకుంటున్న వరుస చర్యల్లో ఇది భాగం. యువత భవిష్యత్తును దెబ్బతీసేందుకు ప్రయత్నించే వారిని వదిలిపెట్టేది లేదు' అని ప్రధాని చెప్పారు.

# గ్లోబరినాతో మీరెందుకు ఒప్పందం చేసుకున్నారు

దీనికి సంబంధించి తమ న్యాయ బృందం త్వరలోనే ముఖ్యమంత్రికి లీగల్ నోటీసు పంపనున్నట్లు వెల్లడించారు. అలాగే, ముఖ్యమంత్రి తరచూ తనపై అసభ్యకరమైన, ఆధారరహిత ఆరోపణలు చేస్తున్నప్పటికీ వాటికి తాను ఎక్కువగా స్పందించలేదని కేటీఆర్ పేర్కొన్నారు. తన మౌనం ఆరోపణలను అంగీకరించినట్లు కాదని, నిరాధార విమర్శల స్థాయికి దిగజారి వాదించడం తనకు ఇష్టం లేదని వ్యాఖ్యానించారు.

**పగలు కాంగ్రెస్, రాత్రి బిజెపితో రేవంత్ సావాసం**

గ్లోబరీనా తన బినామీ సంస్థ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ఆరోపణలపై ఇప్పటికే పరువు నష్టం నోటీసులు పంపానని బీఆరఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. వరంగల్‌లో గురువారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించాల్సిన ముఖ్యమంత్రి.. ఒక్కసారి కూడా ప్రధాని నరేంద్ర మోదీ పేరును ప్రస్తావించలేదని విమర్శించారు. లోక్‌భవన్ ముందు ధర్నా చేయాల్సింది పోయి కొడంగల్‌లో ధర్నా చేయడం రాజకీయ నాటకం మాత్రమే అని విమర్శించారు. రేవంత్ రెడ్డి కాంగ్రెస్‌కు ఒక మ ట ఇస్తే, బీజేపీకి రెండు టలు పంపుతున్నారని ఆరోపించారు. నేను సీఐడీ విచారణకు సిద్ధం.. రేవంత్ రెడ్డి కుటుంబ అవినీతి అంశంలో సిట్, సీఐడీ విచారణకు సిద్ధమా' అంటే మాజీ మంత్రి సవాల్ విసిరారు. మోదీ పేరును ప్రస్తావించడానికి కూడా సీఎం భయపడుతున్నారన్నారు. ఓ వైపు పాత కేసుల భయం, మరోవైపు అమృత్ పథకం, ఇతర కాంట్రాక్టుల ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వంతో రాజీ రాజకీయాలు చేస్తున్నారన్నారు. గ్లోబరీనా సంస్థపై రేవంత్ రెడ్డి చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమన్నారు. రుజువు చేయాలని.. లేదంటే క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు

# విద్యార్థుల భవిష్యత్ నాశనం చేసిందే బిజెపి

నేరానికి పాల్పడిన దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని రాహుల్ గాంధీ ట్వీట్ చేశారు. మరోవైపు సీజేపీ కూడా మోదీ ప్రకటనపై దీటుగా స్పందించింది. మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నైతక బాధ్యత వహిస్తూ రాజీనామ చేయాలన్నారు. విద్యార్థులపై విచక్షణారహితంగా దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. తమ డిమాండ్స్ నెరవేర్చే వరకు ఉద్యమాన్ని ఆపే ప్రసక్తే లేదని స్పష్టం చేసింది.

# మెట్రో స్టేషన్ల మూసివేతపై సిజెఐ ఆగ్రహం

**న్యూఢిల్లీ,జూలై23(నినాదం):**

దేశ రాజధాని ఢిల్లీలో సీజేపీ నిరసనల నేపథ్యంలో పలు మెట్రో స్టేషన్లను మూసివేయడంపై భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సామాన్య ప్రజలతో పాటు సుప్రీంకోర్టుకు వచ్చే న్యాయవాదులు, వ్యాజ్యదారులు, కోర్టు సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, మధ్యాహ్నంలోగా పరిస్థితి సరిదిద్దకపోతే సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. సీజేపీ ఆధ్వర్యంలో జరుగుతున్న నిరసనలను కారణంగా చూపుతూ ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ వరుసగా రెండో రోజు కూడా 16 మెట్రో స్టేషన్లను మూసివేసింది. ఈ నిర్ణయంతో వేలాది మంది ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. మెట్రో స్టేషన్ల మూసివేత కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పేర్కొంటూ బార్ అసోసియేషన్ ఓ పిటిషన్ వేసింది. దీనిపై సీజేఐ స్పందిస్తూ.. మధ్యాహ్నం వరకు వేచి చూద్దామని, ఆ తర్వాత కూడా సమస్య పరిష్కారం కాకపోతే తాము జోక్యం చేసుకుంటామని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, నిరసనకారులు జంతర్ మంతర్ వద్ద తమ ఆందోళనను కొనసాగిస్తున్నారు.

# డిజిపి కార్యాలయంలో కానిస్టేబుల్ ఆత్మహత్య

**హైదరాబాద్,జూలై23(నినాదం):**

నగరంలో కానిస్టేబుల్ ఆత్మహత్య తీవ్ర కలకలం రేపుతోంది. తెలంగాణ రాష్ట్ర డీజీపీ కార్యాలయంలో కానిస్టేబుల్ స్వామి తన సర్వీస్ తుపాకీతో కాల్చుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు. గురువారం తెల్లవారుజామున 5:30 గంటల ప్రాంతంలో వాష్‌రూమ్‌లో స్వామి ఆత్మహత్య చేసుకున్నారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. స్వామి గ్రేహౌండ్స్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఘటనా స్థలిలో కానిస్టేబుల్ రాసిన సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 'ఏదైనా తప్పు చేసి ఉంటే నేను మాత్రమే చేశాను. నా భార్య, పిల్లలు ఏ తప్పూ చేయలేదు. నా భార్య, పిల్లల్ని ఏమీ అనొద్దు. వాళ్లు మంచివాళ్లు. నేను చనిపోయిన తర్వాత ఎవరైనా నా భార్యను పిల్లల్ని వేధించినా, హింసించినా దెయ్యమై వదిలిపెట్టను. ఎందుకంటే వాళ్లు అంటే నాకు చాలా ఇష్టం. అమ్మని, అక్కని జాగ్రత్తగా చూసుకో' అంటూ కొడుకుకు సూచిస్తూ డైరీలో స్వామి సూసైడ్ నోట్ రాశారు. కానిస్టేబుల్ బలవన్మరణంపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. స్వామి ఆత్మహత్యకు గల కారణాలపై ఆరా తీస్తున్నారు. కానిస్టేబుల్ మృతదేహాన్ని డీజీపీ కార్యాలయం నుంచి ఉస్మానియా మార్చురీకి తరలించారు. క్లూస్ టీం, ఫోరెన్సిక్ అధికారులు అక్కడకు చేరుకుని ఆధారాలను సేకరించే పనిలో ఉన్నారు. కానిస్టేబుల్ స్వామి రాసిన సూసైడ్ నోట్‌పై అధికారులు దర్యాప్తు చేపట్టారు. అయితే స్వామి సూసైడ్‌కు బెట్టింగ్ కారణమని ఉన్నతాధికారులు అనుమానిస్తున్నారు. విషయం తెలిసిన వెంటనే స్వామి కుటుంబసభ్యులు డీజీపీ కార్యాలయానికి చేరుకున్నారు. కానిస్టేబుల్ మృతితో భార్య, పిల్లలు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

# కాంగ్రెస్‌ది చిత్తశుద్ధి లేని పోరాటం

**ప్రధాని నివాసం ముందు ధర్నా ఓ నాటకం**

**సోనమ్ వాంగ్‌చుక్ భార్య విమర్శలు**

న్యూఢిల్లీ : న్యూఢిల్లీలోని ప్రధాని నివాసం ముందు ఈనెల 21న నీట్ పేపర్ లీక్ అంశంపై కాంగ్రెస్ నిరసన కార్యక్రమం చేపట్టడాన్ని సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ భార్య గీతాంజలి విమర్శించారు. కాంగ్రెస్ నిరసనల్లో చిత్తశుద్ధి లోపించిందని అన్నారు. జంతర్‌మంతర్ వద్ద విద్యార్థులు నిరసనకు దిగినప్పుడే కాంగ్రెస్ కూడా వచ్చి నిరసనల్లో పాలుపంచుకుని ఉండాల్సిందని వ్యాఖ్యానించారు. పేపర్ లీక్ ఉదంతంపై సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ జంతర్‌మంతర్ వద్ద తొలుత ఆమరణ దీక్ష ప్రారంభించిన విషయం తెలిసిందే. ఆ తరువాత పోలీసులు ఆయనను ఆసుపత్రికి తరలించడంతో ప్రస్తుతం అక్కడే దీక్షను కొనసాగిస్తున్నారు. నిరసనల్లో రాజకీయ పార్టీలు కూడా రంగ ప్రవేశం చేయడంపై వాంగ్‌చుక్ భార్య పలు కీలక వ్యాఖ్యలు చేశారు. వాంగ్‌చుక్ పేరుప్రఖ్యాతులను తమకు అనుకూలంగా వాడుకునేందుకు రాజకీయ పక్షాలు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. అయితే, ప్రజలను మభ్యపెట్టడం ఇక సాధ్యం కాదని అన్నారు. చిత్తశుద్ధి లేని వారిని యువతే పంపించేస్తారని అన్నారు. కాక్రోచ్ జనతా పార్టీ సారథ్యంలో నిరసనలు రాజకీయ పక్షాలకు గట్టి సందేశం పంపించాయని ఆమె అన్నారు. తమ దృష్టిలో పార్లమెంటే అత్యున్నత వ్యవస్థ అని, తమకు ఇక ప్రతిపక్షం, పాలకపక్షం లేదని వ్యాఖ్యానించారు. పార్లమెంటే ఈ అంశంపై దృష్టి సారించాలని కోరుతున్నామని అన్నారు. రాజకీయ లక్ష్యాలు లేని వారు తమతో కలిసి రావచ్చని అన్నారు. నిజాయతీ, స్వచ్ఛత పునాదిగా ఈ ఉద్యమం ఆరంభమైందని గీతాంజలి చెప్పారు. సొంత ఎజెండాలతో వచ్చే వారు తమంతట తామే పక్కకు తప్పుకోవాల్సి వస్తుందని అన్నారు. పార్లమెంటు వరకూ విద్యార్థులు చేపట్టిన మార్చ్‌ను కేంద్రం అడ్డుకోవడాన్ని వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ, పార్టీ ఇతర నేతలు జులై 21న ప్రధాని నివాసం ముందు నిరసనకు దిగిన విషయం తెలిసిందే. దీంతో, పోలీసుల రాహుల్ గాంధీని అక్కడి నుంచి బలవంతంగా తరలించాల్సి వచ్చింది.

# అన్ని క్రెడిట్లు ఖాతాలో వేసుకుంటారు కదా

విద్యార్థులపై లాఠీఛార్జ్ క్రెడిట్ కూడా మీదేనా

ప్రధాని మోడీపై ప్రియాంక సెటైర్లు

న్యూఢిల్లీ : నీట్ పేపర్ లీక్, చలో పార్లమెంట్ నేపథ్యంలో విద్యార్థులపై పోలీసుల దాడి ఘటనలపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ప్రధాని మోదీపై విమర్శలు గుప్పించారు. దేశ యువత ఏ విజయం సాధించినా తన ఖాతాలో వేసుకునే ప్రధాని.. విద్యార్థులపై దాడులకు కూడా బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. గురువారం పార్లమెంట్ ఆవరణలో ఆమె మీడియాతో మాట్లాడుతూ.. విద్యార్థులను తాను ఎంతో ప్రేమగా చూసుకుంటానని సోషల్ మీడియా వేదికగా పోస్టులు పెట్టే ప్రధాని మోదీ.. వారిపై బాష్పవాయువు ప్రయోగించి, లాఠీఛార్జ్ చేయించారని విమర్శించారు. అధికార పక్షానికి చెందిన ఎంపీలు పార్లమెంట్ బయట నిల్చొని ఆందోళన చేయడం ఎప్పుడైనా చూశామా? ఇష్టమొచ్చినట్లుగా లాఠీలతో కొట్టారు. ఇదేం ప్రజాస్వామ్యం? క్రీడల్లో పతకాలు సాధిస్తే.. తన వల్లే వచ్చిందని.. మోదీ ఆ క్రెడిట్‌ను తన ఖాతాలో వేసుకుంటారు. అంగారకుడిపైకి వెళ్లినా, రాకెట్లు ప్రయోగించినా వాటినీ తన ఖాతాలోనే వేసుకుంటారు. ఆయన అధికారంలో ఉన్నప్పుడు దాదాపు 152 పేపర్ లీకేజీలు జరిగాయి. వాటికి బాధ్యులెవరు? ప్రస్తుతం విద్యార్థులపై జరుగుతున్న దాడులకు బాధ్యులెవరు? విజయాలను తన ఖాతాలో వేసుకుంటున్న మోదీ.. వీటికి కూడా బాధ్యత వహించాలని ప్రియాంక గాంధీ డిమాండ్ చేశారు.

## మహానగరం నడిబొడ్డున

# పేదోడికి ఇల్లు ఉండొద్దా

**హైదరాబాద్,జూలై 23(నినాదం):**

హైదరాబాద్ మహానగరం నడిబొడ్డులో పేదలకు గౌరవ ప్రదమైన సొంతింటిని అందించాలనే ప్రజా ప్రభుత్వ సంకల్పాన్ని చూసి బీఆరఎస్ నాయకత్వం తీవ్ర అసహనానికి గురవుతోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార,పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. నిరుపేదలు నివసిస్తున్న ప్రాంతంలోనే వారి సొంతింటి కలను నెరవేర్చడానికి నియోజకవర్గాన్ని యూనిట్ గా తీసుకొని వారు నివసిస్తున్న ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తున్నామని అన్నారు. ఈ ఇళ్ల కోసం స్థానికంగా అందుబాటులో ఉన్న మీ సేవ కేంద్రాలలో దరఖాస్తు చేసుకోవాలని విజ్ఞప్తి చేసారు. అదేవిధంగా మీసేవ వాట్సాప్ నెంబర్ (8096958096), వెబ్‌సైట్ ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. గురువారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో ఇందిరమ్మ ఇండ్లు, దరఖాస్తులు తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. సమీక్ష అనంతరం మంత్రి మాట్లాడుతూ పదేళ్ల పాలనలో వారు చేయలేని పనిని గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుంటే ప్రజలను తప్పుదోవ పట్టించేలా విష ప్రచారాలతో రాజకీయ లబ్ధిపొందాలని బీఆరఎస్ ప్రయత్నిస్తోంది. పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆరఎస్ ప్రభుత్వం హైదరాబాద్‌లో పేదల సొంతింటి కలను నెరవేర్చలేక పోయింది. నగరంలోనే పుట్టి పెరిగి అక్కడే జీవిస్తున్న నిరుపేద కుటుంబాలకు నగర నడిబొడ్డులో సొంతింటిని సమకూర్చవలసిన బాధ్యతను విస్మరించి, వారిని నగరానికి దూరంగా నెట్టివేసింది. ఉద్యోగాలు, ఉపాధి, పిల్లల చదువులు, వైద్య సౌకర్యాలకు దూరంగా 30?40 కిలోమీటర్ల దూరంలో కనీస వసతులు కల్పించకుండా అరకొరగా ఇళ్లను నిర్మించి అదే పేదల సంక్షేమమని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. ప్రజా ప్రభుత్వం పేదోడు కూడా హైదరాబాద్ నడిబొడ్డులోనే గౌరవంగా జీవించాలనే భావనతో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ప్రభుత్వ భూములను ప్రజల సంక్షేమం కోసం వినియోగిస్తూ పేదలకు శాశ్వత భరోసా కల్పించే చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంటే దానిపైనా బీఆరఎస్ విషప్రచారం చేస్తోంది.పేదోడు హైదరాబాద్‌లో ఉండకూడదా? నగరంలో అత్యంత విలువైన ప్రభుత్వ భూములలో పేదలకు ఇళ్లు నిర్మించకూడదా? ప్రభుత్వ భూములు కొద్దిమంది కోసం మాత్రమేనా? పేదల కోసం వినియోగిస్తే ఎందుకింత కడుపుమంటని అన్నారు. పేదోడిపై తుపాకి పెట్టి రాజకీయాలు చేయాలనుకోవడం అత్యంత దుర్మార్గం. బీఆరఎస్ చేస్తున్న విష ప్రచారాలను, కపట నాటకాలను హైదరాబాద్ మహానగర ప్రజలు గమనించాలి,



పేదల సంక్షేమాన్ని అడ్డుకునే రాజకీయాలను తిప్పికొట్టాలన్నారు. హైదరాబాద్‌లో సొంత ఇల్లు లేని మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి కుటుంబాలకు అందుబాటు ధరలో నాణ్యమైన గృహాలను అందించడమే లక్ష్యం. గతంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను ఇందిరమ్మ టవర్స్ గా మార్చి విక్రయిస్తారన్న ప్రచారం పూర్తిగా అవాస్తవం. ప్రభుత్వం ప్రకటించిన మార్గదర్శకాల ప్రకారమే ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం జరుగుతుందన్నారు. లబ్ధిదారుల మీద ఆర్థిక భారం తగ్గించడానికి ప్రభుత్వం రూ.5 లక్షల సబ్సిడీ ఇస్తోంది. ఇది అమ్మకం కాదు, ప్రభుత్వ ఆర్థిక సహకారం. లబ్ధిదారుడి వాటా అన్ని ప్రాంతాల్లో రూ.6 లక్షలు మాత్రమే. ప్లాట్ల మార్కెట్ విలువ తొలి విడతలో ప్రారంభించనున్న 16 నియోజకవర్గాలలో రూ.40 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు ఉంటుందన్నారు. క్యూర్ పరిధిలో తొలి విడతగా ప్రయోగాత్మకంగా నిర్మించే ఇందిరమ్మ ఇళ్లలో యాజమాన్య హక్కుల రిజర్వేషన్‌కు సంబంధించి ఎస్సీలకు 14 శాతం, ఎస్టీలకు 5శాతం, బిసీలకు 16 శాతం, దివ్యాంగులకు 5 శాతం , ప్రభుత్వ అవుట్ సోర్సింగ్, 4వ తరగతి ఉద్యోగులు, పారిశుధ్య కార్మికులకు 10 శాతం చొప్పున మొత్తం 50 శాతం రిజర్వేషన్ కల్పిస్తున్నాం. ఈ 50 శాతం రిజర్వేషన్లలో కూడా 30 శాతం మహిళలకే కేటాయిస్తున్నాం. మిగిలిన 50 శాతం వాటా జనరల్ కేటగిరీలో కేటాయిస్తాం. పేద మధ్యతరగతి ప్రజల మీద బిఆరఎస్ కు... ఆ పార్టీ లోని దొరలకు ఏ మాత్రం అభిమానం, ప్రేమ ఉంటే విష ప్రచారాన్ని మానుకుంటారని ఆశిస్తున్నాను. ఈ విష ప్రచారాన్ని ఇదేవిధంగా కొనసాగిస్తే జూబ్లీ హిల్స్, కంటోన్మెంట్ ఉప ఎన్నికలలో పట్టిన గతే రాష్ట్ర వ్యాప్తంగా పడుతుందని మంత్రి పొంగులేటి వ్యాఖ్యానించారు.

# నేడు దేశవ్యాప్త ఆందోళనలు

**న్యూఢిల్లీ,జూలై23(నినాదం):**

నీట్ పేపర్ లీక్‌కు కేంద్రం బాధ్యత వహించాలంటూ ఉద్యమిస్తున్న కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) 24న శుక్రవారం దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చింది. ఇటీవలి జంతర్‌మంతర్`పార్లమెంటు ర్యాలీ సందర్భంగా యువతపై పోలీసుల కర్కశత్వాన్ని వ్యతిరేకిస్తూ ఈ నిరసనకు పిలుపునిచ్చినట్టు తెలిపింది. ఈ కార్యక్రమానికి కావాల్సిన అనుమతులు, ఇతర ఏర్పాట్లకు సిద్ధం కావాలని యువతను కోరింది. శాంతియుతంగానే నిరసనలు ఉండాలని కూడా సూచించింది. పేపర్ లీక్ అంశంపై చర్చకు తాము సిద్ధమని కేంద్రం ప్రకటించిన నేపథ్యంలో కాక్రోచ్ జనతా పార్టీ మరో నిరసన కార్యక్రమానికి సిద్ధం కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ నిరసన కార్యక్రమానికి కావాల్సిన అనుమతులు పొందేందుకు, ఏర్పాట్లు చేసేందుకు విద్యార్థి సంఘాలు, యూత్ ఆర్గనైజేషన్లు కలిసి పనిచేయాలనీ సీజేపీ పిలుపునిచ్చింది. నీట్ పేపర్ లీక్ అంశంలో సీజేపీ డిమాండ్స్ గురించి ఈ నిరసనల్లో బహిరంగంగా చదవాలని పేర్కొంది. బాధితులకు సంఘీభావంగా ఇంక్విలాబ్ జిందాబాద్, భారత్ మాతాకీ జైవంటి నినాదాలు చేయాలని కూడా సూచించింది. నిరసనల్లో కేవలం సానుకూల నినాదాలను మాత్రమే చేయాలని చెప్పింది. ఎలాంటి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయొద్దని పేర్కొంది. నిరసనకు అనుమతి ఉన్న ప్రాంతాలకే పరిమితం కావాలని, ట్రాఫిక్‌కు ఆటంకాలు లేకుండా చూసుకోవాలని సూచించింది. రెచ్చగొట్టే చర్యలకు స్పందించవద్దని కూడా పేర్కొంది. ఇక నీట్ ఉదంతంపై విచారణ కోసం కేంద్రం ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేసేందుకు సిద్ధమైన విషయం తెలిసిందే. ఇదిలావుంటే సీజేపీ ఆందోళనల నేపథ్యంలో న్యూదిల్లీ ట్రేడర్స్ అసోసియేషన్ (ఎన్‌డీటీఏ) కీలక నిర్ణయం తీసుకుంది. ఆందోళనల తీవ్రత అధికంగా ఉన్న కన్నాట్ ప్లేస్ ప్రాంతంలో గురువారం సాయంత్రం 6:30కే దుకాణాలు, కార్యాలయాలు మూసివేయాలని ఆదేశాలు జారీ చేసింది. అందుకు యజమానులు సహకరించాలని కోరింది. ఎన్‌డీటీఏ ఆదేశాలను ఆమఆద్మీపార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ఎక్స్‌లో పోస్టు చేశారు. సాయంత్రం 6:30 గంటలకే దుకాణాలు మూసేయమనడం, జంతర్‌మంతర్ వద్ద పోలీసులను మోహరించడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఆందోళన చేస్తున్న విద్యార్థులపై కేంద్రం మరోసారి బలప్రయోగం చేయాలని చూస్తోందని ఆరోపించారు.

## సిజెపి ఆందోళనలపై పోలీసుల దృష్టి

**హింసాత్మక ఘటనలపై పోలీసుల కూపీ**

**అవసరమైతే పాస్‌పోర్టులు రద్దు చేసేందుకు సిద్ధం ?**

న్యూఢిల్లీ : కాక్రోచ్ జనతా పార్టీ నిరసనల సందర్భంగా చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలపై ఢిల్లీ పోలీసులు కఠిన చర్యలకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. హింసలో పాల్గొన్న వారి పాస్‌పోర్ట్‌లను రద్దు చేసే అవకాశం ఉందని పోలీసు వర్గాలు తెలిపాయి. నిరసనల సమయంలో జరిగిన ఘటనలకు సంబంధించిన ఆధారాలను పోలీసులు సేకరిస్తున్నారు. సీసీటీవీ దృశ్యాలు, వీడియోలు, ఫొటోలు, ఇతర డిజిటల్ ఆధారాల ఆధారంగా హింసలో పాల్గొన్న వారిని గుర్తించే పక్రియ కొనసాగుతున్నట్లు సమాచారం. కాగా, నీట్ పేపర్ లీక్ వ్యవహారం, విద్యావ్యవస్థలో అవకతవకలకు నిరసనగా కాక్రోచ్ జనతా పార్టీ ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద




ఆందోళనలు చేపట్టిన సంగతి తెలిసిందే. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని సీజేపీ డిమాండ్ చేస్తోంది. ఈ నేపథ్యంలోనే బుధవారం అర్ధరాత్రి ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ఆందోళనకారులు`పోలీసుల మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణల్ని అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు లాఠీఛార్జ్ చేయడంతో కొందరు నిరసనకారులు రాళ్లు రువ్వారు. ఈ ఘటనలో ఇద్దరు అసిస్టెంట్ పోలీస్ కమిషనర్లతో పాటు ఆరుగురు పోలీస్ సిబ్బంది గాయపడ్డారు. ఈ నేపథ్యంలోనే హింసాత్మక ఘటనల్లో పాల్గొన్న వారి పాస్‌పోర్ట్‌లను రద్దు చేసే అవకాశం ఉందని తెలుస్తోంది.

సైబర్ మోసాల నియంత్రణకు సాంకేతికతతో పాటు

# ప్రజల్లో అవగాహనే కీలకం

• రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్



**వనపర్తి ప్రతినిధి, జూలై 23 (నినాదం):** సైబర్ మోసాల నియంత్రణకు సాంకేతికతతో పాటు ప్రజల్లో అవగాహన కీలకమని రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ అన్నారు. గురువారం డీజీపీ కార్యాలయం నుండి రాష్ట్రంలోని పోలీసు కమిషనర్లు, జిల్లా ఎస్పీలు, క్షేత్రస్థాయి పోలీసు అధికారులతో రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ సైబర్ నేరాలపై దృశ్య సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్రంలో ఎలాంటి తరహా సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయో వాటికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు, సైబర్ నేరాల నివారణలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయం నుండి ఎస్పీ సునీతా రెడ్డి, జిల్లా పోలీసు అధికారులతో పాల్గొని జిల్లాలో నమోదైన సైబర్ నేరాలపై డీజీపీకి వివరించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ రాష్ట్రంలో సైబర్ నేరాలు రోజురోజుకూ కొత్త రూపాలు దాలుస్తున్న నేపథ్యంలో ప్రతి పోలీసు అధికారి అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. పెట్టుబడుల పేరుతో మోసాలు, డిజిటల్ అరెస్ట్, ట్రేడింగ్ యాప్‌లు, పార్ట్‌టైమ్ ఉద్యోగాలు, ఆన్‌లైన్ లోన్ యాప్‌లు, సోషల్ మీడియా, ఫేక్ వెబ్‌సైట్లు, క్యూఆర్ కోడ్‌లు, ఓటీపీలు, యూపీఐ, క్రెడిట్ కార్డు మోసాలు వంటి సైబర్ నేరాలపై ప్రజల్లో విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని ఆదేశించారు. సైబర్ నేరం జరిగిన వెంటనే బాధితులు ఆలస్యం చేయకుండా 1930 హెల్ప్‌లైన్ లేదా నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేసే మోసపోయిన నగదును వెంటనే ట్రాక్ చేసి సంబంధిత బ్యాంకు ఖాతాల్లో ఫ్రీజ్ చేసే ప్రక్రియను అత్యంత వేగంగా పూర్తి చేయాలని అధికారులను సూచించారు. ప్రతి నిమిషం విలువైనదని, వెంటనే స్పందిస్తే బాధితుల డబ్బును కాపాడే అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. ఫ్రీజ్ చేసిన మొత్తాన్ని దర్యాప్తు పూర్తయ్యాక చట్టపరమైన ప్రక్రియలను వేగవంతంగా పూర్తి చేసి కోర్టుల అనుమతితో బాధితుల బ్యాంకు ఖాతాలకు త్వరితగతిన విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని డీజీపీ ఆదేశించారు. మోసపోయిన ప్రతి రూపాయి బాధితులకు తిరిగి అందించేందుకు దర్యాప్తు అధికారులు, సైబర్ క్రైమ్ పోలీసులు, బ్యాంకులు, ఫైనాన్షియల్ ఇంటెలిజెన్స్ సంస్థలు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. జిల్లాలో నమోదయ్యే ప్రతి సైబర్ కేసును అత్యంత ప్రాధాన్యతతో దర్యాప్తు చేసి నేరస్తుల బ్యాంకు ఖాతాలు, మొబైల్ నంబర్లు, డిజిటల్ లావాదేవీలు, ఐపీ అడ్రస్‌లు, సాంకేతిక ఆధారాలను విశ్లేషించి నిందితులను గుర్తించి చట్టం ముందు నిలబెట్టాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ బాధితులకు న్యాయం అందించడమే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజలు అపరిచిత వ్యక్తులకు ఓటీపీలు, పాస్‌వర్డులు, బ్యాంకు వివరాలు, యూపీఐ పిన్‌లు తెలియజేయవద్దని, అనుమానాస్పద లింకులు, యాప్‌లు, పెట్టుబడి ఆఫర్లు, డిజిటల్ అరెస్ట్ పేరుతో వచ్చే కాల్స్‌ను నమ్మవద్దని డీజీపీ హెచ్చరించారు. సైబర్ నేరాలను అరికట్టడంలో పోలీసుల కృషితో పాటు ప్రజల అప్రమత్తత కూడా అత్యంత కీలకమని, అప్రమత్తతే సైబర్ మోసాలకు శాశ్వత పరిష్కారం అని డీజీపీ వెల్లడించారు. ఈ దృశ్య సమీక్ష సమావేశంలో వనపర్తి డిసిఆర్బి డీఎస్పీ బాలాజీ నాయక్, సైబర్ క్రైమ్ డీఎస్పీ శ్రీను నాయక్, సైబర్ క్రైమ్ ఎస్సై రవి ప్రకాష్, స్పెషల్ బ్రాంచ్ ఎస్సైలు మంజునాథ్ రెడ్డి, నరేష్, డిసిఆర్బి ఎస్సై తిరుపతిరెడ్డి, ఐటి కోర్ సిబ్బంది గోవింద్, రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.


పంజాబ్ నేషనల్ బ్యాంక్ / punjab national bank

**పంజాబ్ నేషనల్ బ్యాంక్,**
బ్రాంచ్ ఆఫీస్: ARMB హైదరాబాద్.
ARMB, హైదరాబాద్ - ప్లాట్ నం. 3, 1వ అంతస్తు, రీజెన్సీ ప్లాజా, మైత్రివిహార్ ఏరియా, అమీర్‌పేట, హైదరాబాద్ - 500016. ఇ మెయిల్ ఐడి: cs4732@pnb.bank.in

**స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకపు ప్రకటన**

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(6)కు నిబంధనలతో చదవబడు విధంగా స్థిరాస్తుల అమ్మకము కొరకు ఇ-వేలం అమ్మకపు ప్రకటన.
ఈ నోటీసు ద్వారా ప్రత్యేకించి రుణగ్రహీత(లు) మరియు హామీదారు(లు) మరియు సాధారణ ప్రజానీకమునకు తెలియజేయడమేమనగా సెక్యూర్డ్ క్రెడిటార్‌కు క్రింద తెలిపిన స్థిరాస్తిని తనఖా/కుదువ పెట్టగా సెక్యూర్డ్ క్రెడిటార్/బ్యాంకు యొక్క అధీకృత అధికారిగా వాటిని నిర్మాణాత్మకముగా/ భౌతికముగా/లాంఛనముగా స్వాధీనము చేసుకొని సంబంధిత రుణగ్రహీత(లు) మరియు హామీదారు(లు)ల నుండి బ్యాంకు/సెక్యూర్డ్ క్రెడిటార్‌కు చెందిన బకాయిలను వసూలు చేసుకొనుటకు క్రింద తెలిపిన పట్టికలో తెలియజేసిన తేదీన "ఎక్కడ ఎలా ఉందో అది అలా" "ఏది ఎలా ఉంటే అది అలా" మరియు "ఏదైతే ఎలా ఉందో అది అలానే" ప్రాతిపదికన అమ్మబడును. రిజర్వు ధర మరియు ధరావత్తు సొమ్మును క్రింద తెలిపిన పట్టికల్లో సంబంధిత ఆస్తుల ఎదురుగా తెలియజేయడమైనది.

**సెక్యూర్డ్ ఆస్తుల యొక్క షెడ్యూల్**

| లాట్ నెం. | బ్రాంచ్ పేరు ఖాతా పేరు రుణగ్రహీత/హామీదార్ల పేరు & చిరునామాలు ఖాతా | తనఖాపెట్టిన స్థిరాస్తుల వివరణ /యజమాని పేరు (తనఖాదారుల యొక్క ఆస్తి) | ఎ) SARFAESI యాక్ట్, 2002లోని సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసు తేది బి) 13(2) నోటీసు నాటికి రావలసిన బకాయి మొత్తం సి) SARFAESI యాక్ట్, 2002లోని సెక్షన్ 13(4) క్రింద స్వాధీనతా తేది డి) స్వాధీనతా స్వభావం లాంఛన ప్రాయంగా/ భౌతికముగా/ నిర్మాణాత్మకముగా | ఎ) రిజర్వు ధర బి) బయానా సి) బిడ్డు పెంపుదల మొత్తం | ఇ-వేలం తేది / సమయం | సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తెలిసిన తాకట్టు రుణభారాల వివరాలు |
|---|---|---|---|---|---|---|
| 1 | పిఎన్‌బి, సనత్ నగర్ (068700) శ్రీమతి చెన్నమనేని పద్మజ భర్త సిహెచ్. శ్రీధర్ రావు 1-4-881/4/3, ఎస్‌బిహెచ్ కాలనీ, న్యూ బాకారం, దేవి చౌక్, గాంధీ నగర్, హైదరాబాద్ - 500080. | శ్రీమతి చెన్నమనేని పద్మజ భర్త సిహెచ్ శ్రీధర్ రావు పేరున ఉండి తెలంగాణ, హైదరాబాద్, కవాడిగూడ, పి&టి కాలనీ వద్ద గల ప్లాట్ నెం. 43లో నెం. 1-3-183/40/21/43 (పాత నెం. 1-3-183/40/43) పిటిఐఎన్ నెం. 1090100979 గల ఆవరణలో "సుషిత రెసిడెన్సీ"గా పిలువబడే కాంప్లెక్స్‌లో 360 చ.గ.లలో 65 చ.గ.ల విస్తీర్ణము గల భూమి అవిభాజ్యవాటాతో పాటు 1700 చ.అ.ల సూపర్ బిల్టప్ ఏరియా కలిగియుండి (కామన్ ఏరియాలు, బాల్కనీలు మరియు స్టిల్ట్ ఫ్లోర్‌లో 1 కార్ పార్కింగ్ స్థలం 150 చ.అ.లుతో పాటు) మొత్తం మొదటి అంతస్తు గల ఆస్తి యావత్తు. **సరిహద్దులు: ఉత్తరం:** 7'9" వెడల్పు కారిడార్, లిఫ్ట్, స్టెయిర్‌కేస్, **దక్షిణం:** ఖాళీ ప్రదేశము, **తూర్పు:** ఖాళీ ప్రదేశము, **పడమర:** ఖాళీ ప్రదేశము. | ఎ) 30.05.2025 బి) రూ. 70,79,017.92 + తేది: 01.03.2026 నుంచి తదుపరి వడ్డీ మరియు ధరలు సి) 03.09.2025 డి) లాంఛనప్రాయ | A) Rs.95,60,000/- B) Rs. 9,56,000/- C) Rs. 1,00,000/- | 12.08.2026 ఉ॥ 11.00గం॥ల నుండి సా॥ 4.00 గం॥ల వరకు | అధీకృత అధికారికి తెలిసినంతవరకూ ఎటువంటి తాకట్టు రుణభారములు లేవు. బిడ్డర్లు బిడ్డింగ్‌కి పూర్వమే క్షుణ్ణముగా తమ స్వంత విచారణ జరుపుకోవలెను |
| 2 | హైదరాబాద్ సెకండ్ లాన్సర్ బ్రాంచ్ (156500) శ్రీ ఖాజా అహ్మద్ యాకూబ్ అలీ, ఫ్లాట్ నెం.102, పార్క్ వ్యూ రెసిడెన్సీ, ఇంటి. నెం. 9-4-116/50, బాలారెడ్డి నగర్ కాలనీ, టోలి చౌకి, హైదరాబాద్ -500008. మరియు శ్రీ ఎస్. రవీందర్ తండ్రి మారుతీ రావు (హామీదారు) ఇ.నెం. 20-121, దయానంద్ నగర్, మల్కాజ్‌గిరి, హైదరాబాద్-500047. | జిల్లా రిజిస్ట్రార్ రంగారెడ్డి (ఈస్ట్) జాయింట్ సబ్ రిజిస్ట్రార్-11, మల్కాజ్‌గిరి అధికార పరిధి క్రింద రంగారెడ్డి జిల్లా, మల్కాజ్‌గిరి సర్కిల్ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మౌలాలి, శ్రామిక నగర్ కాలనీలలో గల సర్వే నెం. 353/1 క్రింద 554 చ.గ.లు లేదా 463.14 చ.మీ.ల భూమి విస్తీర్ణంలో 69.25 చ.గ.లు లేదా 57.89 చ.మీ.ల అవిభాజ్యవాటాతో వాటిలో ఏర్పాటు చేసిన పార్కింగ్ ఏరియాలో కేటాయించిన కారు పార్కింగ్ స్థలం 100 చ.అ.లతో కలిపి ప్లాట్ నెం.39పై ఆవరణ నెం.42-259 వద్ద "స్వాతి సాయి ప్యారడైజ్" నివాస కాంప్లెక్స్ 4వ అంతస్తులో 1485 చ.అ.ల సూపర్ బిల్టప్ ఏరియా కలిగి నివాసిత ఫ్లాట్ నెం.401 యావత్తు. **ఫ్లాట్ సరిహద్దులు: ఉత్తరం:** ఖాళీ ప్రదేశం, **దక్షిణం:** ఖాళీ ప్రదేశం, **తూర్పు:** ఖాళీ ప్రదేశం, **పడమర:** కారిడార్ మెట్లు మరియు లిఫ్ట్. **కాంప్లెక్స్ సరిహద్దులు: ఉత్తరం:** ప్లాట్ నెం.40పై ఇల్లు, **దక్షిణం:** ప్లాట్ నెం.38పై ఇల్లు, **తూర్పు:** 40' వెడల్పు రోడ్డు (అంతర్గత రోడ్డు), **పడమర:** పార్కు. | ఎ) 03.04.2018 బి) రూ. 1,14,00,594.25 + తేది: 01.03.2026 నుంచి తదుపరి వడ్డీ మరియు ఇతర చార్జీలు. సి) 18.06.2018 డి) భౌతికముగా | A) Rs.42,77,000/- B) Rs.4,27,700/- C) Rs.50,000/- | 12.08.2026 ఉ॥ 11.00గం॥ల నుండి సా॥ 4.00 గం॥ల వరకు | అధీకృత అధికారికి తెలిసినంతవరకూ ఎటువంటి తాకట్టు రుణభారములు లేవు. బిడ్డర్లు బిడ్డింగ్‌కి పూర్వమే క్షుణ్ణముగా తమ స్వంత విచారణ జరుపుకోవలెను చెల్లింపు కొరకు నిర్వాహణ చార్జీలు మరియు ఆస్తి పన్నులు సుమారుగా రూ. 1.20 లక్షలు పెండింగ్ లో ఉన్నాయి. |

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 క్రింద ఆస్తులను విడిపించుకొనుటకు నోటీసుగా ఈ నోటీసు పరిగణించబడును.
**ఇ-వేలము అమ్మకము నియమ నిబంధనలు :** సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లో నిర్దేశించిన నియమ నిబంధనలకు & తదుపరి నిబంధనలకు లోబడి అమ్మకం ఉండును. 1) సదరు ఆస్తులను **"ఏది ఎక్కడ ఎలా ఉన్నదో అది అక్కడ అలానే" "ఏది ఎలా ఉందో అది అలా" మరియు "ఏదైతే ఎలా ఉందో అది అలానే"** ప్రాతిపదికన విక్రయించబడును. 2) పైన తెలిపిన షెడ్యూల్‌లో నిర్దేశించిన సెక్యూర్డ్ ఆస్తుల వివరాలు అధీకృత అధికారికి తెలిసిన సమాచారం మేరకు తెలుపబడినవి. కానీ అధీకృత అధికారి ఈ ప్రకటనలో ఏదేని తప్పిదము, అసంబద్ధత లేదా వైఫల్యములకు జవాబుదారి కాదు. 3) అమ్మకం వెబ్‌సైట్ https://baanknet.com వద్ద ఏర్పాటు చేసిన ఇ-వేలం ప్లాట్‌ఫారం ద్వారా దిగువ సంతకముదారుచే నిర్వహించబడును. 4) అమ్మకం యొక్క వివరమైన నియమనిబంధనల కొరకు https://pnb.bank.in & www.baanknet.com ను రెఫర్ చేయగలరు.
తేది: 21.07.2026, ప్రదేశము: హైదరాబాద్ — అధీకృత అధికారి, పంజాబ్ నేషనల్ బ్యాంక్

**SARFAESI చట్టం 2002 లోని రూల్8(6) క్రింద చట్టబద్ధ అమ్మకపు ప్రకటన**


## ఘనంగా టీజేఏ 12వ వార్షికోత్సవ వేడుకలు



**నాగర్ కర్నూల్ జూలై 23 (నినాదం) :** కల్వకుర్తిలో తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ టీజేఏ 12వ వార్షికోత్సవ వేడుకలు పురస్కరించుకొని ప్రభుత్వ ఆసుపత్రిలో సూపరింటెండెంట్ డా. శివరాం తో కలిసి రోగులకు పండ్లు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీనియర్ జర్నలిస్టు ప్రహ్లాద్, అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు దస్తగిరి హాజరయ్యారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిజం అనేది కేవలం వార్తలు రాయడం మాత్రమే కాదని సమాజానికి నిజాలను చేరవేయడం ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడం ప్రజాస్వామ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషించడం జర్నలిస్టుల బాధ్యత అని అన్నారు. అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడిటేషన్ కార్డులు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, ఇండ్లస్థలాలు, వచ్చేవరకు టీ.జే.ఏ ఆధ్వర్యంలో కార్యక్రమాలు చేపట్టనున్నామని జర్నలిస్టుల సంక్షేమమే టీ.జే.ఏ ప్రధాన లక్ష్యం మన్నారు. అనంతరం సీనియర్ జర్నలిస్టు ప్రహ్లాద్, టీజేఏ జిల్లా నాయకులు అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు దస్తగిరి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కంచర్ల శ్యాంసుందర్, శ్రీనివాస్ రెడ్డి , విజయేందర్ రెడ్డి, యూసఫ్ బాబా, అస్లామ్ హబీబ్ గణేష్ బాలరాజ్ ప్రసాద్ బాలచందర్ కె దామోదర్ గిరి బాలకృష్ణ హేమంత్ పాండు హుస్సేన్ మనీ తదితరులు పాల్గొన్నారు.


పంజాబ్ నేషనల్ బ్యాంక్ ...भरोसे का प्रतीक ! / punjab national bank ...the name you can BANK upon !

MCC హైదరాబాద్, డోర్ నం. 4-1-427, మొదటి అంతస్తు, బ్యాంక్ స్ట్రీట్, ట్రూప్ బజార్, హైదరాబాద్ - 500001.

**అనుబంధము-IV (రూల్ 8(1)**
**స్వాధీనతా ప్రకటన** (స్థిరాస్తి కొరకు)

ఇందుమూలముగా తెలియజేయడమేమనగా సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని రూల్ 3తో చదువబడు సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొనుచూ **పంజాబ్ నేషనల్ బ్యాంక్** వారి అధీకృత అధికారి అయిన ఈ క్రింది సంతకందారు **తేది: 04.05.2026**న జారీ చేసిన **డిమాండ్ నోటీస్** ప్రకారం మా వద్ద గల రుణగ్రహీతలు /తనఖాదారులు **మెస్సర్స్ ఎ జి వెంచర్ కమోడిటీస్ (రుణగ్రహీత)/ శ్రీ మారుపుడి శ్రీనివాస రావు (నిర్వహణ భాగస్వామి/హామీదారు), శ్రీ అడ్డ హన్మంత్ రెడ్డి (భాగస్వామి/హామీదారు), శ్రీమతి మారుపుడి శ్రీ లక్ష్మి (తాకట్టుదారు కమ్ హామీదారు) మరియు శ్రీ మారుపుడి విష్ణువర్ధన రావు (తాకట్టుదారు కమ్ హామీదారు)** వారిని నోటీసులో తెలిపిన బకాయి మొత్తము అనగా **30.04.2026** నాటికి **రూ. 10,07,51,862.71 (రూపాయలు పది కోట్ల ఏడు లక్షల యాభై ఒక్క వేల ఎనిమిది వందల అరవై రెండు మరియు పైసలు డెబ్బై ఒక్కటి మాత్రమే)** పూర్తిగా చెల్లింపు వరకు డిమాండ్ నోటీసు తరువాత ఇప్పటికే చెల్లించిన మొత్తాలు తగ్గించి 01.05.2026 నుండి తదుపరి వడ్డీ, మరియు వ్యయాలతో కలిపి నోటీసు స్వీకరణ తేదీ నుండి 60 రోజులలోపుగా తిరిగి చెల్లించమని కోరడమైనది.
సదరు రుణగ్రహీతలు/హామీదారులు/తనఖాదారులు బకాయి మొత్తమును తిరిగిచెల్లించుటలో విఫలమైనందున సదరు రూల్స్ లోని రూల్ 8తో చదువబడు సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అతనికి/ఆమెకు సంక్రమించిన అధికారాలను వినియోగించుకొనుచూ ఈ క్రింద తెలిపిన ఆస్తిని **21 జూలై, 2026**న ఈ క్రింది సంతకందారు **స్వాధీనం చేసుకోవడమైనదని** రుణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకానికి తెలియజేయడమైనది.
కావున ప్రత్యేకించి రుణగ్రహీతలు/తనఖాదారులు మరియు సాధారణ ప్రజానీకాన్ని హెచ్చరించడ మేమనగా సదరు ఆస్తితో ఎటువంటి లావాదేవీలు జరుపకూడదనియు, ఒకవేళ జరిపినట్లయితే **పంజాబ్ నేషనల్ బ్యాంక్** వారికి చెందవలసిన బకాయి మొత్తము **రూ. 10,07,51,862.71 (రూపాయలు పది కోట్ల ఏడు లక్షల యాభై ఒక్క వేల ఎనిమిది వందల అరవై రెండు మరియు పైసలు డెబ్బై ఒక్కటి మాత్రమే) 01.05.2026** వడ్డీ, మరియు వ్యయాలు క్రింద వర్తించును.
మీ సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు గల సమయ లభ్యతకు సంబంధించి సదరు చట్టంలోని సెక్షన్ 13 సబ్ సెక్షన్ (8) నిబంధనలను గమనించవలసిందిగా రుణగ్రహీతలు/హామీదారులు/తనఖాదారులను కోరడమైనది.

**స్థిరాస్తి వివరణ :**
1) తెలంగాణ రంగారెడ్డి జిల్లా, గండిపేట మండలం, పుప్పాలగూడ గ్రామంలోగల సర్వే నం. 280/భాగములో ఎ. 7.39.74 గుంటలు లేదా 32349.29 చ.మీ.ల. మొత్తం భూమిలో 61.60 చ.గ.ల విస్తీర్ణం భూమి అవిభాజ్యవాటాతో 2 కారు పార్కింగ్ స్లాట్లు వెనుక వెనుకనే తో పాటు 2460 చ.అ.ల. సూపర్ బిల్టప్ ఏరియాతో లంసం ఎటానియా గా పిలువబడే భవనములోని డి బ్లాక్ లో 13వ అంతస్తుపై శ్రీమతి మరుపూడి శ్రీలక్ష్మీ పేరున గల ఫ్లాట్ నం. 1301 యావత్తు. **సైట్ సరిహద్దులు: ఉత్తరం:** సర్వే నం. 280 భాగము, **దక్షిణం:** నాలా, **తూర్పు:** ప్రతిపాధిత 40' వెడల్పు రోడ్, **పడమర:** సర్వే నం. 284 లోని భూమి. **ఫ్లాట్ సరిహద్దులు: ఉత్తరం:** కారిడార్ మరియు మెట్లు, **దక్షిణం:** ఖాళీ ప్రదేశం, **తూర్పు:** ఖాళీ ప్రదేశం మరియు ఫ్లాట్ నం. 1302, **పడమర:** ఖాళీ ప్రదేశం.

**తేది: 21.07.2026** — అధీకృత అధికారి
ప్రదేశము: హైదరాబాద్, — పంజాబ్ నేషనల్ బ్యాంక్, హైదరాబాద్,



invent

**ఇన్వెంట్ అస్సెట్స్ సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ప్రైవేట్ లిమిటెడ్**
సమోదిత కార్యాలయం: బక్తావర్, సూట్ ఐ, గ్రౌండ్ ఫ్లోర్, బ్యాక్‌బే రిక్లమేషన్ బ్లాక్ III, 229, నారిమన్ పాయింట్, ముంబై - 400021.

(అనుబంధము-IV A) (రూల్ 9తో చదువబడే రూల్ 8కు నిబంధనను చూడుము)

**స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన** — **వేలం తేది & సమయం 24 ఆగస్టు, 2026న ఉ.10.00 గం.లకు**

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8 మరియు 9తో చదవబడు నిబంధనల క్రింద **బందావతు సుశీల, బానోతు రోజా, రాజు చిలుక, జాటోతు ఇందిర** యొక్క స్థిరాస్తుల అమ్మకం (సెక్యూర్డ్ ఆస్తులు) కొరకు బహిరంగ వేలం సహిత అమ్మకం ప్రకటన **(స్విస్ ఛాలెంజ్ విధానం క్రింద).**
సాధారణ ప్రజలకు మరియు ముఖ్యంగా రుణగ్రహీత(లు), సహ-రుణగ్రహీత(లు) మరియు/ లేదా తనఖాదారు(ల)కు తెలియజేయునది ఏమనగా క్రింద తెలిపిన ఆస్తి(లు) **ఆల్టమ్ క్రెడో హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్** (ఇకమీదట "ACHFL" గా రిఫర్ చేయబడును) కు తనఖా పెట్టబడినవి మరియు తదనుగుణంగా, రిజిస్టర్డ్ అస్సైన్‌మెంట్ అగ్రిమెంట్ **తేది.29.12.2025** ప్రకారం ALTUM ద్వారా **ఇన్వెంట్ అస్సెట్ సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ప్రైవేట్ లిమిటెడ్** (ఇకమీదట "INVENT" గా రిఫర్ చేయబడును) పేరున సెక్యూరిటీ ఇంటరెస్ట్‌తో పాటు దిగువ తెలిపిన రుణగ్రహీత(లు), సహ-రుణగ్రహీత(లు) మరియు/ లేదా తనఖాదారు(ల) బకాయిలు అస్సైన్ చేయబడినవి. SARFAESI చట్టం 2002లోని సెక్షన్ 13(4) క్రింద దిగువ తెలిపిన ఆస్తి(లు) INVENT యొక్క అధీకృత అధికారిచే **లాంఛనప్రాయ స్వాధీనం** చేసుకొనబడినది. మరియు దిగువ విధంగా తెలిపిన బకాయిలు రాబట్టుకొనుటకు **"ఎక్కడ ఎలా ఉందో"** మరియు **"ఏది ఎలా ఉందో" "అది అలానే" "అక్కడ ఏమున్నదో అదే"** మరియు **"ఎటువంటి రీకోర్స్ లేకుండా"** ప్రాతిపదికన **23.12.2025, 23.12.2025, 20.12.2025, 23.12.2025** న విక్రయించబడును.
బహిరంగ వేలం స్విస్ ఛాలెంజ్ పద్ధతి ద్వారా మరియు చేతిలో ఉన్న ఆఫర్ ఆధారంగా (ప్రస్తుతం ఉన్న ఆఫర్/యాంకర్ బిడ్డర్) ఉంటుంది. ఆస్తిని కొనుగోలు చేయదానికి ఆసక్తి ఉన్న పార్టీలు ప్రస్తుతం ఉన్న ఆఫర్/రిజర్వ్ ధర కంటే దిగువ పేర్కొన్న బిడ్ పెరుగుదల మొత్తం ద్వారా తమ బిడ్‌ను పెంచుకోవచ్చు. అధిక ఆఫర్‌ను సరిపోల్చడానికి నిరాకరించే మొదటి హక్కు యాంకర్ బిడ్డర్‌కు ఉంటుంది మరియు ఒకవేళ యాంకర్ బిడ్డర్ అధిక ధరతో సరిపోలడంలో విఫలమైతే; అధిక ఆఫర్‌ను సమర్పించిన బిడ్డర్‌కు ఆస్తిని విక్రయించవచ్చు.
తెలిసిన తాకట్టు రుణభారాలు మరియు తెలిసిన రుణ బకాయిలు (ఏవైనా ఉంటే), స్థిరాస్తుల వివరణతో రుణగ్రహీత(లు), సహ-రుణగ్రహీత(లు) మరియు/ లేదా తనఖాదారు(ల) వివరణ దిగువ విధంగా ఉన్నవి.

| క్ర.సం. లాట్ నెం. | రుణ కోడ్/ రుణగ్రహీత(లు)/ సహ-రుణగ్రహీత(లు)/ హామీదారు(లు) | డిమాండ్ నోటీసు తేది మరియు మొత్తం | రావలసిన బకాయి మొత్తం | రిజర్వు ధర (ఆర్‌పి) / బయానా (ఆర్‌పిలో 10%) / బిడ్డు పెంపుదల మొత్తం | లాంఛనప్రాయ లేదా భౌతిక స్వాధీనతలో ఆస్తి | ఆస్తి తనిఖీ తేది మరియు సమయం |
|---|---|---|---|---|---|---|
| 1. | Loan Code No. S169204000020, బందావతు సుశీల (రుణగ్రహీత), బందావతు రమణ (సహ-రుణగ్రహీత 1), (సహ-రుణగ్రహీత 2), (సహ-రుణగ్రహీత 3) | తేది. 22.08.2025 రూ. 7,48,258/- మరియు దానిపై ఒప్పంద/పత్రాల ప్రకారం నిర్ణయించిన రేట్ల చొప్పున చెల్లింపులో విఫలమైన తేదీ నుండి అయ్యే అదనపు వడ్డీ, ఇతర అనుషంగిక ఖర్చులు మొదలైనవి. | Rs. 7,48,258/- | Rs. 10,69,848/- / Rs. 1,06,984/- / Rs. 10,000/- | లాంఛనప్రాయ | 18.08.2026న మ.12.00 గం.ల నుండి సా.4.00 గం.ల మధ్య |
| | **తెలిసిన తాకట్టు రుణ భారాలు మరియు తెలిసిన బకాయిలతో స్థిరాస్తుల వివరణ, ఏవైనా ఉంటే :** సూర్యాపేట జిల్లా, పాలకీడు మండలం, సజ్జాపురం రెవెన్యూ గ్రామం, బెట్టె తండా గ్రామపంచాయతిలో 20000 చ.గ.లు = 167.22 చ.మీ.ల విస్తీర్ణం గల మొత్తం ఇల్లు స్థలం, 150 చ.అ.ల ఎసిసి షీట్ రూఫ్ ప్లింత్ ఏరియా & 356.00 చ.అ.ల ఆర్‌సిసి రూఫ్ ప్లింత్ ఏరియాతో ఇం.నెం.140 (అస్సెస్‌మెంట్ నెం.40) **సరిహద్దులు: తూర్పు:** బందావతు చందా ఇల్లు, **పడమర:** సిసి రోడ్డు, **దక్షిణం:** బందావతు రమేష్ ఖాళీ ప్రదేశం, **ఉత్తరం:** బానావతు నరేష్ ఖాళీ ప్రదేశం. | | | | | |
| 2. | Loan Code No. S169202000067, బానోతు రోజా (రుణగ్రహీత), బనావత్ అశోక్ (సహ-రుణగ్రహీత 1), (సహ-రుణగ్రహీత 2), (సహ-రుణగ్రహీత 3) | తేది. 22.08.2025 రూ. 8,76,731/- మరియు దానిపై ఒప్పంద/పత్రాల ప్రకారం నిర్ణయించిన రేట్ల చొప్పున చెల్లింపులో విఫలమైన తేదీ నుండి అయ్యే అదనపు వడ్డీ, ఇతర అనుషంగిక ఖర్చులు మొదలైనవి. | Rs. 8,76,731/- | Rs. 19,90,634/- / Rs. 1,99,063/- / Rs. 10,000/- | లాంఛనప్రాయ | 18.08.2026న మ.12.00 గం.ల నుండి సా.4.00 గం.ల మధ్య |
| | **తెలిసిన తాకట్టు రుణ భారాలు మరియు తెలిసిన బకాయిలతో స్థిరాస్తుల వివరణ, ఏవైనా ఉంటే :** హుజూర్‌నగర్ సబ్ రిజిస్ట్రేషన్ జిల్లాలో సూర్యాపేట జిల్లా, పాలకవీడు మండలం, సజ్జాపురం రెవెన్యూ గ్రామం, బెట్టె తండా గ్రామంలో 992 చ.అ.ల ఆర్‌సిసి గ్రౌండ్ ఫ్లోర్‌లో ఇం.నెం.1355 మరియు అస్సెస్‌మెంట్ నెం.355 గల 255.56 చ.గ.ల విస్తీర్ణం గల ఆస్తి. **సరిహద్దులు: తూర్పు:** రోడ్డు, **పడమర:** గ్రామపంచాయతి సిసి రోడ్డు, **దక్షిణం:** గ్రామపంచాయతి సిసి రోడ్డు, **ఉత్తరం:** బానావతు అశోక్ ప్రదేశం. | | | | | |
| 3. | Loan Code No. 1512040100020, Raju రాజు చిలుక (రుణగ్రహీత), లావణ్య చిలుక (సహ-రుణగ్రహీత 1), చంద్రయ్య చిలుక (సహ-రుణగ్రహీత 2), (సహ-రుణగ్రహీత 3) | తేది. 18.09.2025 రూ. 5,57,458/- మరియు దానిపై ఒప్పంద/పత్రాల ప్రకారం నిర్ణయించిన రేట్ల చొప్పున చెల్లింపులో విఫలమైన తేదీ నుండి అయ్యే అదనపు వడ్డీ, ఇతర అనుషంగిక ఖర్చులు మొదలైనవి. | Rs. 5,57,458/- | Rs. 10,50,003/- / Rs. 1,05,000/- / Rs. 10,000/- | లాంఛనప్రాయ | 18.08.2026న మ.12.00 గం.ల నుండి సా.4.00 గం.ల మధ్య |
| | **తెలిసిన తాకట్టు రుణ భారాలు మరియు తెలిసిన బకాయిలతో స్థిరాస్తుల వివరణ, ఏవైనా ఉంటే :** కరీంనగర్ జిల్లా, చూదండి మండలం, వేదూరుగట్టు గ్రామం మరియు గ్రామపంచాయతిలో 108.00 చ.గ.లు లేదా 90.72 చ.మీ.ల విస్తీర్ణం గల భూమిలో 440.00 చ.అ.ల ప్లింత్ ఏరియా కలిగిన ఇం.నెం.636/1 గల ఆర్‌సిసి ఇల్లు యావత్తు, సాంకేతిక నివేదిక ప్రకారం దిగువ సరిహద్దులు: **తూర్పు:** చిలుక బాబు ఖాళీ ప్రదేశం, **పడమర:** చిలుక హనుమయ్య ఇల్లు, **దక్షిణం:** మామిడిపెల్లి వెంకటయ్య ఖాళీ ప్రదేశం, **ఉత్తరం:** సిసి రోడ్డు. | | | | | |
| 4. | Loan Code No. S144204000007, జాటోతు ఇందిర (రుణగ్రహీత), జాటోతు సూర (సహ-రుణగ్రహీత 1), (సహ-రుణగ్రహీత 2), (సహ-రుణగ్రహీత 3) | తేది. 18.09.2025 రూ. 8,53,493/- మరియు దానిపై ఒప్పంద/పత్రాల ప్రకారం నిర్ణయించిన రేట్ల చొప్పున చెల్లింపులో విఫలమైన తేదీ నుండి అయ్యే అదనపు వడ్డీ, ఇతర అనుషంగిక ఖర్చులు మొదలైనవి. | Rs. 8,53,493/- | Rs. 17,28,803/- / Rs. 1,72,880/- / Rs. 10,000/- | లాంఛనప్రాయ | 18.08.2026న మ.12.00 గం.ల నుండి సా.4.00 గం.ల మధ్య |
| | **తెలిసిన తాకట్టు రుణ భారాలు మరియు తెలిసిన బకాయిలతో స్థిరాస్తుల వివరణ, ఏవైనా ఉంటే :** వరంగల్ (రూరల్) సబ్ రిజిస్ట్రార్ మరియు వరంగల్ రిజిస్ట్రేషన్ జిల్లా పరిధిలో బికోజీ నాయక్ తండా, గ్రామపంచాయతి బోర్డు పరిధిలలో, వరంగల్ జిల్లా, సంగెం మండలం, ఎలుగూరు రంగంపేట రెవెన్యూ గ్రామం, బికోజీ నాయక్ తండా గ్రామం & జి.పి వద్ద 576.00 చ.అ.ల ఆర్‌సిసి ప్లింత్ ఏరియాతో 311.50 చ.గ.లు (260.45 చ.మీ.లకు సమానమైన) విస్తీర్ణంతో జి.పి.హెచ్. నెం.839 (అస్సెస్‌మెంట్ నెం.381) గల ఆస్తి ఖాళీ ప్రదేశంతో ఆర్‌సిసి రూఫ్ హౌస్ యావత్తు. **సరిహద్దులు: తూర్పు:** గుగులోతు డిష్లా ఇల్లు, **పడమర:** గుగులోతు వాసు ఇల్లు, **దక్షిణం:** జి.పి రోడ్డు, **ఉత్తరం:** గుగులోతు సారు ఇల్లు. | | | | | |

| | |
|---|---|
| సెల్ఫ్ అటెస్టెడ్ కెవైసితో పాటు 29ఎ డిక్లరేషన్ దాఖలుకు చివరి తేదీ & సమయం | 20.08.2026న సా.4.00 గం.ల వరకు |
| బిడ్డు దాఖలుకు చివరి తేది & సమయం | 22.08.2026న మ.12.00 గం.ల వరకు |
| బిడ్డు తెరుచు తేది & సమయం | 22.08.2026న మ.2.00 గం.లకు |
| బయానా చెల్లింపు ఖాతా వివరాలు | "Invent Assets Securitisation & Reconstruction Pvt. Ltd. పేరున ముంబయి వద్ద చెల్లించబడేలా డిమాండ్ డ్రాఫ్ట్ / పే ఆర్డర్ ద్వారా లేదా రుణ ఖాతా నెం. 0062009300142324 కు RTGS/NEFT ద్వారా డిపాజిట్ చేయడం ద్వారా బయానా (EMD) ను చెల్లించవలెను, లబ్ధిదారు పేరు: ఇన్వెంట్ అస్సెట్స్ సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్, బ్యాంక్ పేరు: పంజాబ్ నేషనల్ బ్యాంక్, IFSC Code PUNB0006200. |
| దాఖలు చేయడానికి టెండరు చిరునామా మరియు వేలం ప్రదేశం | బక్తావర్, సూట్ బి, గ్రౌండ్ ఫ్లోర్, బ్యాక్‌బే రిక్లమేషన్ స్కీమ్ బ్లాక్ 3, 229, నారీమన్ పాయింట్, ముంబయి-400021. |

ఎటువంటి తదుపరి కారణాలు తెలియజేయకుండా ఏదేని లేదా అన్ని బిడ్లను తిరస్కరించుటకు అధీకృత అధికారికి హక్కు కలదు.
అమ్మకం యొక్క సవివర నియమ నిబంధనల కొరకు, సెక్యూర్డ్ క్రెడిటార్స్ (INVENT) వెబ్‌సైట్ www.inventarc.com లో గల లింక్‌ను రిఫర్ చేయగలరు.

సం/-
తేది : 24.07.2026 — అధీకృత అధికారి
ప్రదేశం : తెలంగాణ — ఇన్వెంట్ అస్సెట్స్ సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ప్రైవేట్ లిమిటెడ్


## ఘనంగా శ్రీ వారాహి మాత నవరాత్రి ముగింపు ఉత్సవాలు



**చింతపల్లి, జూలై 23 (నినాదం):** మండల కేంద్రంలోని శ్రీ షిరిడి సాయిబాబా ఆలయంలో శ్రీ వారాహి మాత నవరాత్రి ముగింపు ఉత్సవాలను గురువారం అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో కళకళలాడగా, ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొమిరిశెట్టి వెంకటయ్య--చంద్రకళ దంపతులు, కోశాధికారి ఊరె కృష్ణయ్య--కృష్ణవేణి దంపతులు, కొమిరిశెట్టి వినోద్ కుమార్--స్వాతి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై శ్రీ వారాహి మాత ఆశీస్సులు పొందారు.

## చిట్యాల పోలీస్ స్టేషన్‌లో ఎస్పీ ఆకస్మిక తనిఖీ

పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలి
ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, జూలై 23 (నినాదం):** ప్రజలకు పోలీసు సేవలను మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా అందించడమే లక్ష్యంగా భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ గురువారం చిట్యాల పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని వివిధ రికార్డులు, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, సీసీ కెమెరాల పనితీరు, స్టేషన్ పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలను ఎస్పీ క్షుణ్ణంగా పరిశీలించారు. పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, కేసులను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రజల నుంచి అందే ఫిర్యాదులను సత్వరమే స్వీకరించి, వాటిపై సమర్థవంతంగా స్పందించాలని ఆదేశించారు. అనంతరం పోలీస్ సిబ్బందితో సమావేశమైన ఎస్పీ, జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నేరాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టడంతో పాటు, ప్రజలకు నాణ్యమైన, పారదర్శకమైన పోలీసు సేవలు అందించేలా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు.



## విద్యార్థినుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

యాదగిరిగుట్ట బాలికల వసతిగృహాన్ని మంత్రి ఆకస్మిక తనిఖీ



**ఆలేరు, జూలై 23(నినాదం):** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలోని ప్రభుత్వ బాలికల వసతిగృహాన్ని తెలంగాణ రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థినులకు అందుతున్న వసతి, ఆహారం, పారిశుద్ధ్యం, భద్రతా ఏర్పాట్లపై క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. తనిఖీలో భాగంగా విద్యార్థినుల విశ్రాంతి గదులు, భోజనశాల, వంటగది, నిల్వ ఉంచిన బియ్యం, పప్పులు, నూనె తదితర వంట సామగ్రి, కూరగాయల నాణ్యతను పరిశీలించారు. అలాగే తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల పరిశుభ్రత, విద్యుత్ సరఫరా, భద్రతా ఏర్పాట్లు, వసతి గృహ పరిసరాల పరిశుభ్రతపై ఆరా తీశారు. అనంతరం విద్యార్థినులతో మాట్లాడిన మంత్రి కొండ సురేఖ, వారికి అందుతున్న ఆహారం, వసతి, విద్యా వాతావరణం, ఇతర సౌకర్యాల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏవైనా సమస్యలు ఉంటే నిర్భయంగా తెలియజేయాలని సూచించారు. ఈ సందర్భంగా మంత్రి కొండ సురేఖ మాట్లాడుతూ విద్యార్థుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రభుత్వ వసతి గృహాల్లో నాణ్యమైన ఆహారం, పరిశుభ్రమైన వాతావరణం, సురక్షితమైన వసతి కల్పించడం అధికారుల బాధ్యత అని పేర్కొన్నారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య మాట్లాడుతూ, విద్యార్థినుల ఆరోగ్యం, విద్య, సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. వసతి గృహాల్లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించి, మెరుగైన సౌకర్యాలు అందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంత వాతావరణంలో చదువుకునే పరిస్థితులు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. అధికారులు ఎప్పటికప్పుడు వసతి గృహాలను తనిఖీ చేస్తూ సేవల నాణ్యతను మెరుగుపర్చాలని సూచించారు.

# రోడ్డు ప్రమాదాల బ్లాక్ స్పాట్లపై సీపీ ప్రత్యేక నజర్

• ప్రమాదాల నివారణకు సమన్వయంతో చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు



**హన్మకొండ,జూలై23, (నినాదం):** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో తరచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న బ్లాక్ స్పాట్లపై వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగానే గురువారం సంబంధిత పోలీసు అధికారులు, నేషనల్ హైవే అథారిటీ, రోడ్డు రవాణా శాఖ, ఎక్సైజ్ శాఖ అధికారులతో కలిసి జాతీయ రహదారి--163పైహనుమకొండ--హైదరాబాద్ ప్రధాన రహదారి మార్గంలోని కరుణాపురం నుండి పెంబర్తి మార్గంలో అధికంగా ప్రమాదాలు జరుగుతున్న 10కి పైగా బ్లాక్ స్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రధానంగా జాతీయ రహదారి నుంచి గ్రామాలకు వెళ్లే అనుసంధాన రహదారులు, డివైడర్ ఓపెనింగ్‌లు ఉన్న ప్రాంతాల్లో రాత్రి వేళల్లో వాహనదారులకు స్పష్టంగా కనిపించే విధంగా తగిన లైటింగ్ ఏర్పాటు చేయాలని కమిషనర్ సూచించారు. అలాగే ప్రమాదాలు ఎక్కువగా జరిగే బ్లాక్ స్పాట్ల వద్ద వాహనదారులను అప్రమత్తం చేసే హెచ్చరిక బోర్డులు, దిశా నిర్దేశక సూచికలు, రిఫ్లెక్టివ్ సైన్ బోర్డులను అధిక సంఖ్యలో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జాతీయ రహదారి వెంట ఉన్న మద్యం దుకాణాల వద్ద వాహనాల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా పార్కింగ్‌ను క్రమబద్ధీకరించేలా సంబం ధిత వ్యాపారులు చర్యలు తీసుకునే విధంగా ఎక్సైజ్ శాఖ అధికారులు చొరవ చూపాలని ఆదేశించారు. కరుణాపురం వద్ద పాదచారుల వంతెన (ఫుట్ ఓవర్ బ్రిడ్జ్) నిర్మించాలని స్థానికులు కోరగా, అవసరమైన ప్రదేశాల్లో ఫుట్ ఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని జాతీయ రహదారి అధికారులకు సూచించారు. అనంతరం జాతీయ రహదారి--163పై ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడిన బాధితులను అత్యవసరంగా ఆసుపత్రికి తరలిం చేందుకు ఏర్పాటుచేసినఅంబులెన్స్‌ను పరిశీలించి, అందులో అందుబాటులో ఉన్న అత్యవసర వైద్య సౌకర్యాలపై ఆరా తీశారు. అలాగే అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ సిబ్బంది స్పందన, సేవల నిర్వహణ తీరును అడిగి తెలుసుకుని, మరింత సమర్థవంతంగా సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్, ట్రాఫిక్ అదనపు డీసీపీ రాయల ప్రభాకర్ రావు, ఘనపూర్ ఏసీపీ భీంశర్మ, ఎన్. హెచ్.ఏ.ఐ పీడీ భరద్వాజ్ ,మేనేజర్ లింగయ్య, ఇన్స్పెక్టర్లు వేణు, చేరాలు, ఎస్ఐలు నవీన్ కుమార్, శ్రవణ్ కుమార్, ఆర్ఎస్ఐ నవీన్ తో పాటు రోడ్డు రవాణా శాఖ, ఎక్సైజ్ శాఖ, జాతీయ రహదారి అథారిటీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


UNICO HOUSING FINANCE

**యూనికో హౌసింగ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్**
నమోదిత కార్యాలయం : ది ఓవల్, 8వ అంతస్తు, నెం.10 & 12, వెంకట నారాయణ రోడ్, టి.నగర్, చెన్నై-600017

**బహిరంగ ప్రకటన**
**కార్యాలయాల మూసివేత**

ఇందుమూలముగా సాధారణ ప్రజలకు తెలియజేయునది ఏమనగా, రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియాతో నమోదైన హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీ అయిన **యూనికో హౌసింగ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్** 22.10.2026 నుండి వర్తింపుతో దిగువ తెలిపిన చిరునామాలలో గల దాని కార్యాలయాలను మూసివేసేందుకు నిర్ణయించింది.

| రాష్ట్రం | బ్రాంచ్ | బ్రాంచ్ చిరునామా |
|---|---|---|
| తెలంగాణ | ఆర్.సి.పురం | రెండవ అంతస్తు, ప్లాట్ నెం. 12/పార్ట్, సర్వే నెం. 8/ఎఎ, 386/ఎఎ, రామచంద్రాపురం గ్రామం & మండలం, మెదక్ జిల్లా, తెలంగాణ రాష్ట్రం - 502032. |
| తెలంగాణ | కుషాయిగూడ | ప్లాట్ నెం.10 యొక్క 2వ అంతస్తు, సర్వే నెం.255 నుండి 258, 267, 268, 273 & 291లో సాయి నగర్ కుషాయిగూడలో జిహెచ్ఎంసి, కాప్రా సర్కిల్, మండలం -మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా, (వార్డ్ నెం:01 & బ్లాక్ నెం.10), తెలంగాణ-500062. |

రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీస్- బ్రాంచ్ ఆథరైజేషన్) డైరెక్షన్స్, 2025కు అనుగుణంగా ఈ సమాచారం ప్రచురించబడుచున్నది. ప్రస్తుత కస్టమర్లందరికీ తెలియజేయునది ఏమనగా, సర్వీసులకు అంతరాయం కలగదు. ఏ రకమైన విచారణలకు స్టేక్‌హోల్డర్లు దిగువ తెలిపిన కో ఆర్డినేటర్లను సంప్రదించగలరు.
**యూనికో హౌసింగ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్**
**నమోదిత కార్యాలయం: ది ఓవల్, 8వ అంతస్తు, నం.10 & 12, వెంకట నారాయణ రోడ్, టి.నగర్, చెన్నై - 600 017.**
**సంప్రదింపు నెం.: 044-61117111**
**ఇమెయిల్ ఐడి: customercare@unicohfc.com**

సం/-
బాబు వెల్లింగిరి
ప్రదేశం : హైదరాబాద్ — మేనేజింగ్ డైరెక్టర్ & CEO
తేది : 24.07.2026 — (DIN:09855615)


# కంచర్లగూడెంలో జిల్లా కలెక్టర్ ఆకస్మిక పర్యటనలు

**డోర్నకల్ /మరిపెడ జులై 23(నినాదం):** గ్రామంలో కొనసాగుతున్న సార్ సవరణ డిజిటలైజేషన్ ప్రక్రియ, ఆబాది రీసర్వే గ్రామకంఠం సర్వే, ఎస్జిటి ఉపాధ్యాయుల శిక్షణ తరగతులు, అంగన్వాడి కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ రికార్డులను పరిశీలించి జరుగుతున్న సర్వేపై సిబ్బందికి తగు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారత్ ఎన్నికల సంఘం ఆదేశాలతో జిల్లాలో ఎస్ఐఆర్ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఓటరు జాబితా సవరణ డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా కొనసాగుతుందని, క్షేత్రస్థాయిలో బిఎల్వో లు, ఎన్నికల విభాగం సిబ్బంది ప్రతి ఒక్కరికి ఎనమరేషన్ ఫార్మ్స్ పంపిణీ చేయడం జరిగిందని, అట్టి ఫారాలు పూర్తి చేసి సంబంధిత అధికారులకు అందిస్తే ఆన్లైన్ డిజిటలైజేషన్ చేసి తమ ఓటును నిర్ధారణ చేసుకోవడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో రీ సర్వేకు ఎంపికైన (70) గ్రామాలలో (11) గ్రామాల గ్రామకంఠం, ఆబాది రీ సర్వే, పూర్తి చేయడం జరిగిందని ఈరోజు కంచర్లగూడెం లో జరుగుతున్న సర్వే వివరాలను స్వయంగా పరిశీలించి అసిస్టెంట్ డైరెక్టర్ సర్వే ల్యాండ్ రికార్డు శ్రీనివాసులును అడిగి తెలుసుకున్నారు. మండల కేంద్రంలో జరుగుతున్న ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయ శిక్షణ శిబిరాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులలో ఆంగ్లభాష నైపుణ్యాలను పెంపొందించాలని, పాఠశాల స్థాయిలో విద్యార్థులందరూ మంచి నైపుణ్యాలను పెంపొందించే విధంగా , ఆంగ్ల భాషలో పట్టు సాధించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని,శిక్షణ కార్యక్రమంలో నేర్చుకున్నటువంటి ప్రతి అంశాన్ని విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించడానికి తోడ్పడాలని దీనికోసం ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు తన బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శిక్షణ ఉపాధ్యాయులచే నేర్చుకున్న అంశాలను వారిద్వారా తెలుసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఏ సత్యనారాయణమూర్తి, డీఎస్ఓ అప్పారావు, ఎంఈఓ బాలాజీ, పాఠశాల హెచ్ఎం వాహిద్, ఆర్పీలు వెంకటేష్ శివప్రసాద్ శేఖర్ ఓంకార్ వెంకటేశ్వర్లు, తహసిల్దార్ విజయ, ఎంపీడీవో వీరబాబు, తదితరులు పాల్గొన్నారు.



# నకిలీ డిఏపి అసలు సూత్రధారులు ఎవరు?

**కొండను తవ్వి ఎలుకను పట్టినట్టుంది.**
**స్థానిక ఎమ్మెల్యేకు మతిమరుపు ఉందా ?**
**నకిలీ డిఏపి పెద్ద కుంభకోణం.**
**నాగర్ కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి**




**నాగర్ కర్నూల్ జులై 23 (నినాదం)**

రాష్ట్రంలో లేని నకిలీ డిఏపి నాగర్ కర్నూల్ లో ఎక్కడినుండి వస్తుంది దాని అసలు సూత్రధారులు ఎవరు వారిపై వెంటనే పీడీ యాక్ట్ నమోదు చేయాలని నాగర్ కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం నాగర్ కర్నూల్ పట్టణ కేంద్రంలోని మర్రి జనార్దన్ రెడ్డి నివాసంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కల్తీ ఎరువుల పైన విత్తనాల పైన పీడి యాక్ట్ నమోదు చేయాలని చట్టం ఉన్న రాజకీయ ఒత్తిడి వల్ల అసలు దోషులను పక్కన పెట్టి విచారణ జరుగుతుంది దోషులను కఠినంగా శిక్షిస్తామని కొందరు కిందిస్థాయి వారిని మాత్రమే ఉదయం అదుపులోకి తీసుకొని సాయంత్రం వరకు వదిలి పెట్టారని వీరికి పీడి యాక్ట్ వర్తించదా అని ప్రశ్నించారు. నాగర్ కర్నూల్ పోలీసుల వ్యవహారం కొండను తవ్వి ఎలుకను పట్టినట్టుగా ఉందని ఎగ్దేవ చేశారు. లేని నీటి కొరత ఎరువుల కొరత సృష్టించడం తద్వారా ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీ నాయకులు లబ్ది పొందేలా చేయడమే కాంగ్రెస్ పార్టీ నైజం అని అన్నారు. ఎక్కడా లేని నకిలీ డి ఏ పి నాగర్ కర్నూల్ లోనే తవ్వే కొద్దికి బయటికి వస్తుందని రైతు సోదరులు గమనించాలన్నారు. మోసపోయామని గుర్తించిన రైతులు కలెక్టరేట్ కు వచ్చే పరిస్థితి ఏర్పడిందని ఇంటలిజెన్స్ పోలీస్ వ్యవస్థలు ఏమయ్యాయి అని ప్రశ్నించారు. హైదరాబాద్ అంబర్పేట్ లో 150 రూపాయలకు నకిలీ డిఏపి బస్తా తయారవుతుందని దాన్ని ఇక్కడి రైతులకు 1600 విక్రయిస్తున్నారని ఒక్క బస్తా వెనక 1450 రూపాయలు అవినీతి సొమ్ము ఎమ్మెల్యే తీసుకున్నారా కాంగ్రెస్ కార్యకర్తలు తీసుకున్నారా లేక పోలీసులు తీసుకున్నారా లెక్క తేలలన్నారు. నకిలీ డి ఏ పి దోషులు ఏ పార్టీ వారైనా సరే వారిపై పిడి యాక్ట్ నమోదు చేయాలని డిమాండ్ చేశారు. రైతులను ఎవరైనా మోసం చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎమ్మెల్యే ఓ సభ సాక్షిగా చెప్పారని ఇలాంటి మాటలను మేము స్వాగతిస్తున్నామన్నారు. ఎమ్మెల్యేకు మతిమరుపు ఏమైనా ఉందా ఆయన చెప్పేది ఒకలా చేసేది మరోలా ఉందని ఉన్నారు. నకిలీ డి ఏ పి కుంభకోణంలో ప్రధాన సూత్రధారులు ఎమ్మెల్యే అనుచరులేనని వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు మాజీ సర్పంచులు ఎంపిటీసీలు తదితరులు పాల్గొన్నారు.

## దేశభక్తి కార్మిక సంక్షేమమే బీఎంఎస్ ధ్యేయం

**ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్న అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్**



**నిజామాబాద్ ప్రతినిధి, జులై 23 (నినాదం):** దేశభక్తి కార్మిక సంక్షేమం సామాజిక బాధ్యతలను కేంద్ర బిందువుగా చేసుకొని భారతీయ మజ్దూర్ సంఘ్ ను ప్రారంభించారని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. భారతీయ మజ్దూర్ సాంగ్ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం నగరంలోని నిజామాబాద్ 2 డిపోలో జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. లోకమాన్య బాల గంగాధర్ తిలక్ జయంతి రోజున దత్తో పంత్ తెంగడి బీఎంఎస్ ను స్థాపించారని గుర్తు చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో కార్మికుల సంక్షేమం, సామాజిక భద్రత, ఉపాధి అవకాశాల విస్తరణ, మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందన్నారు. రాజకీయ ప్రయోజనాల కంటే కార్మికుల హక్కులు, దేశ ప్రయోజనాలు ముఖ్యమనే సిద్ధాంతంతో పని చేస్తుందన్నారు. దేశంలో సభ్యత్వం పరంగా అతిపెద్ద కార్మిక సంఘాల్లో ఒకటిగా గుర్తింపు పొందడం సంతోషకరమన్నారు. ప్రధానంగా " వికసిత్ భారత్" నిర్మాణంలో కార్మికుల పాత్ర కీలకమని శ్రమకు గౌరవం ఇవ్వడం భారతీయ సంస్కృతిలో భాగమన్నారు. దేశానికి రైతు అన్నం పెడితే కార్మికుడు దేశాన్ని నిర్మిస్తాడని కొనియాడారు. సంఘటిత, అసంఘటిత రంగాల్లో కార్మికులను సంఘటితం చేస్తుందన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు శ్రావణ్, మఠం పవన్, జ్యోతి మురళి, బీఎంఎస్ జిల్లా అధ్యక్షుడు సాయరెడ్డి, శ్రీనివాస్ చారి, రాష్ట్ర ఉపాధ్యక్షులు స్వామి కుమార్, ఆర్టీసీ కార్మిక సంఘం ప్రతినిధులు కే.బీ.సింగ్, సరోజ, రాములు తదితరులు పాల్గొన్నారు.



## కల్వకుర్తి మండలంలో నకిలీ ఎరువుల వ్యాపారం

**24.5 క్వింటాళ్లు స్వాధీనం చేసుకొని వ్యక్తి పై కేసు నమోదు చేసిన పోలీసులు**

**కల్వకుర్తి జులై 23 (నినాదం)**

కల్వకుర్తి మండలంలోని లింగసానిపల్లి గ్రామంలో నకిలీ డీఏపీ ఎరువుల అక్రమ రవాణాపై పోలీసులు మెరుపు దాడి నిర్వహించి 24.5 క్వింటాళ్ల నకిలీ కోరమండల్ డీఏపీ ఎరువులను స్వాధీనం చేసుకున్నారు. రైతులకు నకిలీ ఎరువులు విక్రయిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం అందడంతో వ్యవసాయ శాఖ అధికారులు వెంటనే పోలీసులకు సమాచారం అందించగా, పోలీసులు తక్షణమే స్పందించి దాడి చేపట్టారు. దాడిలో భారీ మొత్తంలో నకిలీ డీఏపీ ఎరువులను స్వాధీనం చేసుకున్న పోలీసులు, వాటిని రైతులకు సరఫరా చేస్తున్న అశోక్ రెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరిస్తూ, ఈ అక్రమ వ్యవహారం వెనుక మరెవరైనా ఉన్నారా అనే కోణంలో కూడా విచారణ కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ సై రెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ, రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని నకిలీ ఎరువులు, పురుగుమందులు విక్రయించే వారిపై ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. అలాంటి వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు తప్పనిసరిగా లైసెన్స్ పొందిన ఎరువుల విక్రయ కేంద్రాల్లోనే ఎరువులు కొనుగోలు చేయాలని, ప్రతి కొనుగోలుకు బిల్లు తీసుకోవాలని సూచించారు. నాణ్యతపై అనుమానం వచ్చిన వెంటనే వ్యవసాయ శాఖ అధికారులకు లేదా సమీప పోలీసు అధికారులకు సమాచారం అందించాలని కోరారు. వ్యవసాయ శాఖ అధికారి సురేష్ మాట్లాడుతూ, నకిలీ ఎరువుల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని, అందువల్ల అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. రైతులు ఎరువుల సంచులపై ఉన్న వివరాలు, తయారీ సంస్థ, బ్యాచ్ నంబర్, సీల్ తదితర అంశాలను పరిశీలించిన తర్వాతే కొనుగోలు చేయాలని తెలిపారు. ఈ వివరాలను డీఎస్పీ సై రెడ్డి వెంకటరెడ్డి, సీఐ భీమ్ కుమార్, ఎస్సై కురుమూర్తి, వ్యవసాయ శాఖ అధికారి సురేష్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. రైతుల ప్రయోజనాలకు విఘాతం కలిగించే అక్రమాలకు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని అధికారులు స్పష్టం చేశారు.

# సమాజంలో నిఘానేత్రాల పాత్ర కీలకం

**నాగర్‌కర్నూల్ పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను**
**ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి తో కలిసి ప్రారంభించిన నాగర్ కర్నూల్ జిల్లా ఎస్పీ సంగ్రామ్ సింగ్ జి పాటిల్**





**నాగర్‌కర్నూల్, జులై 23 (నినాదం)**

సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు నిఘానేత్రాలుగా కీలక పాత్ర పోషిస్తున్నాయని జిల్లా ఎస్పీ సంగ్రామ్‌సింగ్ పాటిల్ అన్నారు. గురువారం నాగర్‌కర్నూల్ పోలీస్‌స్టేషన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన అత్యాధునిక సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ పోలీసింగ్‌ను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు సీసీ కెమెరాలు దోహదపడతాయని తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లోకి వచ్చే ప్రజలకు భద్రతతో పాటు పారదర్శక సేవలు అందించడంలో ఇవి ఉపయోగపడతాయని పేర్కొన్నారు. నేరాల దర్యాప్తులో కీలక ఆధారాల సేకరణకు, అనుమానాస్పద కదలికలను గుర్తించేందుకు, చట్టవ్యతిరేక కార్యకలాపాలను అరికట్టేందుకు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపకరిస్తాయని చెప్పారు. పోలీస్‌స్టేషన్ పరిసరాల్లో భద్రతను మరింత పటిష్ఠం చేయడంతో పాటు ప్రజల్లో భరోసా పెంపొందించే దిశగా ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రతి పోలీస్‌స్టేషన్‌లో ఆధునిక సాంకేతిక సదుపాయాలను విస్తరించేందుకు శాఖ కృషి చేస్తోందని ఎస్పీ పేర్కొన్నారు. సీసీ కెమెరాలను బిజినేపల్లి 32 , కుమ్మెర 06 , నాగర్ కర్నూల్ టౌన్ 25 , తిమ్మాజిపేట 17 ఏర్పాటు చేశామని నిఘా నేత్రాల ఏర్పాటుకు సహకరించి నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్సీ కి ఎమ్మెల్యే కు మరియు అసోసియేషన్ల వారికి నాగర్ కర్నూల్ డిఎస్పి బుర్రి శ్రీనివాస్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ డీఎస్పీ శ్రీనివాస్ , సీఐ అశోక్ రెడ్డి , నాగర్ కర్నూల్ సర్కిల్ ఎస్ఐలు అందరితోపాటు మున్సిపల్ చైర్మన్ సునీంద్ర వైస్ చైర్మన్ కౌసులర్లు స్థానిక ప్రజాప్రతినిధులు, పోలీసు అధికారులు, మరియు పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.



## శాకంభరీగా కోట మైసమ్మ తల్లి అలంకరణ

**తల్లాడ, జూలై 23(నినాదం)**

తల్లాడ లో కోట మైసమ్మ తల్లి ఆలయం లో ఆషాడ మాస బోనాల ఉత్సవాలు గురువారం 9 వ రోజు ఘనంగాజరుగుతున్నాయి. వివిధరకాల కూరగాయలతో అమ్మ వారిని ఘనంగా అలంకరించి భక్తులు అమ్మ వారికి పూజలు చేశారు లగడపాటి కృష్ణమోహన్ ధనలక్ష్మి , గుండా రమేష్ వాణి దంపతులు దాతలు గా ముందుకు వచ్చి చాలా చక్కగా అమ్మ వారిని రక రకాల కూరగాయలతో అలంకరించారు.భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదలు అందజేశారు.ఆలయ కమిటి సభ్యులు లగడపాటి నెహ్రూ పర్యవేక్షణ లో అత్యంత వైభావంగా జరుగుతున్నాయి.





## లింగంపల్లి ఖుర్ద్ హై లెవల్ బ్రిడ్జి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే

**కామారెడ్డిప్రతినిధి, జూలై 23(నినాదం)**

ఎల్లారెడ్డి – కామారెడ్డి రహదారిలో లింగంపేట్ మండలం లింగంపల్లి ఖుర్ద్ హై లెవల్ బ్రిడ్జి గత ఏడాది కురిసిన భారీ వర్షాలతో తీవ్రంగా దెబ్బతింది. దీంతో స్థానిక ప్రజలు, రైతులు, విద్యార్థులు, వాహనదారులు రాకపోకల్లో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. స్పందించిన ఎమ్మెల్యే మదన్ మోహన్ కృషితో రూ.4 కోట్ల నిధులు మంజూరు కాగా, గురువారం ఎమ్మెల్యే పునర్నిర్మాణ పనులను ప్రారంభించారు.




## వ్యవసాయ రంగంలో విదేశీ పెట్టుబడులను వ్యతిరేకించాలి: సిపిఎం

**రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా**
**కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దాహనం చేసిన సిపిఎం నాయకులు**

**తల్లాడ, జూలై 23(నినాదం)**

తల్లాడ మండల కేంద్రంలో సిపిఎం తల్లాడ మండల కమిటీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగంలోవిదేశీపెట్టుబడులను ప్రోత్సహిస్తూ తీసుకుంటున్న నిర్ణయాలను నిరసిస్తూ కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు వ్యతిరేక విధానాల వల్ల రైతులు, వ్యవసాయ కార్మికులు, కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రైతులు పండిస్తున్న పత్తి, మిర్చి, ధాన్యానికి గిట్టుబాటు ధరలు లేక తీవ్ర నష్టాలు చవిచూస్తున్నారని తెలిపారు.విదేశీ దేశాల్లో రైతులకు వివిధ రకాల సబ్సిడీలు, ప్రభుత్వ ప్రోత్సాహకాలు, ధరల హామీ వంటి సౌకర్యాలు ఉండటంతో వ్యవసాయం లాభదాయకంగాసాగుతుండగా, మన దేశ రైతులకు తగిన సబ్సిడీలు,గిట్టుబాటు ధరలు, ప్రభుత్వ మద్దతు లేక వ్యవసాయం సంక్షోభంలోకినెట్టబడుతోందని అన్నారు.వ్యవసాయ రంగంలో విదేశీ పెట్టుబడులను అనుమతించడం వల్ల దేశ ఆహార భద్రత, రైతుల స్వావలంబన దెబ్బతింటుందని పేర్కొన్నారు. అందువల్ల కేంద్ర ప్రభుత్వం విదేశీ పెట్టుబడులకు సంబంధించిన నిర్ణయాలను వెంటనే వెనక్కి తీసుకొని రైతులు, వ్యవసాయ కార్మికులు, కార్మికుల ప్రయోజనాలను కాపాడాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు చలమల విఠల్‌రావు, అయినాల రామలింగేశ్వరరావు, నల్లమోతు మోహన్‌రావు, పులి కృష్ణయ్య, కళ్యాణపు కృష్ణయ్య, సత్తెనపల్లి నరేష్, చల్లా నాగేశ్వర రావు, పులి వెంకటనరసయ్య, మన్నేపల్లి రామారావు తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ నాయకుడు దగ్గుల రఘుపతి రెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన భట్టి

**తల్లాడ, జులై 23(నినాదం )**

తల్లాడ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మాజీ ఎంపీటీసీ దగ్గుల రఘుపతి రెడ్డి ఇటీవల అనారోగ్యం తో మరణించారు. విషయం తెలుసుకున్న ఉప ముఖ్యమంత్రి బట్టి విక్ర మార్క్, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ గురువారం ఆ కుటుంబాన్ని పరామర్శించారు. రఘుపతి రెడ్డి చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు హార్పించినారు.మృతి చెందిన వివరాలను కుటుంబ సభ్యులతో మాట్లాడితెలుసుకున్నారు.అనంతరం ఆయన భార్య సరస్వతి కుమారుడు శ్రీనివాస రెడ్డి ని ఓదార్చి కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లపుడు మీ కుటుంబానికి అండగా ఉంటుంది అని భరోసా ఇచ్చినారు.బట్టి నాయకులతో మాట్లాడుతూ తల్లాడ టౌన్ లో బలమైన కాంగ్రెస్ నాయకున్ని పార్టీ కోల్పోయినది అని అన్నారు.ఈ కార్యక్రమం లో వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్,రాష్ట్ర నాయకులు కొండబాల కోటేశ్వరరావు,కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నుతి సత్యనారాయణ గౌడ్, సూడా చైర్మన్ దూర్గా ప్రసాద్, మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య,గిడ్డంగుల సంస్థ చైర్మెన్ రాయల నాగేశ్వరావు,వైరా వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ కాప సుధాకర్,కాంగ్రెస్ మండల అధ్యకుడు పగడాల లచ్చి రెడ్డి,సర్పంచ్ కటికి కిరణ్ కుమార్, గుర్రం శ్రీనివాసరావు,మాజీ జడ్పీటీసీ ముకర ప్రసాద్, గోవింద్ శ్రీనివాసరావు,కాంగ్రెస్ మండల నాయకులు జక్కంపూడి కిషోర్, దుండేటి వీర రెడ్డి, కోసూరి వెనకటేశ్వర్లు,కాంగ్రెస్ సోషల్ మీడియా వారియర్ షేక్ జమాల్ పాషా తదితరులు నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఆదర్శ నాయకులుగా ఎదిగి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలి

**నారాయణ పాఠశాల ఏజీఎం సూర్యవంశి శివాజీ పటేల్**



**నిజామాబాద్ ప్రతినిధి, జులై 23 (నినాదం):**

నగరంలోని సుభాష్ నగర్ నారాయణ పాఠశాల బ్రాంచ్ లో స్టూడెంట్ కేబినెట్ ఇన్‌వెస్టిచర్ & కేబినెట్ ఇన్‌స్టాలేషన్ కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏజీఎం సూర్యవంశి శివాజీ పటేల్ ముఖ్య అతిథిగా హాజరై నూతన విద్యార్థి నాయకులకు బ్యాడ్జీలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా అయన సూర్యవంశి శివాజీ మాట్లాడుతూ నాయకత్వం అనేది ఒక బాధ్యత అని క్రమశిక్షణ, నిజాయితీ, సేవాభావంతో విద్యార్థులు ఆదర్శ నాయకులుగా ఎదిగి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. అనంతరం నూతన కేబినెట్ సభ్యులు బాధ్యతలు స్వీకరించి పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో హై స్కూల్ జెడ్ సి ఓ రాకేష్, ఈ ఛాంప్స్ జెడ్ సిఓ అజీమా, ఈ కిడ్జ్ కల్పన, బ్రాంచ్ ప్రిన్సిపాల్ గడిచర్ల చందన, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# తెలంగాణలో రోడ్డు భద్రతకు కేంద్రం పెద్దపీట

**నిజామాబాద్, జగిత్యాల జిల్లాల్లో బ్లాక్ స్పాట్ల నివారణకు రూ.1,023 కోట్లు**
**లోక్ సభలో ఎంపీ అర్వింద్ ప్రశ్నకు మంత్రి గడ్కరీ సమాధానం**



**నిజామాబాద్ ప్రతినిధి, జులై 23 (నినాదం) :**

తెలంగాణ రాష్ట్రంలో జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు కేంద్ర ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చేపడుతోందని నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అర్వింద్ తెలిపారు. రోడ్డు ప్రమాదాల బ్లాక్ స్పాట్ల నివారణ, రహదారి భద్రతా చర్యలకు సంబంధించి తాను లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఇచ్చిన సమాధానంలో కీలక వివరాలు వెల్లడయ్యాయని ఆయన తెలిపారు. తెలంగాణలో గత కొన్నేళ్లలో ప్రమాదాల ఆధారంగా మొత్తం 1,513 యాక్సిడెంట్ బ్లాక్ స్పాట్లు గుర్తించగా, వాటిలో 1,308 బ్లాక్ స్పాట్లకు సంబంధించిన శాశ్వత నివారణ చర్యలు పూర్తయ్యాయని కేంద్ర ప్రభుత్వం వెల్లడించిందని ఎంపీ తెలిపారు. మరో 205 బ్లాక్ స్పాట్లలో శాశ్వత నివారణ చర్యలు వివిధ దశల్లో కొనసాగుతున్నాయని చెప్పారు.

**నిజామాబాద్, జగిత్యాల జిల్లాలకు ప్రత్యేక ప్రాధాన్యత**

నిజామాబాద్ జిల్లాలో మొత్తం 78 ప్రమాదకర బ్లాక్ స్పాట్లు గుర్తించగా, వాటిలో 75 ప్రాంతాల్లో నివారణ చర్యలు పూర్తయ్యాయని, మరో 3 ప్రాంతాల్లో చర్యలు వివిధ దశల్లో కొనసాగుతున్నాయని, అదేవిధంగా జగిత్యాల జిల్లాలో మొత్తం 107 ప్రమాదకర బ్లాక్ స్పాట్లు గుర్తించగా, అందులో 99 ప్రాంతాల్లో నివారణ చర్యలు పూర్తయ్యాయని, మరో 8 ప్రాంతాల్లో పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయని కేంద్ర ప్రభుత్వం వెల్లడించిందని ఎంపీ తెలిపారు. నిజామాబాద్ పార్లమెంట్ ప్రజల భద్రతకు కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతకు ఇది నిదర్శనమన్నారు. నిజామాబాద్ జిల్లాలో జాతీయ రహదారులపై రోడ్డు భద్రతను మరింత మెరుగుపరిచేందుకు అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని కేంద్రాన్ని కోరుతున్నామని, పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయడానికి తన వంతు కృషి కొనసాగుతుందని అర్వింద్ తెలిపారు.

**ఎన్ హెచ్ - 63, ఎన్ హెచ్ - 61, ఎన్ హెచ్ - 44పై రోడ్డు భద్రతా పనులు**

నిజామాబాద్, జగిత్యాల జిల్లాల పరిధిలోని ఎన్ హెచ్ – 63, ఎన్ హెచ్ – 61, ఎన్ హెచ్ – 44 జాతీయ రహదారులపై వంతెనలు, బైపాస్‌లు, రోడ్డు భద్రతా చర్యలతో కూడిన అభివృద్ధి పనులు వివిధ జాతీయ రహదారి అభివృద్ధి కార్యక్రమాల కింద ప్రణాళిక, అమలు దశల్లో ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసిందని అర్వింద్ తెలిపారు.

**నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో రోడ్డు భద్రతకు కట్టుబడి ఉన్నాం**

నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలకు మెరుగైన రహదారులు, సురక్షితమైన ప్రయాణం అందించడమే తన ప్రధాన లక్ష్యమని ఎంపీ అర్వింద్ అన్నారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి, అక్కడ శాశ్వత పరిష్కారాలు చూపించేందుకు కేంద్ర ప్రభుత్వంతో నిరంతరం సమన్వయం చేస్తామని తెలిపారు. నిజామాబాద్, జగిత్యాల జిల్లాల్లో జాతీయ రహదారుల అభివృద్ధి, బ్లాక్ స్పాట్ల నివారణ, వంతెనలు, బైపాస్‌లు, ఇతర రోడ్డు భద్రతా మౌలిక వసతుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సుమారు రూ.1,023 కోట్లు కేటాయించిందని ఎంపీ అర్వింద్ తెలిపారు. ప్రజల ప్రాణాలను కాపాడటమే లక్ష్యంగా రోడ్డు భద్రతా పనులను మరింత వేగవంతం చేయడానికి కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు.



## కామారెడ్డిలో వన మహోత్సవం

**2000 ఈత ముక్కలు నాటిన ఎక్సైజ్ శాఖ ఎస్సై.విక్రమ్ కుమార్.**

**కామారెడ్డి రూరల్,జూలై 23 (నినాదం)**

కామారెడ్డి జిల్లా ప్రోహిబిషన్ మరియు ఎక్సైజ్ అధికారి ముకుంద రెడ్డి ఆదేశాల మేరకు గురువారం రోజు కామారెడ్డి మండలంలోని గర్గుల్ గ్రామంలో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా 2000 ఈత మొక్కలు నాటడం జరిగింది.ఈ సందర్భంగా ఎక్సైజ్ ఎస్ఐ.విక్రమ్ కుమార్ గారు మాట్లాడుతూ ఈత చెట్టు నాటడం వల్ల గౌడ కులస్తులకు కులవృత్తిని అందిచడంతో పాటు పర్యావరణాన్ని కూడా తోడ్పాటు అందించడం జరుగుతుందని అదేవిధంగా కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో వివిధ మండలాల్లో ఈత ఖర్జూర చెట్లు నాటడం జరుగుతుందని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.ఇట్టి కార్యక్రమంలో కామారెడ్డి ఎక్సైజ్ ఎస్సై.విక్రమ్ కుమార్,గ్రామ సర్పంచ్ దివ్య,టెక్నికల్ అసిస్టెంట్ సంతోష్ మరియు గౌడ సంఘం నుంచి మొగుళ్ళ సాయ గౌడ్,పెద్ద రాజా గౌడ్,మొగుళ్ళ రామా గౌడ్ ఇతర గౌడ సభ్యులు మరియు సిబ్బంది నరసింహులు,శరత్చంద్ర,దినేష్ కుమార్ పాల్గొన్నారు.

## ఎల్‌నినో ప్రభావం..
## ఆరుతడి పంటల వైపు రైతులు మళ్లాలి



**కోదాడ,జూలై 23(నినాదం):** ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులు వరి సాగును తగ్గించి ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని కోదాడ మండల వ్యవసాయ అధికారి పాలెం రజని సూచించారు. శ్రీ-రంగాపురం, బాలాజీనగర్, దొరకుంట, కాపుగల్లు, బీక్యతండ గ్రామాల్లో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి తక్కువ నీటితో సాగయ్యే పెసర, కంది, మినుములు, బొబ్బర్లు, కూరగాయల వంటి పంటలను సాగు చేయాలని సూచించారు. ఈ పంటల విత్తనాలు రాయితీపై వ్యవసాయ శాఖ ద్వారా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. నీటిని పొదుపుగా వినియోగిస్తూ ప్రత్యామ్నాయ పంటలు సాగు చేస్తే నష్టాలను తగ్గించుకోవచ్చని రైతులకు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## ఆరుతడి పంటలే సాగు చేయాలి



**కోదాడ,జూలై 23(నినాదం):** కోదాడ రూరల్ మండలం దోరకుంట గ్రామంలో ఎల్‌నినో ప్రభావంపై రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈవో) మహేశ్ మాట్లాడుతూ, ఈ ఏడాది తక్కువ వర్షాలు, నీటి కొరత ఉండే అవకాశం ఉన్నందున రైతులు వరి, పత్తికి బదులుగా ఆరుతడి పంటలు సాగు చేయాలని సూచించారు. తక్కువ నీటితో అధిక లాభాలు ఇచ్చే కందులు, పెసర్లు, మినుములు, బొబ్బర్లు వంటి పంటలను సాగు చేసి నష్టాలను నివారించుకోవాలని రైతులకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ పాలకి సురేష్, గ్రామ కార్యదర్శి వెంకటేశ్వర్లు, రైతులు పాల్గొన్నారు.

## కేటీఆర్ జన్మదిన వేడుకలు..
## ఆటో డ్రైవర్లకు రూ.10 లక్షల ప్రమాద బీమా




**కోదాడ,జూలై 23(నినాదం):** కోదాడ పట్టణంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని 10వ వార్డు కౌన్సిలర్ మామిడి రామారావు ఆధ్వర్యంలో ముందస్తుగా ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి కేటీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. 'గిఫ్ట్ ఏ స్మైల్' కార్యక్రమంలో భాగంగా 25 మంది ఆటో డ్రైవర్లకు రూ. 10 లక్షల ప్రమాద బీమా పత్రాలను పంపిణీ చేశారు. కష్టపడి జీవనం సాగించే ఆటో కార్మికుల కుటుంబాలకు భరోసా కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు రామారావు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అనంతుల సైదయ్య, కౌన్సిలర్ చంద్రశేఖర్, బత్తుల కృష్ణ, వీరబాబు, మాజీ కౌన్సిలర్ లలిత, చందు, వెంకటి, వెంకన్న, సీతయ్య, సిలర్, అఖిల్, మున్నా, లింగ, ఆటో యూనియన్ నాయకులు బోధల్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## పోచమ్మకు బోనమెత్తిన బొమ్మరెడ్డిపల్లి.



**ధర్మారం జులై 23 (నినాదం):** మండలంలోని బొమ్మ రెడ్డి పల్లి గ్రామంలో ఈ రోజు పోచమ్మ బోనాలు ఘనంగా జరిగాయి. ఆషాడ మాసంతోపాటు ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి జరిగే ఉత్సవాలను సర్పంచ్ రాజకుమార్ ధార, పాలక మండలి సభ్యులతో పాటు వివిధ కుల సంఘాల నాయకుల ఆధ్వర్యంలో గ్రామంలోని మహిళలందరూ బోనమెత్తారు. కులాలకు అతీతంగా జరిగే ఈ ఉత్సవాన్ని పంబాల పూజారి గౌరీ ప్రభాకర్ సమక్షంలో నిర్వహించారు. దాదాపు ప్రతి ఇంటి నుండి ఒక బోనం గ్రామం వీధుల గుండా వెళ్లి స్థానిక పోచమ్మ గుడి వద్ద ఉంచారు. పంబాల పూజారులు గావు పిల్లను పట్టివేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులందరూ పాల్గొన్నారు.

# మానవత్వం చాటుకున్న కేబుల్ ఆపరేటర్స్



**జమ్మికుంట, జూలై 23 (నినాదం ):** కరీంనగర్ జిల్లాలోని జమ్మికుంట హౌసింగ్ బోర్డ్ కాలనీకి చెందిన కేబుల్ ఆపరేటర్ దాసరి రామ్మూర్తి ఇటీవల మృతి చెందగా మృతుడి కుటుంబానికి అండగా నిలిచిన కేబుల్ ఆపరేటర్లు.. రూ. 50,016 ఆర్థిక సాయం అందజేశారు. జమ్మికుంట, ఇల్లందకుంట, వీణవంక ప్రాంతాలకు చెందిన కేబుల్ ఆపరేటర్లు మానవత్వాన్ని చాటుకున్నారు. ఇటీవల మృతిచెందిన కేబుల్ ఆపరేటర్ దాసరి రామ్మూర్తి గౌడ్ కుటుంబానికి అండగా నిలుస్తూ ఆయన కుటుంబ సభ్యులకు రూ. 50,016 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. రామ్మూర్తి గౌడ్‌కు ఇద్దరు కుమార్తెలు ఉండటంతో వారి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కేబుల్ ఆపరేటర్లు స్వచ్ఛందంగా విరాళాలు సేకరించి ఈ సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు. ఇలాంటి క్లిష్ట సమయంలో తోటి కేబుల్ ఆపరేటర్ కుటుంబానికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని వారు పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా కుటుంబానికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్‌సీ నెట్‌వర్క్ ఇన్‌చార్జి చల్లగొండ నరేంద్ర రావు, చుంచు వీరేశం, కట్టంగూరి సచిన్ రెడ్డి, దూలం అంజి గౌడ్, నరగోని విశ్వనాథ్ గౌడ్, వొద్ది రవీందర్, అరెల్లి సురేష్ తోపాటు ఇల్లెందుకుంటా వీణవంక జమ్మికుంట మండలాలకు చెందిన కేబుల్ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

# కస్తూరిబా విద్యాలయానికి 45 డిస్క్ బెంచీల విరాళాలు



**ఆర్మూర్,జూలై23 (నినాదం):** నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం ఏరుగట్ల మండల కేంద్రంలో గల కస్తూర్బా బాలికల విద్యాలయానికి సుమారు రెండు లక్షల రూపాయల విలువ గల 45, డిస్క్ బెంచీలను విరాళంగా విద్యార్థినిలకు దాత -వసంత టూర్ అండ్ ట్రావెల్స్ అధినేత ఏనుగు దయానంద రెడ్డి అందజేశారని స్థానిక సర్పంచ్ కొలిపాక ఉపేంద్ర తెలిపారు. గురువారం రోజున స్థానిక సర్పంచ్ కొలిపాక ఉపేంద్ర, బాల్కొండ ఫిజికల్ డైరెక్టర్ జైడి రాజ్ కుమార్, మాజీ జెడ్పిటిసి గుల్లే రాజేశ్వర్, మండల టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఏ.రాజా పూర్ణ నందం, బద్దం శ్రీనివాస్, తుపాకుల శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీటీసీ జక్కాని మధుసూదన్, మాజీ ఎంపీటీసీ అంజయ్య, దేవుడు నరసయ్య, బద్దం హనుమాన్లు, రూక్కేడ మోహన్, పారిపల్లి రమేష్, అట్లా పోచయ్య, సున్నం శ్రీనివాస్, బద్దం శ్యామ్ సుందర్, ఎల్ఈడి బాల కిషన్, జాతీయస్థాయి క్రీడాకారులు పీ.ఈ.టీ.లు. జైపాల్, ఆనంద్, పలువురు ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దల సమక్షంలో కస్తూరిబా బాలికల విద్యార్థినిలకు 45, డిస్క్ బెంచ్ లను సర్పంచ్ కొలిపాక ఉపేంద్ర ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, కస్తూరిబా బాలికల విద్యాలయంలో డిస్క్ బెంచీల కొరత ఉందని తెలుసుకున్న వసంత టూర్స్ అండ్ ట్రావెల్స్ అధినేత ఏనుగు దయానంద రెడ్డి అందజేయడంతో, తమ చేతుల మీదుగా పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఇట్టి సహాయాన్ని త్వరితగతిన అందించేలా, పాఠశాలకు సక్రమంగా చేరేలా, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవడంతో, సకాలంలో విద్యాలయానికి చేరుకుని పలువురు చేతుల మీదుగా పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవడంతో విద్యార్థినులకు ఎంతో ఉపయోగకరంగా మారిందన్నారు. ఈ సందర్భంగా కస్తూరిబా విద్యాలయ పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థినిలు, స్థానిక గ్రామ ప్రజలు దాత ఏనుగు దయానంద రెడ్డికి, సహకరించిన మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

## బానోత్ రాము



**వైరా,జులై 24( నినాదం):** పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఖానాపురం ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు బానోత్ రాము పిలుపునిచ్చారు. గురువారం పాఠశాలలో తోటి ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులకు ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణలో పౌరుల బాధ్యతను, కర్తవ్యాన్ని వివరిస్తూ, ప్రస్తుతం ప్రకృతిలో ఏర్పడుతున్న అసమతుల్య వాతావరణ పరిస్థితుల పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తోటి ఉపాధ్యాయుల ఉద్దేశించి మధ్యాహ్న భోజన సమయంలో "దయచేసి మీ ప్లేట్లు, గ్లాసులు వెంట తెచ్చుకోండి" అని కోరారు. ఆయన పిలుపుకు స్పందించిన తోటి ఉపాధ్యాయులు వెంటనే సహకరించడంతోపాటు పర్యావరణ పరిరక్షణలో తమ బాధ్యతను, కర్తవ్యాన్ని, సామాజిక చైతన్యాన్ని చాటిచెప్పారు. ఉపాధ్యాయుల స్పందన పై బానోత్ రాము కృతజ్ఞతలు తెలియజేశారు.

# తహసీల్దార్ కార్యాలయంలో సర్ పై సమీక్ష సమావేశం

**పాల్గొన్న హుజురాబాద్ ఆర్డీవో జల కుమారి**



**జమ్మికుంట, జూలై 23 (నినాదం):** జమ్మికుంట తహసిల్దార్ కార్యాలయంలో హుజురాబాద్ ఆర్డిఓ జల కుమారి ఆధ్వర్యంలో ఎస్ఐఆర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియలో ఇంకా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు, ప్రతి అర్హుడైన ఓటరుకు అవకాశం కల్పించేలా స్థానిక కౌన్సిలర్స్, బీఎల్ఓలు పరస్పర సమన్వయంతో క్షేత్రస్థాయిలో ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ మున్సిపల్ కమిషనర్ సమన్వయంతో జమ్మికుంట పట్టణ పరిధిలోని 30 వార్డుల కౌన్సిలర్స్ బీఎల్ఓలతో కలిసి గ్రౌండ్ లెవెల్‌లో ప్రతి ఓటరును గుర్తించి, ఒక్క అర్హుడైన ఓటరు కూడా జాబితాలో మిస్ కాకుండా ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియను వంద శాతం విజయవంతం చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి, ఎమ్మార్వో గడ్డం సుధాకర్, కౌన్సిలర్స్ బి ఎల్ వో లు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు..

# ఘనంగా శ్రీ వారాహి మాత నవరాత్రి ముగింపు ఉత్సవాలు



**చింతపల్లి, జూలై 23 (నినాదం):** మండల కేంద్రంలోని శ్రీ షిరిడి సాయిబాబా ఆలయంలో శ్రీ వారాహి మాత నవరాత్రి ముగింపు ఉత్సవాలను గురువారం అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో కళకళలాడగా, ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఉత్సవాల్లో భాగంగా ఆలయ కమిటీ చైర్మన్ మంచికంటి ధనంజయ్య-పావని దంపతులు శ్రీ వారాహి మాతకు ప్రత్యేక అభిషేకాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం 108 మూలికలతో మహా హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ వైభవంగా నిర్వహించారు. హోమంలో పాల్గొన్న భక్తులు అమ్మవారి అనుగ్రహం కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ మంచికంటి ధనంజయ్య మాట్లాడుతూ, శ్రీ వారాహి మాత అనుగ్రహంతో ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొమిరిశెట్టి వెంకటయ్య-చంద్రకళ దంపతులు, కోశాధికారి ఊరే కృష్ణయ్య-కృష్ణవేణి దంపతులు, కొమిరిశెట్టి వినోద్ కుమార్--స్వాతి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై శ్రీ వారాహి మాత ఆశీస్సులు పొందారు.

### తోటి రిపోర్టర్‌కు మల్కాజిగిరి ప్రెస్‌క్లబ్ సభ్యులు చేయూత



**మల్కాజిగిరి, జులై 23 (నినాదం):** అనారోగ్యంతో బాధపడుతూ తులసి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రిపోర్టర్ పరమేష్ ను మల్కాజిగిరి ప్రెస్ క్లబ్ సభ్యులు 518/23 ఆధ్వర్యంలో వెళ్లి పరామర్శించి రూ. 10 వేల చెక్కును అందజేసి, తాను త్వరగా కోలుకోవాలని సభ్యులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షులు బాలరాజు, ప్రధాన కార్యదర్శి విశాల్ యాదవ్, రెహమాన్, సంగమేష్, మహేందర్ యాదవ్, నాగరాజు, అక్కల రాజు, ప్రభాకర్, కృష్ణ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

సర్ ప్రోగ్రాం ను విజయవంతంగా

## పూర్తి చేయాలి

**హుజురాబాద్ ఆర్డీవో జల కుమారి**
**బి ఎల్ ఓ లకు రైన్ కోట్స్ పంపిణీ**



**జమ్మికుంట, జూలై 24 (నినాదం) :** సర్ ప్రోగ్రాంను విజయవంతంగా పూర్తి చేయాలని ఎక్కడ ఎలాంటి తప్పులు లేకుండా పూర్తిస్థాయిలో ఓటర్లకు అవగాహన కల్పించి హుజురాబాద్ నియోజకవర్గం పరిధిలో ఈ కార్యక్రమాన్ని నెంబర్ వన్ స్థానంలో నిలిపేలా బిఎల్వోలు నిబద్ధతతో పనిచేయాలని హుజురాబాద్ ఆర్డీవో జల కుమారి అన్నారు. గురువారం జమ్మికుంట మండలంలోని పలు గ్రామాలలో ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా బిఎల్ఓ ల పనితీరును ఆమె పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఇదే ఉత్సాహంతో పూర్తిస్థాయిలో సర్ ప్రోగ్రాంను విజయవంతం చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం జమ్మికుంట తహసిల్దార్ కార్యాలయంలో బిఎల్ఓ లకు రాబోయే వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని రైన్ కోట్స్ ను అందించారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి జమ్మికుంట తహసిల్దార్ గడ్డం సుధాకర్ డిప్యూటీ తహసిల్దార్ ఏశంకర్ గిర్దవార్లు జి శంకర్ సత్యనారాయణ కార్యాలయ సిబ్బంది పలువురు బిఎల్వోలు పాల్గొన్నారు.

ఈదులకుంట చెరువులో

## పడి వ్యక్తి గల్లంతు



**జవహర్ నగర్, జులై 23 (నినాదం):** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ లోని ఈదులకుంట చెరువులో ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి పడి గల్లంతయ్యాడు. ఈ ఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది ఎస్ హెచ్ ఓ సైదులు తెలిపిన కథనం ప్రకారం దమ్మాయిగూడ పరిధిలోని ఆర్ జి కే కాలనీలో శివ భార్య పిల్లలతో కలిసి నివసిస్తున్నాడు. శివ సెంట్రింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. స్నేహితులతో కలిసి జవహర్ నగర్ లోని ఈదులకుంట చెరువు లో పడి మృతి చెందాడు. స్థానికులు జవహర్ నగర్ పోలీసులకు సమాచారం అందించగా వెంటనే పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని డిఆర్ఎస్ బృందాలతో శివమృతదేహం కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# బీఎంఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు
## ఎల్గొన్న బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి



**ఎల్బీనగర్, జూలై 23,(నినాదం):** భారతీయ మజ్దూర్ సంఘ్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని వివేకానంద నగర్ ఆటో డ్రైవర్ యూనియన్ అధ్యక్షులు రూపులాల్ ఆధ్వర్యంలో గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలోని వివేకానంద నగర్ బస్ స్టాప్ వద్ద బీఎంఎస్ పతాకావిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ నాయకులు బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి హాజరై ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. దేశంలో అతిపెద్ద కార్మిక సంఘంగా భారతీయ మజ్దూర్ సంఘ్ కార్మికుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, సామాజిక భద్రత కోసం నిరంతరం సేవలందిస్తోందని కొనియాడారు. దేశ ఆర్థికాభివృద్ధికి కార్మికుల శ్రమే పునాది అని, వారి గౌరవం సంక్షేమాన్ని కాపాడటానికి భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. బీఎంఎస్ స్థాపన నుంచి జాతీయ భావజాలంతో కార్మికులను ఏకతాటిపైకి తీసుకువచ్చి దేశాభివృద్ధిలో భాగస్వాములను చేస్తోందని పేర్కొంటూ, ఆటో డ్రైవర్లు సహా అన్ని వర్గాల కార్మికుల సంక్షేమం కోసం తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షులు దాసరి జయప్రకాష్, బీఎంఎస్ ఆటో డ్రైవర్ యూనియన్ సభ్యులు షైక్ ఉమర్, కేశవ్, నర్సింహా, చింటూ, శారదానగర్ కాలనీ పెద్దలు శివరామయ్య, స్థానిక నాయకులు, బీజేపీ కార్యకర్తలు, ఆటో డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు 28 నుంచి హైదరాబాద్ ప్రాపర్టీ షో




**హైదరాబాద్ బ్యూరో , జూలై 23(నినాదం) :** క్రెడాయ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో హైదరాబాద్ ప్రాపర్టీ షో-2026 ఆగస్టు 28 నుంచి 30 వరకు హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లోని హాల్స్ 1, 3లో నిర్వహించ నున్నట్లు ప్రకటించారు. ఈ ఏడాది ప్రాపర్టీ షో థీమ్ "రేటు ఆగదు... డిమాండ్ తగ్గదు"గా నిర్ణయించారు. షోలో 100కు పైగా రెరా ఆమోదిత ప్రాజెక్టులు ప్రదర్శనకు ఉండగా, కొనుగోలుదారులు డెవలపర్లతో నేరుగా మాట్లాడే అవకాశం, ప్రముఖ బ్యాంకుల నుంచి గృహ రుణాలపై సమాచారం, ఆర్థిక సలహాలు పొందే వీలుంటుందని క్రెడాయ్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎన్. జైదీప్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లో మౌలిక సదుపాయాల విస్తరణ, ఐటీ రంగ అభివృద్ధితో రియల్ ఎస్టేట్‌కు నిరంతర డిమాండ్ కొనసాగుతోందని ఆయన పేర్కొన్నారు.

జగ్గారెడ్డి - నిర్మల ఆధ్వర్యంలో సంగారెడ్డిలో

## 1000 మందితో మహా పాదయాత్ర

**రాహుల్ గాంధీ కి మద్దతుగా నల్ల టీ షర్ట్స్ ధరించి క్లాసిక్ గార్డెన్స్ నుండి గంజి మైదాన్ వరకు పాదయాత్ర**

**మద్దతుగా గత మూడు రోజులనుండీ సంగారెడ్డిలో కొనసాగుతున్న ఆందోళనలు**



**సంగారెడ్డి బ్యూరో, జులై 23 (నినాదం):** నీట్ పేపర్ లీకేజీ ఘటన బాధితులపై చర్యలు తీసుకోవాలంటూ... రాహుల్ గాంధీ చేసిన నిరసనలకు మద్దతుగా సంగారెడ్డిలో మూడో రోజు ఆందోళనలు కొనసాగాయి. ప్రజల పక్షాన నిలుస్తున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని అరెస్ట్ చేయడం ఆటవికపు చర్య అంటూ సంగారెడ్డిలో పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి మండిపడ్డారు. తమ పార్టీ నేతలను నిర్బంధించి... పార్లమెంటులో గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారంటూ ఆరోపించారు. నీట్ పరీక్ష రాసిన విద్యార్థులతో పాటు. రాహుల్ గాంధీకి మద్దతుగా పాదయాత్ర చేశారు. కేంద్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా... నల్ల టీ షర్టు ధరించి సుమారు 1000 మంది ఈ పాదయాత్రలో పాల్గొన్నారు. సంగారెడ్డి పట్టణం లోని క్లాసిక్ గార్డెన్స్ నుండి మొదలుకుని గంజి మైదాన్ వరకు 5 కిలోమీటర్ల మేర ర్యాలీ సాగింది. ప్లకార్డులు ప్రదర్శన, నినాదాలతో కార్యకర్తలు నిరసన ను హోరెత్తించారు.

## కుత్బుల్లాపూర్ అభివృద్ధి పనులపై ఇంజనీరింగ్ ఉన్నతాధికారులతో ఎమ్మెల్యే సమీక్ష



**కుత్బుల్లాపూర్, జులై 23 (నినాదం) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో సుమారు రూ. 20 కోట్ల వ్యయంతో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా, నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా పూర్తి చేయాలని బీఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ సంబంధిత శాఖల ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా పేట్ బషీరాబాదు లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో నియోజకవర్గంలోని రహదారుల నిర్మాణం, విద్యుత్ సేవలు, పారిశుద్ధ్య నిర్వహణ, పార్కుల అభివృద్ధి, వీధి దీపాల ఏర్పాటు, వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చేపట్టాల్సిన ముందస్తు చర్యలు, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులతో ఎమ్మెల్యే సమగ్రంగా సమీక్షించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రతి అభివృద్ధి పనిని నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని, పనుల నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడవద్దని అధికారులను ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, సమస్యలపై వెంటనే స్పందించి పరిష్కార చర్యలు చేపట్టాలని, క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ నిర్వహించాలని సూచించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ మంజూరైన నిధులను సమర్థవంతంగా వినియోగించి ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# యువత ఆక్రోశానికి.. సమాధానమేదీ?

సంపాదకీయం

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు సోమవారం ప్రారంభం అయ్యాయి. వరుసగా నాలుగోరోజు కూడా ఉభయ సభల్లో గందరగోళం నెలకొంది. సమావేశాలు సజావుగా సాగడం లేదు. నీట్ లీకేజీపై ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న డిమాండ్‌తో కాక్రోచ్ జనతాపార్టీ ఆందోళనలకు దిగింది. నీట్ లీకేజీకి బాధ్యతగా కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న డిమాండ్‌తో సంసద్ చలో ఆందోళనకు పిలుపునిచ్చింది. వారి ఆందోళనలో వందశాతం న్యాయం ఉంది. ఎందుకంటే పరీక్షలను కూడా సక్రమంగా నిర్వహించలేని అసమర్థులు...పాలకులు అయినప్పుడు ప్రజలు స్పందిస్తారు. నిలదీస్తారు. నీట్ పరీక్ష వల్ల జరిగిన గందరోగళం ఎందరినో బలితీసుకుంది. ఎందరో తల్లిదండ్రులు క్షోభకు గురయ్యారు. దీనిని ఓ చిన్న సమస్యగా ప్రభుత్వం భావించి ఉండవచ్చు. కానీ విద్యార్థులకు మాత్రం ఇది జీవన్మరణ సమస్య. ఇకపోతే నాలుగు రోజులుగా గందరగోళం జరుగుతున్నా ప్రధాని మోడీ మౌనం వీడడం లేదు. కేవలం ఎక్స్ వేదికగా కఠినంగా వ్యవహరిస్తామని, నీట్ దోషుల కోసం ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేస్తామని ప్రకటించి చేతులు దులుపుకున్నారు. దేశంలో ఓ పెద్ద ఆందోళన జరుగుతంటే ఇదేనా ప్రధానిగా ఉన్న వ్యక్తి చేయాల్సిన పని. మణిపూర్ అల్లర్లు, ఢిల్లీలో రైతుల ఆందోళన, నీట్ పరీక్షా పేపర్ లీకేజీ, అయోధ్య విరాళాల చోరీ..ఇటీవల వరుసగా జరిగిన సంఘటనలు దేశాన్ని కుదిపేస్తున్నాయి. వీటిపై పార్లమెంటులో చర్చించడం జరగాలి. ప్రధాని మోడీ మౌనం వీడి పార్లమెంట్‌కు వచ్చి, నేరుగా సమాధానం చెప్పాల్సిన ముఖ్యమైన అంశాలు. దివంగత ప్రధాని మన్మోహన్ సింగ్‌ను మౌనమునిగా విమర్శించిన మోడీ ఇప్పుడు అంతకు మించి మౌనంగా మారారు. పార్లమెంట్ జరుగుతన్నా రాకుండా చోద్యం చూస్తూ ఎక్స్‌లో పోస్టులు పెట్టడం సరికాదు. ఇక్కడ సమాధానం చెప్పడం అంటే దేశప్రజలకు సమాధానం చేరవేయడంగా గుర్తించాలి. బాధ్యతగల ప్రధానిగా మోడీ పార్లమెంట్‌కు వచ్చి సమాధానం ఇవ్వాలి. కానీ అలా జరగడం లేదు. ఇంతకన్నా దౌర్భాగ్యం మరోటి లేదు. ఆయన వందిమాగధులు ఇదంతా విపక్షాలతో తమకున్న పంచాయితీలాగా సవాళ్లు విసరుతున్నారు. దేశం తీవ్ర ఆందోళనలో ఉంటే ఇదేనా పాలక పార్టీ వ్యవహరించే తీరు. ఇకపోతే దేశంలోని వ్యవస్థల్లో అవినీతి పాతుకుపోయిందనడానికి నీట్ పేపర్ లీకేజీ వంటివి పరాకాష్టగా చూడాలి. అవినీతి అన్నది రాజకీయ నాయకుల హక్కుగా మారింది. ప్రజలను ఏమార్చి, అధికారం చేపట్టగానే, ఓటు బ్యాంకు రాజకీయాలు తప్ప దేశహితం, దేశాన్ని ముందుకు తీసుకుని వెళ్లేందుకు అసవరమైన నిర్ణయాలు తక్కువే జరుగుతున్నాయి. ఇటీవల రామమందిరంలో విరాళాల చోరీ ఘటన తెలిసిందే. అవినీతి కేసుల్లో దోషులకు మరణశిక్ష విధించాలి. అవినీతి సాధారణమేనని సగటు భారత పౌరులు ఆలోచించే పరిస్థితి నెలకొన్నది. దొరికే వరకు కూడా ఇది తప్పు అని కూడా భావించడంలేదు. వ్యవస్థలో అవినీతిని రూపుమాపాలని ప్రభుత్వం నిజంగా భావిస్తే, చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలి. చట్టాన్ని సవరించాలి. దోషులకు మరణ శిక్ష విధించేలా మార్పులు చేయాలి. ఉన్న చట్టాలతోనే కఠిన శిక్షలు విధించాలి. ఇకపోతే దేశంలో విద్యా వ్యవస్థ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందనడంలో ఎలాంటి సందేహం అక్కర్లేదు. గత పదేళ్లలో ఏకంగా 152 పోటీ పరీక్షల ప్రశ్నాపత్రాలు లీక్ అయ్యాయని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఆరోపించారు. సగటున నెలకు ఒక పేపర్ లీక్ అవుతున్నా బాధ్యులైన వారికి పడిన శిక్షలు మాత్రం సున్నా అని ధ్వజమెత్తారు. నిజంగానే ఇది ముమ్మాటికీ నిజం. నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీకి నిరసనగా శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసులు లాఠీఛార్జ్ చేయడానికి ముందే ప్రధాని మోడీ పార్లమెంటులో స్పందించి ఉంటే ఈ గందరగోళం చెలరేగేది కాదు. ప్రతి ఆందోళనను రాజకీయ కోణంలో చూడడం, విపక్షాలను తిట్టిపోయడం వల్ల సమస్యలను పాలకులు గుర్తించడం లేదు. ఒకప్పుడు ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిన భారత విద్యా వ్యవస్థ.. అక్రమాలు, లీకేజీలకు నిలయంగా మారింది. దేశంలో పేపర్ లీకేజీలు ఒక పెద్ద మాఫియాగా మారాయి. దీని వెనుక ఉన్న బడాబాబులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవడంలో విఫలం అవుతూ వస్తోంది. జంతర్ మంతర్ వద్ద భారతీయ యువత నిరసనలను సీరియస్‌గా తీసుకోవాల్సి ఉండగా, దానిని అణచివేయడం ఎలా అన్న ఆలోచననే అధికారపక్షం ఆలోచన చేయడం సరికాదు. నిరసనల్లో లక్ష మందికి పైగా యువకులు, విద్యార్థులు పాల్గొని ఉంటారని ఫోటోలు స్పష్టంగా సూచిస్తున్నాయి. తొలుత ఒక మార్చ్‌గా అనుకున్నది తరువాత నిరసన ప్రదర్శనగా పరిణమించింది. ఎంతోకాలంగా ఆగ్రహంతో ఉన్న యువత ఈ అవకాశాన్ని అనుకూలంగా తీసుకుని, వెల్లువెత్తి జనసంద్రంగా మారినట్లు మనకు కనిపిస్తోంది. మన దేశంలో రాజకీయ పార్టీల ర్యాలీలకు డబ్బులు, ఇతర ప్రలోభాలతో జనాన్ని సవి□కరించడం పరిపాటి. అయితే ఈ నిరసన ప్రదర్శన అలా జరగలేదు. జంతర్ మంతర్‌కు చేరిన వారందరూ తమకు తాముగా స్వచ్ఛందంగా వచ్చినవారే. ప్రతి ఒక్కరూ సామాజిక మాధ్యమాలలో విజ్ఞప్తులకు ప్రతిస్పందించి స్వచ్ఛందంగా వచ్చినవారే. ఎవరి ప్రయాణ ఏర్పాట్లు వారే చేసుకుని, సుదూర ప్రాంతాల నుంచి నడిచి వచ్చినవారు చాలామంది ఉన్నారు. ఇంకో ముఖ్య విషయమేమంటే వచ్చిన వారిలో యువ మహిళల శాతం అత్యధికంగా ఉండడం. ఈ నిరసన ప్రదర్శనలో పాల్గొన్నవారిలో అత్యధికులు ఇటువంటి నిరసనలలో తొలిసారి పాల్గొన్నవారే కావడం మరో వాస్తవం. కేవలం నీట్ తదితర ప్రశ్నపత్రాల లీక్‌కు రగిలిపోయి మాత్రమే యువత జంతర్ మంతర్ వద్ద ధర్నాకు రాలేదని ఖచ్చితంగా చెప్పవచ్చు. దేశంలో పెచ్చరిల్లు తోన్న నిరుద్యోగం, అవినీతిమయమైన అధికార వ్యవస్థలు, రాజకీయ పార్టీల కపటాలు అన్నీ కలగలిపి వారిని ఈ నిరసనలో పాల్గొనేలా ప్రోత్సహించాయనే చెప్పాలి. విద్యాభ్యాసాన్ని పూర్తిచేసుకుని ఉద్యోగాలను వెతుక్కుంటున్న వారు, నియామకాలలో అవకతవకలకు బాధితులైనవారు ఎందరో ఆ నిరసనకారుల్లో ఉన్నారని చెప్పక తప్పదు. దేశ పాలనావ్యవస్థల్లో అవినీతి మితివి రి, రాజకీయ అవినీతి పెరిగిపోవడం, పాలకుల విలాసాలు, ప్రజలేమో అవస్థల పాలవుతున్న తీరు కారణంగా యువత నిరసనలకు ఉద్యమించిందని చెప్పక తప్పదు. దీనికి విదేశీ హస్తం ఉందనో లేదా మరే ఇతర కారణాలనో చూపి మసిపూసి మారేడుకాయ చేసే ప్రయత్నాలు కూడా మంచిది కాదు. సమస్యలను గుర్తించి పాలకులు తమ తీరును మార్చుకోవాలి. ఇది కేంద్ర రాష్ట్ర□ల పాలకులుకు ఓ హెచ్చరిక కావాలి. అలాగే ఈ యువ నిరసన ఒక ఆరంభం మాత్రమే. ఇది దావానలంలా విస్తరించినా ఆశ్చర్య పోనవసరం లేదు. పాలకులు బుద్ధి తెచ్చుకుని మారకపోతే యువత చరిత్ర సృష్టిస్తుందని చెప్పక తప్పదు.

# రాజకీయ ఆరోపణలా.. విద్యార్థుల భవిష్యత్తా?

**దేశవ్యాప్తంగా వైద్య విద్యలో ప్రవేశానికి అత్యంత కీలకమైన నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ కు సంబంధించి ఇటీవల తలెత్తిన వివాదాలు, పరీక్షా భద్రతపై వ్యక్తమైన అనుమానాలు, ప్రశ్నాపత్రాల భద్రతకు సంబంధించిన ఆరోపణలు, పరీక్షా నిర్వహణలో లోపాలపై నమోదైన కేసులు లక్షలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో ఆందోళనకు దారితీశాయి.**



### గిరిజన యువత ఆశయాలకు భరోసా ఎక్కడ?

**దేశంలోని పలు ప్రాంతాల్లో విద్యార్థులు నిరసనలు వ్యక్తం చేయడం, పరీక్షా వ్యవస్థలో మరింత పారదర్శకత కోరడం ప్రజాస్వామ్య సమాజంలో సహజమైన పరిణామమే. అయితే, ఈ మొత్తం చర్చలో కేంద్రబిందువుగా ఉండాల్సింది రాజకీయాలు కాదు, విద్యార్థుల భవిష్యత్తు. లక్షలాది మంది యువత ఎన్నో సంవత్సరాల శ్రమతో సిద్ధమయ్యే జాతీయ స్థాయి పరీక్షలపై ప్రజల విశ్వాసం దెబ్బతినకుండా చూడటం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, పరీక్షా నిర్వహణ సంస్థల ఉమ్మడి బాధ్యత. పరీక్షలపై వచ్చే ప్రతి ఆరోపణను నిష్పాక్షికంగా, పారదర్శకంగా విచారించడం ఎంత అవసరమో, ఆధారాలు నిర్ధారించకముందే ఎలాంటి నిర్ణయాలకు రావడం అంతే ప్రమాదకరం.**

ఆరోపణలు కాదు... ఆధారాలే ప్రజాస్వామ్యానికి బలం

ఇటీవల తెలంగాణలో కూడా ఈ అంశం రాజకీయ చర్చకు దారితీసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొన్ని బహిరంగ సభల్లో చేసిన వ్యాఖ్యల్లో నీట్ పరీక్ష నిర్వహణకు సంబంధించి గతంలో వివాదాల్లో నిలిచిన సంస్థల ప్రస్తావనతో బీఆర్ఎస్ నాయకత్వంపై ఆరోపణలు చేయగా, బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కే.టి. రామారావు (కేటీఆర్) వాటిని ఖండిస్తూ ఆధారాలు చూపాలని సవాల్ చేశారు. ఈ ప్రకటనలు ప్రజా డొమైన్‌లో అందుబాటులో ఉన్నప్పటికీ, సంబంధిత దర్యాప్తు సంస్థలు లేదా న్యాయస్థానాలు నిర్ధారించే వరకు వాటిని ఆరోపణలు, ఖండనలుగానే పరిగణించాలి. భారత రాజ్యాంగంలోని అధికరణలు 14, 21తో పాటు సహజ న్యాయ సూత్రాలు కూడా అదే చెబుతున్నాయి. ప్రజాస్వామ్యంలో ఎవరినైనా ముందుగానే దోషిగా లేదా నిర్దోషిగా ప్రకటించడం కంటే, చట్టబద్ధమైన విచారణ, ఆధారాల పరిశీలన, న్యాయవ్యవస్థ తుది నిర్ణయాలకే ప్రాధాన్యం ఇవ్వడం ప్రజాస్వామ్య విలువలకు అనుగుణం.

అదిలాబాద్ కలలు... రాజకీయాలకు అతీతం

వివాదంలో అత్యధికంగా నష్టపోతున్నవారు అదిలాబాద్ వంటి వెనుకబడిన జిల్లాల విద్యార్థులే. గిరిజనులు, రైతులు, కూలీలు, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన అనేక మంది విద్యార్థులు వైద్య విద్యను తమ కుటుంబ జీవితాన్ని మార్చే అవకాశంగా భావించి ఎన్నో త్యాగాలతో నీట్‌కు సిద్ధమవుతున్నారు. కోచింగ్ కోసం అప్పులు చేయడం, దూర ప్రాంతాలకు వెళ్లి చదవడం, ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కోవడం వంటి పరిస్థితులు వారికి కొత్తవి కావు. అలాంటి సమయంలో పరీక్షా వ్యవస్థపై అనుమానాలు తలెత్తితే వారి ఆత్మవిశ్వాసమే దెబ్బ తింటుంది. ఈ నేపథ్యంలో భారత సుప్రీంకోర్టు కూడా నీట్‌కు సంబంధించిన విచారణల్లో విద్యార్థుల ప్రయోజనాలను కాపాడుతూ, ఆరోపణలపై సమగ్ర విచారణ జరగాలని, అయితే లక్షలాది మంది నిజాయితీగా పరీక్ష రాసిన విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతినకుండా సమతుల్య నిర్ణయాలు తీసుకోవాలని స్పష్టం చేసింది. పరీక్షా నిర్వహణలో వ్యవస్థాగత వైఫల్యం నిర్ధారితమైన సందర్భాల్లోనే తీవ్రమైన చర్యలను పరిగణించాల్సి ఉంటుందని కోర్టు చేసిన పరిశీలనలు విద్యార్థుల ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇచ్చే దృక్పథాన్ని ప్రతిబింబిస్తాయి.

విమర్శలు కాదు... వ్యవస్థలో మార్పులే పరిష్కారం

రాజకీయ ఆరోపణలు, ప్రత్యారోపణలు కొనసాగించడం కంటే పరీక్షా వ్యవస్థను మరింత పారదర్శకంగా, విశ్వసనీయంగా మార్చడంపైనే దృష్టి పెట్టాలి. ప్రశ్నాపత్రాల భద్రతను బలోపేతం చేయడం, పరీక్షా కేంద్రాల పర్యవేక్షణను కట్టుదిట్టం చేయడం, దర్యాప్తులో బాధ్యత నిర్ధారితమైన వ్యక్తులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవడం, విద్యార్థులకు పారదర్శక సమాచారం అందించడం అత్యవసరం. అదే సమయంలో అదిలాబాద్ వంటి జిల్లాల్లో నాణ్యమైన ఉచిత నీట్ కోచింగ్, గిరిజన మరియు గ్రామీణ విద్యార్థులకు ప్రత్యేక విద్యా సహాయం, డిజిటల్ లెర్నింగ్, కెరీర్ గైడెన్స్ వంటి కార్యక్రమాలను విస్తరించాల్సిన అవసరం ఉంది. రాజకీయాలు ఎన్నికలతో ముగుస్తాయి; కానీ ఒక విద్యార్థి కోల్పోయిన అవకాశం తిరిగి రావడం చాలా కష్టం. అందువల్ల కేంద్రం, రాష్ట్రాలు, పరీక్షా నిర్వహణ సంస్థలు, అన్ని రాజకీయ పార్టీలు విద్యార్థుల భవిష్యత్తును రాజకీయ ప్రయోజనాల కంటే ముందుగా ఉంచి, న్యాయబద్ధమైన, పారదర్శకమైన, విశ్వసనీయమైన పరీక్షా వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారానే ప్రజల విశ్వాసాన్ని నిలబెట్ట గలవు. కేంద్ర విద్యాశాఖ ప్రకటనలు, భారత సుప్రీంకోర్టు సంబంధిత పరిశీలనలు, ప్రజా డొమైన్‌లో అందుబాటులో ఉన్న సంబంధిత రాజకీయ నాయకుల అధికారిక ప్రకటనలు. ఈ వ్యాసంలో పేర్కొన్న రాజకీయ వ్యాఖ్యలు ఆయా నాయకులు బహిరంగంగా చేసిన ప్రకటనల ఆధారంగా మాత్రమే ప్రస్తావించబడ్డాయి. సంబంధిత అంశాలపై ఏదైనా దర్యాప్తు లేదా న్యాయ ప్రక్రియ కొనసాగుతున్నట్లయితే, ఆ ప్రక్రియల తుది నిర్ణయాలకే చట్టపరమైన ప్రాధాన్యం ఉంటుంది.

**ఫిరోజ్ ఖాన్ సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్**
**9640466464**

# నీట్‌పై విద్యార్థుల ఆక్రందన సబబే

### దానికి సానుకూలంగా స్పందించాల్సిందే

### ప్రభుత్వ విధానాలను తూర్పారా బట్టిన కమల్ హాసన్

న్యూఢిల్లీ :
ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నీట్ పరీక్షకు వ్యతిరేకంగా విద్యార్థులు చేపట్టిన నిరసనలకు ప్రముఖ నటుడు, రాజ్యసభ ఎంపీ కమల్ హాసన్ మద్దతు ప్రకటించారు. విద్యార్థుల ఆందోళనలపై స్పందిస్తూ కేంద్ర ప్రభుత్వ విధానాలపై ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఆయన పోస్టు పెట్టారు. 'ఒక బిడ్డ ఏడ్చినప్పుడే మనం వినాల్సింది. కానీ ఎంతోమంది పిల్లలు ప్రాణాలు కోల్పోయే వరకు వేచి చూశాం. నేర్చుకోవడం స్థానంలో శిక్షణ, జిజ్ఞాస స్థానంలో ఆందోళన, ప్రతిభ స్థానంలో నేర ప్రవృత్తి చోటుచేసుకుంది. ఇది కుళ్లిపోయిన వ్యవస్థ' అని వ్యాఖ్యానించారు. విద్యార్థులకు సమాధానాలు, అవకాశాలు అందించాల్సిన వ్యవస్థ వారిని అడ్డంకులు, ఒత్తిళ్లు, నిరాశల వైపు నెట్టివేస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 'పిల్లలకు సమాధానాల బదులుగా అడ్డంకులు, లాఠీలు ఎదురైతే అది ఒక దేశ వైఫల్యానికి సంకేతం' అని పేర్కొన్నారు. సామాజిక కార్యకర్త, విద్యా సంస్కరణల కోసం పోరాడుతున్న సోనమ్ వాంగ్‌చుక్‌ను ఉద్దేశించి కమల్ హాసన్ ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. 'దేశానికి రాబోయే ప్రయాణంలో మీ అవసరం ఉంది. దయచేసి మీ నిరాహార దీక్షను విరమించండి' అంటూ కోరారు. అదేవిధంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన భావోద్వేగ సందేశం ఇచ్చారు. 'భారతదేశ బిడ్డలారా.. మీరే మాలో ఉత్తములు. మీరు మీ కర్తవ్యాన్ని నెరవేర్చారు. ఇప్పుడు దేశం మీకు తన కర్తవ్యాన్ని నెరవేర్చాల్సిన సమయం వచ్చింది. మీకలలు ఎల్లప్పుడూ మా వైఫల్యాల కన్నా ఉన్నతంగా నిలవాలి' అని పేర్కొన్నారు. జంతర్ మంతర్ వద్ద కొనసాగుతున్న నీట్ వ్యతిరేక నిరసనలకు రాజకీయ, సామాజిక వర్గాల నుంచి మద్దతు పెరుగుతున్న నేపథ్యంలో కమల్ హాసన్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. విద్యార్థుల భవిష్యత్తు, విద్యావిధానం, ప్రవేశ పరీక్షలపై జాతీయ స్థాయిలో చర్చ మళ్లీ వేడెక్కుతోంది.



# దమ్ముంటే నీట్‌పై చర్చకు రావాలి

### విపక్షాలకు బిజెపి అధ్యక్షుడు నితిన్ నబిన్ సవాల్

న్యూఢిల్లీ, నినాదం:
దేశంలో ప్రకంపనలు పుట్టిస్తోన్న నీట్ పరీక్ష వ్యవహారం, పేపర్ లీక్‌ల అంశంపై పార్లమెంట్ వేదికగా ఓపెన్ డిబేట్‌కు సిద్ధమా అని భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ విపక్షాలకు సవాల్ విసిరారు. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో పాటు విపక్ష కూటమి పార్లమెంట్‌లో చర్చకు రాకుండా పారిపోతోందని, సభ ముందుకు వస్తే వారి 'ద్వంద్వ నీతి' బయట పడుతుందనే భయంతోనే వెనకడుగు వేస్తున్నారని నితిన్ నబిన్ ఆరోపించారు. పేపర్ లీక్ దోషులకు కఠిన శిక్షలు ఖరారు చేసేందుకు 'ఫాస్ట్ ట్రాక్ కోర్టులు' ఏర్పాటు చేస్తామని ప్రధాని నరేంద్ర మోదీ చేసిన ప్రకటన అనంతరం రాహుల్ గాంధీ తీవ్ర విమర్శల నేపథ్యంలో బీజేపీ అధ్యక్షుడు ఈ వ్యాఖ్యలు చేశారు. వి డియాతో మాట్లాడిన నితిన్ నబిన్ ప్రతిపక్షాల తీరుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. 'విద్యార్థులు, యువత భవిష్యత్తుకు సంబంధించి ప్రతి అంశంపైనా లోక్‌సభలో చర్చించేందుకు ఎన్డీఏ ప్రభుత్వం పూర్తి సిద్ధంగా ఉంది. సహా ఏ అంశంపైనైనా చర్చకు మేము సిద్ధం, వి రు సిద్ధమా? పార్లమెంట్ వేదికగా చర్చకు రావాలని రాహుల్ గాంధీకి సవాల్ విసురుతున్నాం' అని ఆయన అన్నారు. 'రాహుల్ గాంధీ రాజకీయ ప్రస్థానం అంతా పారిపోవడమే. దాదాపు 50`60 ఏళ్లుగా యువతను వంచించడం, రెచ్చగొట్టడం, దారి మళ్లించడమే కాంగ్రెస్ చరిత్ర. అందుకే సభలో చర్చకు వస్తే తమ రంగు బయటపడుతుందని భయపడుతున్నారని ఆయన ఎద్దేవా చేశారు. విపక్షాలు యువతను కేవలం నిరసనకారులుగా, 'రాళ్లు విసిరేవారిగా' మాత్రమే చూశాయని, కానీ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం యువతకు సురక్షితమైన, ప్రకాశవంతమైన భవిష్యత్తును అందించేందుకు కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

# చట్టం చెప్పేది ఏమిటి? అమలు ఎలా ఉండాలి!?

**ప్రజాస్వామ్యంలో అత్యంత కీలక బాధ్యత ప్రజా శాంతిభద్రతలను పరిరక్షించడం. అదే సమయంలో ప్రతి పౌరుడి గౌరవం, స్వేచ్ఛ, గోప్యతను కాపాడటం కూడా రాజ్యాంగం నిర్దేశించిన బాధ్యతే. ఈ రెండు విలువల మధ్య సమతుల్యతను కాపాడేందుకు రూపొందించిన పరిపాలనా సాధనాల్లో రౌడీ షీట్ ఒకటి. అయితే పర్యవేక్షణ ఉద్దేశం శిక్ష విధించడం కాదు. ప్రజా శాంతిభద్రతలకు ముప్పు ఉందని అందుబాటులో ఉన్న సమాచారం, రికార్డుల ఆధారంగా సంబంధిత అధికారులు అంచనా వేసిన సందర్భాల్లో, అలాంటి వ్యక్తుల కార్యకలాపాలను చట్టపరమైన పరిధిలో పర్యవేక్షించడం మాత్రమే దీని ఉద్దేశం. అందువల్ల ఇది ప్రతి కేసులోనూ, ప్రతి నిందితుడిపైనా స్వయంచాలకంగా వర్తించే వ్యవస్థ కాదు. అదే సమయంలో ఇది పౌర హక్కులను అనవసరంగా పరిమితం చేసే సాధనంగా మారకూడదు. ఈ సమతుల్యతే చట్టపాలనకు అసలు పరీక్ష.**



కేవలం కేసు నమోదు ఆధారంగా నిర్ణయం కాదు

రౌడీ షీట్ వ్యవస్థకు రాష్ట్రానుసారం పోలీస్ స్టాండింగ్ ఆర్డర్స్‌లో భిన్నమైన నిబంధనలు ఉండవచ్చు. నమోదైన రికార్డులు, అలాగే ప్రజా శాంతిభద్రతలకు నిరంతర ముప్పు ఉందనే పరిపాలనా అంచనాల ఆధారంగా వ్యక్తులపై నిఘా ఉంచేందుకు రౌడీ షీట్ వ్యవస్థను ఉపయోగిస్తారు. హత్య, హత్యాయత్నం, దోపిడీ, బలవంతపు వసూళ్లు వంటి తీవ్రమైన లేదా పునరావృత నేరాలకు సంబంధించిన నమోదైన కేసులు, అందుబాటులో ఉన్న సమాచారం, సంబంధిత చట్టపరమైన ప్రమాణాల మేరకు పరిశీలనలో భాగం కావచ్చు. అయితే కేవలం కేసు నమోదు కావడం, దర్యాప్తు కొనసాగుతుండడం లేదా ఆరోపణలు ఎదుర్కొనడం మాత్రమే ప్రతి సందర్భంలో స్వయంచాలకంగా ఇటువంటి చర్యకు ఏకైక ఆధారం కాకూడదు. దళిత గిరిజన వర్గాలకు రాజ్యాంగ బద్ధంగా వచ్చిన వజ్రాయుధమే అట్రాసిటీ ఆక్ట్ దాని కాపాడే దిశ గా ప్రభుత్వాల నిర్ణయాలు గాని, అధికారయంత్రాంగం కూడా ముందుకు సాగాలి. ఈ మధ్య సరైన విచారణ లేకుండా తరుచూ అట్రాసిటీ కేసులు నమోదు చేయడం, దాంతో నిందితులు పరస్పర కేసులు నమోదు అవ్వడం తో చట్టం నిర్వీర్యమయ్యే ప్రమాదం ఉంది. కావున సంబంధిత అధికారులు సేకరించిన సమాచారం, వ్యక్తి గత నేరచరిత్ర, నేరాల పునరావృతం, ప్రజా శాంతిభద్రతలకు భవిష్యత్తులో ఏర్పడే ముప్పు, అందుబాటులో ఉన్న ఆధారాలు వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించిన అనంతరమే పరిపాలనా నిర్ణయం తీసుకోవాలి. అలాంటి నిర్ణయాలు కూడా కాలానుగుణ సమీక్షకు లోబడి ఉండాలి.

గోప్యత కూడా ప్రాథమిక హక్కే

భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 చట్టం ముందు సమానత్వాన్ని, ఆర్టికల్ 19(1)(ఏ) భావ ప్రకటనా స్వేచ్ఛను, ఆర్టికల్ 21 గౌరవప్రదమైన జీవితం, వ్యక్తిగత స్వేచ్ఛను హామీ ఇస్తాయి. జస్టిస్ కె.ఎస్. పుట్టస్వామి వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా (2017) కేసులో సుప్రీంకోర్టు, వ్యక్తిగత గోప్యత కూడా భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 కింద ప్రాథమిక హక్కు అని స్పష్టం చేసింది. మరోవైపు నేరాలను అరికట్టడం, ప్రజల భద్రతను కాపాడడం పోలీసు శాఖకు చట్టం అప్పగించిన బాధ్యత. అందువల్ల ప్రజా భద్రత, పౌర హక్కులు అనే రెండు అంశాలను పరస్పర విరుద్ధాలుగా కాకుండా పరస్పర పూరకాలుగా చూడాలి. పరిపాలనా అధికారాల వినియోగం కూడా న్యాయ సమీక్షకు అతీతం కాదు. అందువల్ల ప్రతి నిర్ణయం చట్టబద్ధత, సహేతుకత, నిష్పాక్షికత, అవసరానుగుణత వంటి ప్రమాణాలను తట్టుకోవాలి. నిఘా చర్యలు అవసరమైన సందర్భాల్లో మాత్రమే చట్టబద్ధంగా అమలుకావాలి. వాటి అమలులో పారదర్శకత, జవాబుదారీతనం, కాలానుగుణ సమీక్ష వంటి సూత్రాలు పాటించబడాలి. ఒక వ్యక్తి తనపై తీసుకున్న చర్య చట్టబద్ధం కాదని భావిస్తే, సంబంధిత ఉన్నతాధికారులను లేదా భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 226 కింద హైకోర్టును ఆశ్రయించే హక్కు కలిగి ఉంటాడు. ఇదే రాజ్యాంగ బద్ధమైన పరిష్కార మార్గం.

ప్రశ్నలు వచ్చినప్పుడు పారదర్శక సమీక్ష అవసరం

ఈ నిఘా విధానంపై జరుగుతున్న చర్చ ఏ ఒక్క వ్యక్తి గురించో లేదా ఏ ఒక్క కేసు గురించో మాత్రమే కాదు. కొన్ని సందర్భాల్లో క్రిమినల్ కేసులు లేదా షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల (దౌర్జన్యాల నిరోధక) చట్టం, 1989 కింద నమోదైన కేసుల అనంతరం తీసుకునే పరిపాలనా చర్యల విషయంలో, సంబంధిత చట్టపరమైన ప్రమాణాలు సమానంగా పాటించబడుతున్నాయా అనే ప్రశ్నలు ప్రజా చర్చలో వినిపిస్తున్నాయి. అలాంటి ప్రతి సందర్భంలోనూ సంబంధిత చర్యలు వాటి స్వంత చట్టపరమైన ప్రమాణాలు, అందుబాటులో ఉన్న ఆధారాలు, వాస్తవ పరిస్థితుల ఆధారంగానే సమీక్షించబడాలి. అయితే ప్రతి కేసు దాని స్వంత వాస్తవాలు, చట్టపరమైన నిబంధనలు, సంబంధిత అధికారుల నిర్ణయాల ఆధారంగానే పరిశీలించబడాలి. ఒక సందర్భాన్ని ఆధారంగా చేసుకుని సాధారణ నిర్ధారణలకు రావడం సముచితం కాదు.

ప్రజా భద్రతపై బాధ్యత కొనసాగాలి

ప్రజా భద్రత కోసం రాష్ట్రానికి కల్పించిన అధికారాలు, పౌరులకు రాజ్యాంగం కల్పించిన హక్కులు – ఈ రెండింటి మధ్య సమతుల్యతను కాపాడడమే ప్రజాస్వామ్య స్ఫూర్తి. చట్టం కఠినంగా ఉండటం కంటే, అది న్యాయంగా, పారదర్శకంగా, వివక్ష లేకుండా అమలుకావడమే ప్రజాస్వామ్యానికి మరింత అవసరం. ఇలాంటి పరిపాలనా చర్యలకు స్పష్టమైన కారణాలు, నమోదైన ఆధారాలు, ఉన్నతాధికారుల పర్యవేక్షణ, కాలానుగుణ సమీక్ష వంటి అంశాలు నిరంతరం పాటించబడితే ప్రజల విశ్వాసం మరింత బలపడుతుంది. అదే సమయంలో ప్రజా శాంతిభద్రతలకు నిజమైన ముప్పుగా వ్యవహరించే వ్యక్తులపై చట్టబద్ధంగా, సమర్థవంతంగా చర్యలు తీసుకోవడం కూడా రాష్ట్రం యొక్క బాధ్యత. ప్రజాస్వామ్యంలో పౌర హక్కులు, పోలీసు అధికారాలు, న్యాయపాలన – ఈ మూడు ఒకదానికొకటి ప్రత్యర్థులు కావు, పరస్పర పూరకాలు. ప్రజాస్వామ్యంలో పౌర హక్కులు, పోలీసు అధికారాలు, న్యాయపాలన – ఈ మూడు ఒకదానికొకటి ప్రత్యర్థులు కావు, పరస్పర పూరకాలు. చట్టం ముందు అందరూ సమానులే అనే రాజ్యాంగ సూత్రం, చట్ట అమలులో కూడా సమానంగా ప్రతిబింబించినప్పుడే ఇటువంటి పరిపాలనా వ్యవస్థలపై ప్రజల విశ్వాసం మరింత బలపడుతుంది. అదే న్యాయపాలనకు నిజమైన కొలమానం.

**ఆరెల్లి మల్లేష్ సీనియర్ అడ్వకేట్,**
**ఎం.ఏ., బి.ఎడ్., ఎల్.ఎల్.ఎం. 9908702418.**
**(ఎస్సీ ఎస్టీ అట్రాసిట్ యాక్ట్ మానిటరింగ్ కమిటీ సభ్యులు)**



# కోచింగ్ సెంటర్లకు దాసోహంగా మారిన నీట్

### వెంటనే రద్దు చేసి, రాష్ట్రా లకే బాధ్యతలు ఇవ్వాలి
### విద్యార్థుల ఆందోళనకు మద్దతు పలికిన మాజీ సిఎం స్టాలిన్


చెన్నై :
ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నీట్‌కు వ్యతిరేకంగా విద్యార్థులు చేపట్టిన నిరసనలపై తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్ స్పందించారు. ఆందోళన చేస్తున్న విద్యార్థులకు తన పూర్తి మద్దతు ప్రకటించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఆయన పోస్టు పెట్టారు. నీట్ పరీక్షను నిలిపివేయడమే విద్యార్థుల సమస్యలకు ఏకైక పరిష్కారమని పేర్కొన్నారు. 'రాష్ట్రాలను నమ్మండి.. నీట్‌ను రద్దు చేయండి' అని డిమాండ్ చేశారు. నీట్ ప్రవేశపెట్టిన మ డు ప్రధాన లక్ష్యాల్లోనూ ఈ వ్యవస్థ పూర్తిగా విఫలమైందని స్టాలిన్ ఆరోపించారు. విద్యలో సమాన అవకాశాలు కల్పించడం, పారదర్శకత పెంచడం, నాణ్యమైన విద్యను ప్రోత్సహించడం వంటి లక్ష్యాలు సాధించడంలో నీట్ విఫలమైందని విమర్శించారు. పాఠశాల విద్యా వ్యవస్థను బలహీనపరిచి, కోచింగ్ సెంటర్ల ఆధిపత్యాన్ని పెంచే పరిస్థితిని నీట్ తీసుకువచ్చిందని పేర్కొన్నారు. విద్యార్థుల ఆవేదన, ఆందోళనలు కేంద్ర ప్రభుత్వానికి కనువిప్పు కావాలని స్టాలిన్ వ్యాఖ్యానించారు. విద్యార్థుల భవిష్యత్తు, సామాజిక న్యాయం, రాష్ట్రాల హక్కులను దృష్టిలో ఉంచుకుని కేంద్రం తన వైఖరిని పున:సవిక్షించాల్సిన అవసరం ఉందని సూచించారు. సామాజిక న్యాయాన్ని పరిరక్షించాలంటే నీట్ రద్దు అత్యవసరమని స్పష్టం చేశారు. గ్రావి ణ, పేద, వెనుకబడిన వర్గాల విద్యార్థులకు నీట్ అన్యాయం చేస్తోందని అభిప్రాయపడ్డారు.

## ఎక్కువసేపు ఒకేచోట కూర్చుని పనిచేసే వారికి

# వాకింగ్ తప్పనిసరి

**రోజంతా ఎక్కువసేపు ఒకేచోట కూర్చుని పనిచేయడం ఆధునిక జీవన శైలిలో సాధారణమైపోయింది. అయితే ఈ అలవాటు ఊబకాయం, మధుమేహం, గుండెజబ్బులు వంటి దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని పెంచుతుందని ఇప్పటికే అనేక అధ్యయనాలు హెచ్చరిస్తున్నాయి. తాజాగా నిర్వహించిన పరిశోధన ప్రకారం, ప్రతి గంటకు ఐదు నిమిషాల పాటు నడవడం ద్వారా ఈ ప్రమాదాలను కొంతవరకు తగ్గించడంతోపాటు అలసటను తగించి మానసిక ఉల్లాసాన్ని పెంచుకోవచ్చని తేలింది. ఈ అధ్యయన ఫలితాలను బ్రిటిష్ జర్నల్ ఆఫ్ స్పోర్ట్స్ మెడిసిన్లో ప్రచురించారు. ఇందులో గంటకోసారి ఐదు నిమిషాల నడక విరామం తీసుకోవడం ఆచరణలో సాధ్యమే కాకుండా,**





**ఆరోగ్యపరంగా కూడా అత్యంత ప్రయోజనకరమైన పద్ధతిగా గుర్తించారు. అంతేకాకుండా, ఈ చిన్న విరామాలు ఉద్యోగుల పనితీరును ఏమాత్రం దెబ్బతీయలేదని పరిశోధకులు వెల్లడించారు.**

**ఎక్కువసేపు కదలకుండా ఉంటే..**

ఎక్కువసేపు కదలకుండా కూర్చోవడం ప్రజారోగ్యానికి పెద్ద సవాలుగా మారిందని పరిశోధకులు పేర్కొన్నారు. దీనివల్ల ఊబకాయం, మధుమేహం, గుండె సంబంధిత వ్యాధులు మాత్రమే కాకుండా అకాల మరణ ప్రమాదం కూడా పెరిగే అవకాశం ఉందని వివరించారు. ఈ నేపథ్యంలో తరచూ లేచి కదలడం వల్ల కలిగే ప్రయోజనాలను వాస్తవ పరిస్థితుల్లో అంచనా వేయడానికి ఈ అధ్యయనం నిర్వహించారు. ఈ పరిశోధనలో భాగంగా 19,300 మందికి పైగా ఉద్యోగుల వివరాలను విశ్లేషించారు. వారిలో సుమారు 11,484 మంది వరుసగా 14 రోజుల పాటు ప్రతి 30 నిమిషాలకు, 60 నిమిషాలకు లేదా 120 నిమిషాలకు ఒకసారి ఐదు నిమిషాల నడక విరామాన్ని స్వచ్ఛందంగా ఎంచుకుని పాటించారు. దీనికి ముందు ఏడు రోజుల పాటు వారు తమ సాధారణ దినచర్యనే కొనసాగించారు.

**వాకింగ్‌తో ఆరోగ్యకరమైన ప్రయోజనాలు..**

21 రోజుల పరిశోధన కాలంలో ప్రతిరోజూ నిర్వహించిన సర్వే ద్వారా పాల్గొనేవారిలో అలసట, మానసిక స్థితి, పనితీరులో వచ్చిన మార్పులను పరిశీలించారు. మూడు రకాల విరామాలూ ఆచరణలో సాధ్యమేనని, ప్రజలు సులభంగా అంగీకరించగలరని ఫలితాలు వెల్లడించాయి. అయితే ప్రతి రెండు గంటలకు ఒకసారి విరామం తీసుకోవడం అమలు పరంగా సులభమైనప్పటికీ, ఆరోగ్య ప్రయోజనాల పరంగా తక్కువ ప్రభావాన్ని చూపింది. ప్రతి 30 నిమిషాలకు ఒకసారి విరామం తీసుకున్నవారిలో అలసట తగ్గడం, మానసిక ఉల్లాసం పెరగడం అత్యధికంగా కనిపించినప్పటికీ, దానిని క్రమం తప్పకుండా పాటించడం చాలామందికి కష్టంగా అనిపించింది. ఈ నేపథ్యంలో ప్రతి గంటకు ఒకసారి ఐదు నిమిషాల నడక విరామం తీసుకోవడం ఉత్తమ ఎంపికగా పరిశోధకులు పేర్కొన్నారు. ఇది అమలు చేయడానికి సులభంగా ఉండటంతో పాటు అలసటను తగ్గించడం, మంచి మానసిక స్థితిని పెంపొందించడం వంటి ప్రయోజనాలను సమతుల్యంగా అందించిందని వెల్లడించారు. అంతేకాకుండా, ఈ చిన్న నడక విరామాలు ఉద్యోగుల పనితీరుపై ఎలాంటి ప్రతికూల ప్రభావం చూపలేదని అధ్యయనం స్పష్టం చేసింది.

## చుంచుపల్లి మండలంలో


# రియల్ ఎస్టేట్ మాఫియా దందా?

### చోద్యం చూస్తున్న పంచాయతీ సెక్రటరీలు...?

**గ్రామపంచాయతీల గ్రీన్‌ల్యాండ్ మాయం..! కోట్ల రూపాయల భూములు ఎవరి చేతుల్లోకి..?**

**వెంచర్లలో తప్పనిసరిగా కేటాయించాల్సిన గ్రీన్‌ల్యాండ్ ఎక్కడ..?.. "వార్తలు రాసినా మాకేం కాదు... రేపటికి మర్చిపోతారు" అంటూ బహిరంగంగా మాట్లాడుకుంటున్న కొందరు వ్యాపారులు**

**జిల్లా స్థాయి విచారణ జరిపించాలని స్థానికుల డిమాండ్**




**చుంచుపల్లి, జూలై 23 (నినాదం):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. వ్యవసాయ భూములను వెంచర్లుగా మార్చి కోట్ల రూపాయల వ్యాపారం జరుగుతుండగా, గ్రామపంచాయతీల అభివృద్ధికి కేటాయించాల్సిన గ్రీన్‌ల్యాండ్ (ఓపెన్ స్పేస్) విషయంలో మాత్రం తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వెంచర్లలో నిబంధనల ప్రకారం గ్రామపంచాయతీకి అప్పగించాల్సిన భూములు నిజంగా అప్పగించారా? లేక కాగితాలకే పరిమితమయ్యాయా? అనే ప్రశ్నలు ఇప్పుడు మండల వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి.చుంచుపల్లి మండలంలోని అనేక గ్రామాల్లో గత కొన్నేళ్లుగా వరుసగా వెంచర్లు వెలుస్తున్నాయి. ఒకప్పుడు పంటలు పండిన భూములు నేడు ప్లాట్లుగా మారిపోయాయి. కోట్ల రూపాయల లావాదేవీలు జరుగుతున్నా, గ్రామాల భవిష్యత్తుకు అవసరమైన గ్రీన్‌ల్యాండ్ విషయంలో అధికారుల పర్యవేక్షణ కనిపించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. వెంచర్ అనుమతుల సమయంలో నిబంధనల ప్రకారం నిర్దిష్ట శాతం భూమిని ప్రజా అవసరాల కోసం కేటాయించాల్సి ఉంటుంది. ఈ భూములపై భవిష్యత్తులో అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామపంచాయతీ కార్యాలయాలు, కమ్యూనిటీ హాళ్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పార్కులు, పిల్లల ఆటస్థలాలు, గ్రంథాలయాలు, ఇతర ప్రభుత్వ భవనాలు నిర్మించే అవకాశం ఉంటుంది. కానీ అలాంటి భూములు గ్రామపంచాయతీలకు వాస్తవంగా అందుతున్నాయా అనే ప్రశ్నకు స్పష్టమైన సమాధానం కనిపించడం లేదని ప్రజలు అంటున్నారు. స్థానికంగా వినిపిస్తున్న ఆరోపణల ప్రకారం, కొన్ని వెంచర్లలో గ్రీన్‌ల్యాండ్‌ను చూపించకుండా లేదా ఇతర ప్రయోజనాలకు వినియోగిస్తూ ప్లాట్ల విక్రయాలు కొనసాగుతున్నాయని ప్రచారం జరుగుతోంది. ఈ వ్యవహారంలో సంబంధిత అధికారులు తనిఖీలు చేశారా? నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఏవైనా చర్యలు తీసుకున్నారా? అనే అంశాలపై ప్రజలకు స్పష్టత లేకపోవడం అనుమానాలకు మరింత బలం చేకూరుస్తోంది.ఇంకా ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, "పేపర్‌లో ఇవాళ వార్త వస్తుంది... రేపు మర్చిపోతారు... మాకేం కాదు" అంటూ కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు బహిరంగంగా మాట్లాడుకుంటున్నారనే ప్రచారం స్థానికంగా వినిపిస్తోంది. ఈ వ్యాఖ్యలు నిజమే అయితే, నిబంధనల అమలుపై వారికి అంత ధీమా ఎలా వచ్చింది? ఎవరి అండదండలు ఉన్నాయి? అనే ప్రశ్నలు ప్రజల నుంచి వస్తున్నాయి. గ్రామపంచాయతీ సెక్రటరీల పాత్రపై కూడా సందేహాలు వ్యక్తమవుతున్నాయి. వెంచర్లకు అనుమతులు ఇచ్చే ముందు గ్రీన్‌ల్యాండ్‌ను పరిశీలించారా? కేటాయించిన భూములను గ్రామపంచాయతీ పేరుకు బదిలీ చేయించారా? సంబంధిత రికార్డులు అందుబాటులో ఉన్నాయా? ఉంటే ప్రజలకు ఎందుకు వెల్లడించడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఒక్కో వెంచర్‌లో లక్షల నుంచి కోట్ల రూపాయల విలువైన భూములు ఉండే అవకాశం ఉన్న నేపథ్యంలో, ఈ గ్రీన్‌ల్యాండ్ అంశం సాధారణ విషయం కాదని స్థానికులు చెబుతున్నారు. నేడు గ్రామాలకు కేటాయించాల్సిన భూములు లేకపోతే, రేపు ప్రభుత్వ కార్యాలయాలు, ఆరోగ్య కేంద్రాలు, అంగన్‌వాడీలు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి ప్రభుత్వం మళ్లీ భూములు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.చుంచుపల్లి మండలంలోని అన్ని వెంచర్లను జిల్లా ఉన్నతాధికారులు సమగ్రంగా పరిశీలించాలని, ప్రతి వెంచర్‌లో గ్రీన్‌ల్యాండ్ ఎంత కేటాయించారు, ప్రస్తుతం ఆ భూమి ఎక్కడ ఉంది, గ్రామపంచాయతీ ఆధీనంలో ఉందా లేదా అనే వివరాలను ప్రజలకు వెల్లడించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.గ్రామాల అభివృద్ధికి ఉద్దేశించిన భూములు నిజంగా గ్రామాలకే ఉపయోగపడుతున్నాయా? లేక ప్రైవేటు ప్రయోజనాల కోసం కనుమరుగవుతున్నాయా? అనే ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత సంబంధిత శాఖలపై ఉందని ప్రజలు పేర్కొంటున్నారు. ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్, పంచాయతీరాజ్ శాఖ, సంబంధిత అధికారులు ప్రత్యేక విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరుతున్నారు.



## గూగుల్‌కు యూరోపియన్ యూనియన్

# భారీ జరిమానా

అమెరికా టెక్ దిగ్గజం గూగుల్‌కు యూరోపియన్ యూనియన్ భారీ జరిమానా విధించింది. పోటీదారులను అణచివేయడానికి తన ఆధిపత్యాన్ని దుర్వినియోగం చేస్తోందని ఈయూ యాంటీ ట్రస్ట్ రెగ్యులేటర్ పేర్కొంది. గూగుల్‌కు 890 మిలియన్ యూరోల (1 బిలియన్ డాలర్ల) జరిమానా విధించింది. భారత కరెన్సీలో సుమారు రూ.9,655 కోట్లు చెల్లించాలని ఆదేశించింది. ప్రత్యర్థులకు నష్టం కలిగించేలా గూగుల్ తన ప్లేస్టోర్, సెర్చ్ ఇంజిన్‌లను ఉపయోగించుకుని వినియోగదారులను తమ ఉత్పత్తుల వైపు మళ్లిస్తున్నట్లు ఈయూ కమిషన్ పేర్కొంది. సెర్చ్ ఇంజిన్‌లో తన సొంత షాపింగ్, హోటల్స్, ట్రాన్స్‌పోర్ట్, స్పోర్ట్స్ వంటి సేవలు ఎక్కువ దర్శనమిచ్చేలా గూగుల్ ప్రయత్నిస్తోందంటూ ఆరోపించింది. ఇందుకు గానూ డిజిటల్ మార్కెటింగ్ చట్టం కింద 460 మిలియన్ యూరోల ఫైన్ విధించింది. పోటీదారులు అందించే చౌకైన సబ్‌స్క్రిప్షన్ డీల్స్ వైపు యూజర్లు మళ్లకుండా థర్డ్ పార్టీ యాప్ డెవలపర్లను నియంత్రిస్తోందని పేర్కొంటూ మరో 430 మిలియన్ యూరోల జరిమానా విధించింది.

## 100 డాలర్ల దిశగా క్రూడ్

### మళ్లీ భగ్గుమన్న చమురు ధరలు




పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు నానాటికీ తీవ్రమవుతుండటంతో అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు మళ్లీ ఆకాశన్నంటుతున్నాయి. బ్రెంట్ క్రూడ్ ఆరు వారాల గరిష్ఠానికి చేరింది. గురువారం ఉదయం బ్యారెల్ ధర 1.5శాతానికి పైగా పెరిగి 95 డాలర్లు దాటి ట్రేడ్ అవుతోంది. ఇక, వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియెట్ క్రూడ్ బ్యారెల్ ధర 88 డాలర్ల వద్ద కొనసాగుతోంది. ఈ ఒక్క నెలలో బ్రెంట్ క్రూడ్ ధర ఇప్పటివరకు దాదాపు 30శాతం పెరగడం గమనార్హం. ఉద్రిక్తతలు ఇలాగే కొనసాగితే చమురు మంటలు మరింత పెరుగుతాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. అమెరికా-ఇరాన్ పరస్పర దాడులతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు ఇప్పట్లో తగ్గేలా కన్పించట్లేదు. ఈ పరిణామాలతో హర్మూజ్‌లో నౌకల రవాణా మళ్లీ నెమ్మదించింది. మరోవైపు, ఎర్ర సముద్రంలో సౌదీ అరేబియాకు చెందిన రెండు చమురు ట్యాకర్లపై హూతీలు దాడులు చేశారు. దీంతో అంతర్జాతీయంగా చమురు సరఫరాకు అంతరాయం వాటిల్లుతుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ చమురు మంటలు, అంతర్జాతీయ పరిణామాలతో దేశీయంగా స్టాక్ మార్కెట్లు గురువారం కూడా నష్టాల్లో కొనసాగుతున్నాయి. ఉదయం 9.40 గంటల సమయంలో సెన్సెక్స్ 300 పాయింట్లు తగ్గి 76,454 వద్ద ట్రేడ్ అవుతోంది. నిఫ్టీ 83 పాయింట్ల నష్టంతో 23,913 వద్ద కొనసాగుతోంది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 5 పైసలు పెరిగి 96.48గా ట్రేడ్ అవుతోంది.




# నాలుగో రోజూ నష్టాలే..



ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాలతో ముగిశాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, క్రూడాయిల్ ధరలు పెరగడం మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. ముఖ్యంగా ఫార్మా, ఐటీ, బ్యాంకింగ్ స్టాక్స్ అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొన్నాయి. దీంతో వరుసగా నాలుగో రోజూ మార్కెట్ సూచీలు నష్టాల బాటపట్టాయి. మదుపర్ల సంపదగా భావించే బీఎస్‌ఈలో నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.3 లక్షల కోట్లు క్షీణించి రూ.477 లక్షల కోట్లకు చేరింది. ఉదయం సెన్సెక్స్ 76,515.10 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 76,755.05) నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా సూచీ నష్టాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో 76,151.98 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరికి సెన్సెక్స్ 363.66 పాయింట్లు కోల్పోయి 76,391.39 వద్ద ముగిసింది. నిఫ్టీ 126.65 పాయింట్లు పతనమై 23,869.60 వద్ద స్థిరపడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 96.57గా ఉంది. సెన్సెక్స్ 30లో ఆదానీ పోర్ట్స్, బజాజ్ ఫైనాన్స్, ఇండిగో, యాక్సిస్ బ్యాంక్, రిలయన్స్, టాటాస్టీల్ షేర్లు ప్రధానంగా నష్టాలను చవిచూశాయి. మహీంద్రా అండ్ మహీంద్రా, టీసీఎస్, ఎటర్నల్, హెచ్‌సీఎల్, బజాజ్ ఫిన్‌సర్వ్, కోటక్ బ్యాంక్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్‌క్రూడ్ 97.95 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్సు 4,088.87 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## 100 నగరాలకు బీపీసీఎల్

# 10 కేజీల ఎల్‌పీజీ సిలిండర్లు

ప్రభుత్వరంగ చమురు సంస్థ భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ తన 10 కేజీల ఎల్‌పీజీ సిలిండర్ల సేవలను మరిన్ని నగరాలకు విస్తరించనుంది. ఆగస్టు 15 నాటికి 24 రాష్ట్రాల్లోని 100 నగరాల్లో ఈ సిలిండర్లను అందుబాటులో తేనుంది. తొలి త్రైమాసిక ఫలితాల అనంతరం నిర్వహించిన ఎర్నింగ్స్ కాన్ఫరెన్స్‌లో సంస్థ ఈ విషయాన్ని వెల్లడించింది. ఎల్‌పీజీ కనెక్షన్‌ను తక్షణమే అందించడంతో పాటు గ్యాస్ సిలిండర్‌ను త్వరితగతిన డెలివరీ చేసే విధంగా భారత్ గ్యాస్ ఇటీవల 'లైట్ జిప్' పేరిట ప్రీమియం ఎల్‌పీజీ సర్వీసును ప్రారంభించింది. తక్కువ బరువు కలిగి, తుప్పుపట్టకుండా ఉండేలా ఈ సిలిండర్లను రూపొందించారు. ఈ సిలిండర్లను తరలించడం కూడా సులువు. మరో ప్రభుత్వరంగ సంస్థ హెచ్‌పీసీఎల్ ఇటీవల 'నవ్య'



పేరిట 10 కేజీ సిలిండర్ సేవలను లాంచ్ చేసింది. ఈ నేపథ్యంలో బీపీసీఎల్ కూడా ఎక్స్‌ప్రెస్ డెలివరీ సేవలకు శ్రీకారం చుట్టింది. ఆగస్టు 15 నాటికి 100 నగరాలకు విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. మరోవైపు, బీపీసీఎల్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2026-27) ఏప్రిల్- జూన్ త్రైమాసికంలో రూ.3,962.13 కోట్ల నికర నష్టాన్ని చవిచూసింది. గత 15 త్రైమాసికాల్లో కంపెనీకి ఇదే తొలి నష్టం. 2025-26 ఇదే త్రైమాసికంలో కంపెనీ రూ.6,123.93 కోట్ల నికరలాభం ఆర్జించింది. పశ్చిమాసియా సంక్షోభం కారణంగా ముడిచమురు ధర 50% వరకు పెరిగినా.. దేశీయంగా పెట్రోల్, డీజిల్, ఎల్‌పీజీ రిటెయిల్ ధరలను ఆ స్థాయిలో పెంచకపోవడమే ఈసారి నష్టాలకు కారణమని కంపెనీ తెలిపింది. సమీక్షిస్తున్న త్రైమాసికంలో గృహ వినియోగ వంటగ్యాస్ సిలిండర్ల విక్రయాలపైనే కంపెనీకి రూ.3,485.22 కోట్ల నష్టం వాటిల్లింది.

# అమెజాన్, ఉబర్‌లో లేఆఫ్‌లు





ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కారణంగా టెక్నాలజీ కంపెనీల్లో ఉద్యోగుల తొలగింపు కొనసాగుతూనే ఉంది. తాజాగా అమెరికాకు చెందిన ప్రముఖ కంపెనీలైన అమెజాన్, ఉబర్ ఉద్యోగులకు లేఆఫ్‌లు ప్రకటించాయి. ఉబర్‌లో 10 శాతం మందిని తొలగిస్తున్నట్లు కంపెనీ పేర్కొనగా.. ఎంతమందిని తొలగిస్తున్నదీ అమెజాన్ వెల్లడించలేదు. అమెజాన్ కొన్ని నెలల క్రితమే వివిధ విభాగాల్లో సుమారు 16 వేల మంది ఉద్యోగులను తొలగించింది. ఈ సారి ఆర్టిఫిషియల్ జనరల్ ఇంటెలిజెన్స్ విభాగంలో లేఆఫ్‌లు ప్రకటించింది. తర్వాతి తరం ఏఐ సిస్టమ్స్‌ను డెవలప్ చేయడం ఈ విభాగం బాధ్యత. వనరులను సమర్థంగా వినియోగించుకోవడం, వినియోగదారులకు మంచి విలువను అందించడంలో భాగంగా ఈ లేఆఫ్‌లు చేపడుతున్నట్లు అమెజాన్ పేర్కొంది. ఏఐ మోడళ్లపై పెద్దమొత్తంలో నిధులు గుమ్మరిస్తున్న వేళ అమెజాన్ ఈ ప్రకటన చేయడం గమనార్హం. మరోవైపు ప్రముఖ రైడ్-హెయిలింగ్ సంస్థ ఉబర్ టెక్నాలజీస్.. తన కస్టమర్ సర్వీస్ విభాగంలో 10 శాతం ఉద్యోగులను తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. ఈ సేవల్లో ప్రక్రియను సులభతరం చేయడం, సామర్థ్యాన్ని పెంచడమే లక్ష్యంగా ఈ లేఆఫ్‌లు చేపడుతున్నట్లు పేర్కొంది. తొలగించిన ఉద్యోగుల స్థానంలో కస్టమర్లతో ఏఐ సంప్రదింపులు జరపనుంది. ఒకప్పుడు కస్టమర్ సర్వీస్ విభాగం పూర్తిగా మనుషులతో నడిచేది. జనరేటివ్ ఏఐ అందుబాటులోకి వచ్చాక ఈ విభాగంలో ఉద్యోగాలు చాలా వరకు ఏఐతో భర్తీ అయ్యాయి.



## నేడు మారుతీ సుజుకి బ్రెజ్జా ఫేస్‌లిఫ్ట్ విడుదల

మారుతీ సుజుకి కి చెందిన బ్రెజ్జా ఫేస్‌లిఫ్ట్ కారును కంపెనీ నేడు విడుదల చేయనున్నది. దీనిలో అనేక అధునాతన ఫీచర్లు ఉన్నాయని కంపెనీ వెల్లడించింది. కారు అభిమానులు ఎదురుచూస్తున్న కాంపాక్ట్ ఎస్‌యూవీల్లో బ్రెజ్జా ఒకటి. ఇప్పటికే ఈ కారు కోసం బుకింగ్‌లు ప్రారంభమయ్యాయి. ఈ కారుకు సంబంధించిన ఫొటోలను చూస్తే డిజైన్ ఇదివరకటి బ్రెజ్జాలాగే కనిపిస్తుంది. కానీ ముందు భాగంలో కొన్ని మార్పులు చేశారు. దీనికి కొత్తగా గ్రిల్‌ను ఏర్పాటు చేసి, బంపర్‌ను మార్చారు. హెడ్‌లైట్, డీఆర్‌ఎల్ లో స్వల్ప మార్పులు చేశారు. అలాయ్ వీల్ కొత్తగా వచ్చే అవకాశం ఉంది.

## ఇన్ఫోసిస్ తదుపరి సీఈఓగా ఆశిష్ కుమార్ దాస్



ఈయూ విధించిన జరిమానాపై గూగుల్ స్పందించింది. నియంత్రణ అనేది ఉత్పత్తులను మెరుగుపరచాలి గానీ, వాటిని మరింత దిగజార్చకూడదని పేర్కొంది. నిబంధనల్లో భాగంగా యూరోపియన్లు ఇష్టపడే హోటల్స్, విమానాలు, రెస్టారెంట్స్ వివరాలను కూడా రియల్ టైం సెర్చ్ నుంచి తొలగిస్తున్నామని తెలిపారు. రెండు దశాబ్దాల్లో యూరోపియన్ యూనియన్ గూగుల్‌పై 10.38 బిలియన్ యూరోలకు పైగా జరిమానాలు విధించడం గమనార్హం.

## మెర్సిడెస్ బెంజ్ కొత్త కారు లాంచ్..



ప్రముఖ లగ్జరీ కార్ల తయారీ సంస్థ మెర్సిడెస్ బెంజ్ భారతదేశంలో ఏఎంజీ ఈ 53 ప్లగ్-ఇన్ హైబ్రిడ్ పెర్ఫార్మెన్స్ సెడాన్‌ను లాంచ్ చేసింది. ఇది పెర్ఫార్మెన్స్, రేసింగ్ అనే రెండు ఎడిషన్లలో లభిస్తుంది. వీటి ధరలు వరుసగా రూ. 1.45 కోట్లు, రూ. 1.48 కోట్లు (ఎక్స్-షోరూమ్). కొత్త AMG E 53 హైబ్రిడ్ కారు అప్‌డేటెడ్ ఈ-క్లాస్ ఆధారంగా నిర్మితమైంది. కాబట్టి ఇందులో ప్రత్యేకమైన బంపర్లు, ప్రకాశవంతమైన గ్రిల్, వెడల్పాటి ఫెండర్లు, డిఫ్యూజర్, లిప్ స్పాయిలర్ వంటివి ఉన్నాయి. ఈ కారులో అడాప్టివ్ సస్పెన్షన్, రియర్ యాక్సిల్ స్టీరింగ్, 20-అంగుళాల అల్లాయ్ వీల్స్, పెద్ద బ్రేకులు, క్వాడ్ ఎగ్జాస్ట్ టిప్స్ కూడా ఉన్నాయి. లోపలి భాగంలో.. ఈ53 కి 3 స్పోక్ స్టీరింగ్ వీల్‌తో కూడిన మెర్సిడెస్ MBUX సూపర్‌స్క్రీన్, ఏఎంజీ స్పోర్ట్స్ సీట్లు, డాల్బీ అట్మోస్‌తో కూడిన 17 స్పీకర్ బర్మెస్టర్ సౌండ్ సిస్టమ్ లభిస్తాయి. ఈ కారు పోలార్ వైట్, వెర్దె సిల్వర్, అబ్సిడియన్ బ్లాక్, నాటికల్ బ్లూ, వెల్వెట్ బ్రౌన్, గ్రాఫైట్ గ్రే మెటాలిక్ అనే మలుపులు కలర్ ఎంపికలలో లభిస్తుంది. కొత్త మెర్సిడెస్-AMG E 53 హైబ్రిడ్ 4Matic+ 3.0-లీటర్ టర్బోచార్జ్డ్ 6-సిలిండర్ ఇంజిన్‌తో పనిచేస్తుంది. దీనికి ఒక ఎలక్ట్రిక్ మోటార్ లభిస్తుంది. కాబట్టి ఇది 577 Bhp పవర్, 750 న్యూటన్ మీటర్ టార్క్ అందిస్తుంది. ఇంజిన్ 9 స్పీడ్ ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్‌తో వస్తుంది.

# మోడీ నివాసం ముందు ధర్నా సిగ్గుచేటు



**అల్వాల్, జూలై 23(నినాదం):** ఢిల్లీలో జరిగిన లాఠీచార్జి నిరసనగా కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నివాసమును ముందు విద్యార్థులు కాకుండా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, సంఘవిద్రోహ శక్తులుముట్టడించే ప్రయత్నం చేసిన సందర్భంగా నిరసనగా అల్వాల్ బిజెపి శ్రేణులు ఈసేవవద్ద ఆందోళన నిర్వహించారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం చర్చలకు సిద్ధంగా ఉందని దానిని పట్టించుకోకుండా విధ్వంసానికి పాల్పడుతున్నారని నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా గోరింటాకు వేడుకలు



**సిద్ధిపేట బ్యూరో , జూలై 23( నినాదం):** జిల్లా కేంద్రంలోని భారత్ నగర్ లో గల వివేకానంద విద్యాలయంలో గురువారం రోజున ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని విద్యార్థినులకు గోరింటాకు వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలను నేటి తరానికి పరిచయం చేయడంలో భాగంగా పాఠశాల యాజమాన్యం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ.. ఆషాఢ మాసంలో గోరింటాకు పెట్టుకోవడం వెనుక ఉన్న సాంప్రదాయ, ఆరోగ్యకరమైన ప్రాముఖ్యతను వివరించారు. వర్షాకాలంలో వచ్చే పలు రకాల చర్మ వ్యాధులు, ఇన్ఫెక్షన్ల నుండి గోరింటాకు శరీరానికి రక్షణ కల్పిస్తుందని సైంటిఫిక్ రీజన్ తెలిపారు. పూర్వీకులు అందించిన ఆచారాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ లిఖిత, ఉపాధ్యాయులు రత్నమాల, భాగ్యమ్మ, దివ్యవాణి,ఫిర్దోజ్, రింశ,మానుష, అరుణ, భారతి పాల్గొన్నారు.

# సర్ ప్రచార వాహనాన్ని ప్రారంభం



**నాచారం, జూలై 23 (నినాదం) :** నాచారం డివిజన్ బొడ్రాయి వద్ద ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ వరలక్ష్మి మరియు ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి సర్ అవగాహన ప్రచార వాహనాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని టిపిసిసి లేబర్ సెల్ వైస్ ప్రెసిడెంట్ వి.ఎస్. ప్రకాష్ రెడ్డి నిర్వహించారు. అనంతరం పరమేశ్వర్ రెడ్డి నాచారం మరియు హెచ్ఎంటీ డివిజన్ పరిధిలో కాంగ్రెస్ పార్టీ సభ్యులు ఏర్పాటు చేసిన వివిధ సర్ క్యాంపులను సందర్శించి, ప్రజలకు సర్ ప్రక్రియ యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి అర్హులైన ఓటరు తమ వివరాలను సరిచూసుకుని, అవసరమైన ఫారాలను పూర్తి చేసి సమర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జి. కృష్ణారెడ్డి, హెచ్.ఆర్. మోహన్, రమేష్ గౌడ్, రామ్ రెడ్డి, నాచారం డివిజన్ అధ్యక్షులు రాజు, శ్రీకాంత్ గౌడ్, హెచ్ఎంటీ డివిజన్ అధ్యక్షులు మహేష్ గౌడ్, అశ్వత్థామ రెడ్డి, ఎం. రాజిరెడ్డి, షరీఫుద్దీన్, నర్సింగ్ రావు, రఘు, అజీమ్, ఫిరోజ్, సంతోష్ రెడ్డి, ఖయ్యాం, షాహిద్, రవి యాదవ్, కృష్ణ యాదవ్, శ్రీనివాస్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, జి. రాకేష్, నిఖిల్ సాయి, శ్రీధర్, బాలరాజ్ తదితర కాంగ్రెస్ నాయకులు, అలాగే మహిళా కాంగ్రెస్ నాయకులు ఉమ, భాతమ్మ, భూలక్ష్మి, భావనా గౌడ్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో జనసేన పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

### రాష్ట్ర నాయకులు కమ్మరి శ్రీను



**దుబ్బాక జూలై 23( నినాదం):** తెలంగాణ రాష్ట్రంలో జనసేన పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త, నాయకుడు కృషి చేయాలని జనసేన పార్టీ రాష్ట్ర నాయకులు కమ్మరి శ్రీను పిలుపునిచ్చారు. సిద్ధిపేట జిల్లా దుబ్బాక పట్టణ కేంద్రంలో జనసేన పార్టీ దుబ్బాక నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం దుబ్బాక జనసేన పార్టీ నాయకులు మరోజు లక్ష్మణ్ చారి ఆధ్వర్యంలో పలువురికి జనసేన పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కమ్మరి శ్రీను మాట్లాడుతూ, తెలంగాణ జనసేన పార్టీ ఆదేశాల మేరకు పార్లమెంటరీ నియోజకవర్గ స్థాయిలో సమావేశాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గజ్వేల్ పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలో సమావేశాల నిర్వహణకు రూట్ మ్యాప్ రూపొందించి, వాటిని విజయవంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. తెలంగాణలో జనసేన పార్టీ లేదని విమర్శించే వారికి దుబ్బాకలో జరుగుతున్న భారీ చేరికలే సమాధానమని అన్నారు. "తెలంగాణ ఎవరి జాగీరు?" అనే రాజకీయ విమర్శలకు బదులుగా, "ప్రజల కోసం ఎవరు ఏమి చేశారు, భవిష్యత్తులో ఏమి చేయబోతున్నారు" అనే అంశాలపై చర్చ జరగాలని సూచించారు. గత 50 సంవత్సరాల కాంగ్రెస్ పాలన, 10 సంవత్సరాల బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుతం కొనసాగుతున్న కాంగ్రెస్ పాలనలోనూ రాష్ట్రానికి ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదని ఆయన విమర్శించారు. తెలంగాణ ప్రజలు జనసేన పార్టీకి అవకాశం కల్పిస్తే రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తామని హామీ ఇచ్చారు. రానున్న సమావేశాలను విజయవంతం చేయడానికి పార్టీ నాయకులు, కార్యకర్తలకు వివిధ బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. పార్టీ విస్తరణ, సభ్యత్వ నమోదు, ప్రజా సమస్యలపై పోరాటాల ద్వారా జనసేనను మరింత బలోపేతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## దేశంలో కల్లోలం సృష్టించేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రయత్నాలు చేస్తున్నది

### అంబటి బాలేష్ గౌడ్



**దుబ్బాక, జులై 23 (నినాదం):** విదేశీ శక్తులతో చేతులు కలిపి దేశంలో అల్లర్లు సృష్టించేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రయత్నిస్తోందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంబటి బాలేష్ గౌడ్ ఆరోపించారు. రాష్ట్ర బీజేపీ పిలుపు మేరకు, కాంగ్రెస్ ఎంపీలు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నివాసాన్ని ముట్టడించడాన్ని నిరసిస్తూ దుబ్బాకలో మున్సిపల్ అధ్యక్షుడు గొల్ల శ్రీకాంత్ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా అంబటి బాలేష్ గౌడ్ మాట్లాడుతూ, పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న సమయంలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న రాహుల్ గాంధీ సభలో చర్చల్లో పాల్గొనకుండా ప్రధానమంత్రి నివాసాన్ని ముట్టడించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రపంచవ్యాప్తంగా భారతదేశ ప్రతిష్ఠ పెరుగుతున్న తరుణంలో, దేశ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా కొందరు దేశ వ్యతిరేక శక్తులతో కలిసి కాంగ్రెస్ పార్టీ దేశంలో అల్లర్లు సృష్టించే ప్రయత్నం చేస్తోందని ఆయన ఆరోపించారు. ఢిల్లీలో జరుగుతున్న నిరసనలపై ప్రతి పౌరుడు ఆలోచించాలని ఆయన కోరారు. పేపర్ లీక్ వంటి ఘటనలపై నిష్పక్షపాత విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. అయితే ఏ నిరసన అయినా శాంతియుతంగా, చట్టబద్ధంగా జరగాలని, హింస, ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం, భద్రతా సిబ్బందిపై దాడులు లేదా ప్రజల్లో ఉద్రిక్తతలు పెంచే చర్యలను ప్రభుత్వం సహించదని హెచ్చరించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు కిష్టంగారి సుభాష్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో విభేదాలను వ్యక్తం చేయడానికి ఎన్నికలు, చట్టబద్ధ నిరసనలు, న్యాయపరమైన ప్రక్రియలు వంటి రాజ్యాంగబద్ధ మార్గాలు ఉన్నాయని అన్నారు. దేశ ప్రతిష్ఠ, సామాజిక శాంతి, ప్రజల ఐక్యతకు భంగం కలిగించేచర్యలనుఏపరిస్థితుల్లోనూసమర్థించకూడదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు సుంకోజు ప్రవీణ్, అంబటి శివప్రసాద్, గాజుల భాస్కర్, పోగుల భూపాల్, గవ్వల రమేష్, రమేష్ రెడ్డి, రమణారెడ్డి, పెంటం కిషన్, నేహాల్ గౌడ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# విచ్చలవిడిగా అక్రమ బహుళ అంతస్తుల నిర్మాణాలు

- ఫిర్యాదులు వచ్చినా స్పందించని యంత్రాంగం
- జిల్లా అధికారులు జోక్యం చేసుకుని విచారణ జరపాలని స్థానికుల విజ్ఞప్తి







**పటాన్చెరు, జులై 23(నినాదం) :** ఇంద్రేశం మున్సిపల్ పరిధిలో అక్రమ బహుళ అంతస్తుల నిర్మాణాలు రోజురోజుకూ పెరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు కొనసాగుతున్నప్పటికీ మున్సిపల్ అధికారులు వాటిని అడ్డుకోవడంలో పూర్తిగా విఫలమవుతున్నారని ఆరోపిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే అక్రమ నిర్మాణాలు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ అక్రమ నిర్మాణాలపై ఇప్పటికే పలు పత్రికల్లో వార్తలు ప్రచురితమైనప్పటికీ, స్థానికులు ఎన్నోసార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదులు సమర్పించినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చట్టాన్ని ఉల్లంఘిస్తూ నిర్మాణాలు సాగుతున్నా అధికారులు మౌనంగా ఉండటంపై ప్రజల్లో తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అక్రమ నిర్మాణాలను పట్టించుకోకుండా అధికారులు పెద్ద మొత్తంలో అక్రమ ప్రయోజనాలు పొందుతున్నారనే ప్రచారం ప్రజల్లో సాగుతోందని స్థానికులు చెబుతున్నారు. ఈ ఆరోపణలపై సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెలికితీయాలని, అక్రమ నిర్మాణాలకు బాధ్యులైన వారిపై అలాగే విధుల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులను స్థానికులు కోరుతున్నారు. అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేసి చట్టపాలనను కాపాడాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఎస్ఐఆర్‌లో పాల్గొనండి.. పటాన్చెరు అభివృద్ధిలో భాగస్వాములు కండి

**ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు అమూల్యమైనది**

**పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

**ఎస్ఐఆర్ అవగాహన కోసం 30 ప్రచార రథాలను ప్రారంభించిన ఎమ్మెల్యే జిఎంఆర్**





**పటాన్చెరు, జూలై 23 (నినాదం):** ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రతి ఓటు ప్రాణాధారమని, ఓటు హక్కును పరిరక్షించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి పేర్కొన్నారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పటాన్చెరు నియోజక వర్గంలో అభివృద్ధి నిరంతరం కొనసాగాలంటే అర్హులైన ప్రతి ఓటరు ఎస్ఐఆర్ ప్రక్రియలో తప్పనిసరిగా పాల్గొని, ఆగస్టు 3వ తేదీ లోపు తమ దరఖాస్తులను పూర్తి వివరాలతో సమర్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. గురువారం పటాన్చెరు డివిజన్‌లోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్ఐఆర్‌పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 30 ప్రచార రథాలను ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రజల భాగస్వామ్యంతోనే ఒక ప్రాంతం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని, ఆ భాగస్వామ్యానికి తొలి మెట్టు ఓటు హక్కేనని స్పష్టం చేశారు. పటాన్చెరులో శాశ్వతంగా నివసిస్తున్న ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును కాపాడుకునేందుకు ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో పూర్తి చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ ప్రక్రియలో పాల్గొనని వారు తమ విలువైన ఓటు హక్కును కోల్పోయే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రజాస్వామ్య బలోపేతానికి, పటాన్చెరు అభివృద్ధి ప్రస్థానంలో భాగస్వాములు కావాలంటే ప్రతి ఓటరు బాధ్యతగా ఎస్ఐఆర్‌లో పాల్గొనాలని కోరారు. నియోజకవర్గ పరిధిలోని తొమ్మిది డివిజన్లు, మూడు మున్సిపాలిటీలు, రెండు మండలాల్లోని ప్రతి వార్డు వరకు ఈ ప్రచార రథాలు చేరుకుని ప్రజలకు ఎస్ఐఆర్‌పై అవగాహన కల్పిస్తాయని తెలిపారు. అలాగే ప్రార్థనా స్థలాలు, క్రీడా ప్రాంగణాలు, విద్యా సంస్థలు, పార్కులు, మార్కెట్లు, పారిశ్రామిక ప్రాంతాలు తదితర ప్రజా ప్రదేశాల్లో వివిధ ప్రచార మాధ్యమాల ద్వారా ఎస్ఐఆర్ ప్రాముఖ్యతను విస్తృతంగా తెలియజేస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రుల సేవలను వినియోగించుకోవాలి

### జిల్లా వైద్యాధికారి డాక్టర్ ధనరాజ్



**మిరుదొడ్డి , జూలై 23(నినాదం):** అంటు వ్యాధులు, కీటక జనిత వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి ధనరాజ్ ఆదేశించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన గురువారం రోజున ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రి రికార్డులను పరిశీలించారు. ఆసుపత్రిలో మందుల నిల్వ, రోగులకు అందుతున్న సేవలను ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో అధికంగా వ్యాప్తి చెందు డెంగ్యూ, విరేచనాల విషయంలో ప్రజలను అప్రమత్తం చెయ్యాలని, వ్యక్తి గత పరిశుభ్రత, పరిసరాల పారిశుధ్యం అవశ్యకతపై అవగాహన పెంచాలని సూచించారు. జ్వరం కేసులకు అవసరమైన పరీక్షలు నిర్వహించాలని, టిడి హబ్ కు రక్త నమూనాలను పంపాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధుల వ్యాప్తి నిరోధానికి పంచాయితీ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శితో పాటు గ్రామస్థాయి అధికారుల సహకారం తీసుకోవాలని చెప్పారు. ఇంటింటికి జ్వరం సర్వేను పకడ్బందీగా నిర్వహించడానికి ఆశ వర్కర్ లను ప్రోత్సహించాలని సూచించారు. జ్వరము కేసులకు రాపిడ్ పరీక్షలు చేసి మందులు అందించాలని, జ్వరం తగ్గే వరకు ఫాలో అప్ చేయాలన్నారు. వర్షాలతో ఈగలు, దోమల వ్యాప్తి పెరుగుతుందని, దీనితో ప్రజలు రోగాల బారిన పడతారని చెప్పారు. దోమల వ్యాప్తిని లార్వా దశలోనే అరికట్టాలన్నారు. దోమల నియంత్రణకు పంచాయతీ సిబ్బంది సహకారంతో మురుగు నీటి నిల్వలు, నీటి గుంతల నిర్మూలనకు చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం ఆసుపత్రిలో ల్యాబ్, ఫార్మసీ రికార్డులను పరిశీలించి, చికిత్సలు పొందుతున్న రోగులతో మాట్లాడారు. ప్రభుత్వ ఆసుపత్రుల సేవలను వినియోగించుకోవాలని, ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి డబ్బులు వృధా చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఆయుష్ డాక్టర్, ఎమ్ ఎల్ ఎచ్ పి మౌనిక, ఫార్మసీ శ్రీనివాస్, టెక్నిషియన్ రవీందర్, ఎస్ ఎన్ కవిత, సిబ్బంది ఉన్నారు.

# పేద కుటుంబానికి అండగా ఉప్పల వెంకటేష్ చారిటబుల్ ట్రస్ట్



**ఆమనగల్లు, జూలై 23(నినాదం):** ఆమనగల్లు మున్సిపాలిటీ 12వ వార్డులో నిరుపేద కుటుంబానికి ఉప్పల వెంకటేష్ చారిటబుల్ ట్రస్ట్ అండగా నిలిచింది. పసుపులేటి లక్ష్మమ్మ, వెంకటేష్ దంపతుల ఇంటి నిర్మాణంలో భాగంగా, మాజీ మిషన్ భగీరథ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ తన ట్రస్ట్ ద్వారా స్లాబ్ నిర్మాణానికి అవసరమైన స్టీల్, సిమెంట్ సామగ్రిని 12వ వార్డు కౌన్సిలర్ నాగిళ్ల జగన్ ద్వారా అందజేశారు.. తమ కష్ట సమయంలో సాయం అందించిన ఉప్పల వెంకటేష్‌కు లక్ష్మమ్మ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# సబ్‌స్టేషన్ నిర్మాణాన్ని వెంటనే నిలిపివేయాలి

- భావన ఋషి సొసైటీ అధ్యక్షుడు సీత ఆంజనేయులు
- హైకోర్టు స్టేటస్ కో ఆదేశాలను పట్టించుకోకుండా పనులు చేపట్టడంపై ఆందోళన



**దమ్మాయిగూడ, జూలై 23 ( నినాదం):** దమ్మాయిగూడ భావన ఋషి కోపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ కి చెందిన సర్వేనెంబర్ 158 లోని స్థలంలో సబ్ స్టేషన్ నిర్మాణాన్ని వెంటనే నిలిపివేయాలని భావన ఋషి సొసైటీ అధ్యక్షుడు సితాంజనేయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కాప్రా సర్కిల్ పరిధి దమ్మాయిగూడ భావన ఋషి కో-ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీకి చెందిన సర్వే నంబర్ 158లోని 2.10 గుంటల స్థలానికి సంబంధించి 2001 నుంచి వివిధ కోర్టుల్లో సాయిబాబా వెల్ఫేర్ అసోసియేషన్, రెవెన్యూ శాఖల మధ్య న్యాయ వివాదాలు కొనసాగుతున్నాయని సొసైటీ అధ్యక్షుడు సీత ఆంజనేయులు తెలిపారు. 2009లో జీహెచ్ఎంసీ లేఅవుట్ ఆమోదం ఇచ్చిన మేరకు ఆ స్థలం సొసైటీ ఆధీనంలో ఉందని ఆయన పేర్కొన్నారు. అయితే రెండేళ్ల క్రితం అప్పటి తహసీల్దార్ సొసైటీ స్థలాన్ని స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించారని, సొసైటీ నుంచి ఎలాంటి అక్రమ డబ్బులు ఇవ్వకపోవడంతో తమకు వ్యతిరేకంగా చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఇందులో భాగంగా సర్వే నంబర్ 710గా బోర్డు ఏర్పాటు చేయించారని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై జాయింట్ కలెక్టర్ జారీ చేసిన జు2/1774/2025 ఉత్తర్వులను సవాలు చేస్తూ హైకోర్టులో దాఖలు చేసిన డబ్ల్యూ.పీ. నెం. 2225/2026లో 2026 జనవరి 27న స్టేటస్ కో ఆదేశాలు పొందామని తెలిపారు. ఆ ఆదేశాల ప్రకారం సర్వే నంబర్ 158 సర్వేనెంబర్ 710/1లకు సంబంధించిన స్థలంలో ఎలాంటి పనులు చేపట్టకూడదని చెప్పారు. అయితే తహసీల్దార్ సూచనల మేరకు విద్యుత్ శాఖ అధికారులు నిన్న, ఈరోజు జేసీబీలతో భూమి తవ్వించి విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు ప్రారంభించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. 25 ఏళ్లుగా కోర్టు వివాదంలో ఉన్న స్థలంలో, అంతేకాక ఇళ్ల మధ్యలో సబ్‌స్టేషన్ నిర్మించడం ప్రజల భద్రతకు ముప్పుగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. హైకోర్టు స్టేటస్ కో ఆదేశాలను గౌరవిస్తూ సబ్‌స్టేషన్ నిర్మాణానికి ఇచ్చిన కేటాయింపును వెంటనే రద్దు చేసి, చేపడుతున్న పనులను నిలిపివేయాలని భావన ఋషి కో-ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ అధ్యక్షుడు సీత ఆంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే కోర్టు తీర్పు వెలువడే వరకు వివాదాస్పద స్థలంలో ఎలాంటి నిర్మాణ కార్యకలాపాలు చేపట్టవద్దని సంబంధిత అధికారులను కోరారు.

## పాఠశాలను సందర్శించి సమస్యల పరిష్కారానికి చైర్మన్ హామీ



**ఆమనగల్లు, జూలై 23(నినాదం):** ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని కమల నగర్ ప్రభుత్వ పాఠశాలను మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ పర్యటనలో మున్సిపల్ కమిషనర్ రాఘవేందర్ రెడ్డి, కౌన్సిలర్ అనూష శ్రీశైలం పాల్గొన్నారు. పాఠశాల ప్రాంగణాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన చైర్మన్, విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, మౌలిక వసతుల లోపాలపై ఉపాధ్యాయులతో చర్చించారు. పాఠశాల అభివృద్ధికి నిధులు మంజూరు చేసి, తక్షణమే సమస్యలను పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ఆంజనేయులు, కౌన్సిలర్ మహేష్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.


# అంతర్జాతీయ స్థాయిలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లును అగ్రగామిగా నిలబెడతాం

- క్లబ్ అధ్యక్షుడు లయన్ ఎంగలి బాలకృష్ణ




**ఆమనగల్లు, జూలై 23(నినాదం):** నాలుగు దశాబ్దాలుగా సమాజ సేవలో విశిష్ట సేవలందిస్తున్న లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లును జిల్లా స్థాయిలోనే కాకుండా అంతర్జాతీయ స్థాయిలో అగ్రగామిగా నిలబెట్టేందుకు కృషి చేస్తామని క్లబ్ అధ్యక్షుడు లయన్ ఎంగలి బాలకృష్ణ అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని లయన్స్ క్లబ్ భవనంలో నిర్వహించిన క్లబ్ సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, లయన్స్ క్లబ్ సేవలను మరింత విస్తృతం చేయడమే తమ లక్ష్యమని, సమాజంలోని నిరుపేదలు, అవసరమైన వారికి నాణ్యమైన సేవలు అందించడం క్లబ్ ప్రధాన ధ్యేయమని పేర్కొన్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా పాస్ట్ మల్టిపుల్ కౌన్సిల్ చైర్మన్ లయన్ సందడి నరేందర్ రెడ్డి, మాజీ జిల్లా గవర్నర్ లయన్ జి. చెన్నకేశవ రెడ్డి, లయన్ ఐ హాస్పిటల్ చైర్మన్ డా. వి. దామోదర్ రెడ్డి హాజరై క్లబ్ చేపట్టనున్న సేవా కార్యక్రమాలను అభినందిస్తూ సభ్యులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా లయన్ ఎంగలి బాలకృష్ణ మాట్లాడుతూ, క్లబ్ సభ్యుల సహకారంతో నియోజకవర్గ స్థాయిలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరాలు, ఆరోగ్య శిబిరాలు నిర్వహించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తామని తెలిపారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీటి సౌకర్యం కోసం వాటర్ ట్యాంకుల ఏర్పాటు, విద్యార్థులకు పోటీ పరీక్షలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి ప్రోత్సాహక బహుమతులు అందజేయడం, అవసరమైన ప్రాంతాల్లో బస్ షెల్టర్ల ఏర్పాటు వంటి ప్రజోపయోగ కార్యక్రమాలను చేపడతామని వెల్లడించారు. అంతేకాకుండా విద్య, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ, యువత ప్రోత్సాహం, సామాజిక సేవ రంగాల్లో వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తూ లయన్స్ క్లబ్ సేవలను మరింత విస్తృత స్థాయికి తీసుకెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి లయన్ గంగుల శ్రీనివాస్ రెడ్డి, కోశాధికారి లయన్ జి. శ్రీనివాస్ గుప్తా, జిల్లా చైర్మన్ లయన్ జూలూరి రమేష్, జే. లింగయ్య, ఎం. చంద్రశేఖర్, కంటే ఓంకారం, కే. రామిరెడ్డి, క్లబ్ పీఆర్వో పాషా, సభ్యులు గోవర్ధన్ రెడ్డి, డా. వి. వెంకట్ రెడ్డి, కృష్ణమూర్తి, క్లబ్ సమన్వయకర్త వీరబొమ్మ భిక్షపతి, చేగురి వెంకటేష్, రాజేందర్ యాదవ్, వినోద్, పిప్పళ్ల వెంకటేష్, జల్కం రమేష్, మల్లేష్, జిల్లా చైర్మన్ ఎం. అంజయ్య, సునంద, గుజ్జరి నరసింహ, పురుషోత్తం రెడ్డి, చుక్క అల్లాజీ గౌడ్, రాజేందర్ పాల్గొన్నారు.

## తీజ్ పండుగకు ఎమ్మెల్యేకు ఆహ్వానం



**ఆమనగల్లు, జూలై 23(నినాదం):** కడ్తాల్ మండలం, బోయినిగుట్ట తండా సరికొండ గ్రామపంచాయతీ నుండి సర్పంచి అద్దాల మహేందర్ ఆధ్వర్యంలో బోయినిగుట్ట తండానాయకులు స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ నెల 26న జరగనున్న మొలకల పండుగ, తిజ్ పండుగ వేడుకలకు ఎమ్మెల్యేతో పాటు కడ్తాల్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులను ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బోయినిగుట్ట కాంగ్రెస్ పార్టీ నాయకులు, తాండా పెద్దలు, సరికొండ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ జడ్పీటీసీ, ఎంపీటీసీ అద్దాల రాములు, నేనావత్ చంద్రు, చినావత్ కిషన్, గోపాల్, నేనావత్ మోతిలాల్, నేనావత్ లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

- తెలంగాణ మున్సిపల్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జైపాల్ రెడ్డి డిమాండ్



**అల్వాల్, జూలై 23( నినాదం):** తెలంగాణ మున్సిపల్ స్టాఫ్. కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) అల్వాల్ మున్సిపల్ సర్కిల్ అధ్యక్షులు కౌసర్, ప్రధాన కార్యదర్శి డీ.ఎన్ శేఖర్ ఆధ్వర్యంలో మహాసభలలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వనంపల్లి జైపాల్ రెడ్డి రాష్ట్ర కోశాధికారిగా వి హరినాథ్ రావుఎన్నికైన సందర్భంగా గురువారం అల్వాల్ సర్కిల్ పరిధిలోని వారికి ఘనంగా శాలువాలు కప్పి పూలమాలలతో సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యల మీద నిరంతరం పోరాటాలు నిర్వహించాలని కనీస వేతనాలు 26వేల రూపాయలు చేసేంతవరకు రాష్ట్ర ప్రభుత్వం దిగివచ్చేంత వరకు పోరాటాలు కొనసాగించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 6 రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రకటించడం జరిగింది. జీవోలో మున్సిపల్ కార్మికులకు వేతనాలు ఒక్క రూపాయి కూడా పెరగలేదు. రాష్ట్ర ప్రభుత్వ ఇచ్చినటువంటి జీవోని అమలు చేస్తే మున్సిపల్ కార్మికులకు ఉన్నటువంటి వేతనాలు తగ్గుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు 26 వేల రూపాయలుపెంచాలనిరాష్ట్ర ముఖ్యమంత్రి దగ్గర ఉన్నటువంటి మున్సిపల్ శాఖ పరిధిలోకార్మికుల పక్షాన నిలబడి కార్మికులకు వేతనాలు పెంచాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షులు జి మహేందర్, మున్సిపల్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి ఐ శ్రీనివాస్, కోశాధికారి తిరుపతి, వెంకటేష్, నాగేష్, సాయిలు, పెరుమాల్ స్వామి పాల్గొన్నారు.

# ఎల్-నినో ప్రభావంపై సమన్వయంతో పనిచేయాలి

## మంత్రి పొన్నం ప్రభాకర్






**హుస్నాబాద్, జూలై 23(నినాదం):** హుస్నాబాద్ ఇంటిగ్రేటెడ్ ఆఫీసర్ కాంప్లెక్స్‌లో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన ఎల్-నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, ప్రత్యామ్నాయ కార్యాచరణపై సిద్దిపేట, కరీంనగర్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు, జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ హుస్నాబాద్ పీఠభూమి ప్రాంతం కావడంతో సాధారణ పరిస్థితుల్లోనే వర్షాల కొరత ఉంటుందని, ఈసారి ఎల్-నినో ప్రభావం నేపథ్యంలో అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని సూచించారు. శాస్త్రవేత్తల అంచనాల ప్రకారం వర్షాభావ పరిస్థితులు కొనసాగే అవకాశం ఉన్నందున తాగునీరు, సాగునీరు, పశుగ్రాసం, విద్యుత్ సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. రైతులు వరి సాగును తగ్గించి మొక్కజొన్న, కందులు, పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, ఆయిల్‌పామ్ వంటి తక్కువ నీటితో సాగయ్యే ఆరుతడి పంటలను సాగు చేసేలా వ్యవసాయ శాఖ విస్తృతంగా అవగాహన కల్పించాలని, నర్మెట్ట సమీపంలో ఆయిల పామ్ ఫ్యాక్టరీ ఉన్నందున ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించాలని, ఒక గ్రామంలో 100 నుంచి 200 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేస్తే రూ. 5 లక్షల ప్రోత్సాహకం అందిస్తామని తెలిపారు. వివిజీ రామ్‌జీ, తెలంగాణ జలసిరి పథకాల ద్వారా ఫామ్‌పొండ్లు, ఇంకుడు గుంతలు నిర్మించి నీటి సంరక్షణ చేపట్టాలని, ప్రతి ఇంటి వద్ద, ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ఇంకుడు గుంతలు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎల్ఎం డీ నుంచి నిరంతరాయంగా తాగునీటి సరఫరా, భూగర్భ జలాల వారపు సమీక్ష, విద్యుత్ పొదుపు, ప్లాస్టిక్ రహిత నియోజకవర్గం, పశుగ్రాస నిల్వలు, పాడిపశువుల యూనిట్ల పంపిణీ వంటి అంశాలపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. అలాగే హుస్నాబాద్ నియోజకవర్గంలో శాతవాహన విశ్వ విద్యాలయ ఇంజినీరింగ్ కళాశాల, 250 పడకల ఆసుపత్రి, పీజీ మెడికల్ కళాశాల, కరీంనగర్--హుస్నాబాద్ ఫోర్‌లేన్ రహదారి, అక్కన్నపేట-హుస్నాబాద్ రహదారి విస్తరణ, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, ఎల్లమ్మ చెరువు అభివృద్ధి, అర్బన్ ఫారెస్ట్ పార్క్, గౌరవెల్లి ప్రాజెక్టు వంటి అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సిద్దిపేట జిల్లా కలెక్టర్ కే. హైమావతి మాట్లాడుతూ రైతు వేదికల ద్వారా వరి సాగును తగ్గించి ఆరుతడి పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తూ కంటింజెన్సీ ప్రణాళికలను అమలు చేస్తున్నామని తెలిపారు. హనుమ కొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ పంట మార్పిడిని ప్రోత్సహిస్తూ తాగునీటి సరఫరాపై ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగిస్తున్నామని చెప్పారు. కరీంనగర్ జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగు, పంటల మార్పిడి, తాగునీటి నిర్వహణపై క్షేత్రస్థాయిలో కార్యాచరణ అమలు చేస్తున్నామని వివరించారు. సమావేశంలో వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్థక, రెవెన్యూ, మున్సిపల్, గ్రామీణాభివృద్ధి, ఇరిగేషన్, మిషన్ భగీరథ, గ్రౌండ్ వాటర్, పంచాయతీరాజ్, ప్రణాళిక, విద్యుత్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# విలాసాగర్‌లో భూభారతి రీసర్వే అవగాహన సదస్సు

### హాజరైన హుజూరాబాద్ ఆర్డీవో జల కుమారి





**జమ్మికుంట, జూలై 23 (నినాదం):** జమ్మికుంట మండలం విలాసాగర్ గ్రామంలో గురువారం స్థానిక సర్పంచ్ గరిగంటి శ్రీకాంత్ ఆధ్వర్యంలో భూభారతిపై రీ సర్వే అవగాహన సదస్సు గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హుజురాబాద్ ఆర్డీవో జల కుమారి జమ్మికుంట తహసిల్దార్ సుధాకర్ సహాయ సంచాలకులు కొలతల విభాగం కిషన్‌రావు హాజరయ్యారు. అధికారులు మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్వహించే భూముల రీ సర్వేతో దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారం అవుతాయని భూ సరిహద్దుల విషయంలో గొడవలు లేకుండా ఉంటాయని తెలిపారు. భూ రికార్డుల ప్రక్షాళనతో ప్రతి రైతుకు తమ భూమి హక్కుల పై స్పష్టత వస్తుందని పేర్కొన్నారు. రైతులు ఈ ప్రక్రియకు పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు. అనంతరం రైతులు లేవనెత్తిన పలు సమస్యలకు వారు సమాధానం అందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ శంకర్ రెవెన్యూ ఇన్స్పెక్టర్ సత్యనారా యణ ఏ ఈ ఏఈఓ జిపిఓ భాను ప్రసన్న చందర్ రాజు పంచాయతీ కార్యదర్శి విష్ణు గ్రామ సర్పంచ్ శ్రీకాంత్ ఉపసర్పంచ్ అరెల్లి దివ్య తోపాటు వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

**అధికారులను సన్మానించిన సర్పంచ్ శ్రీకాంత్**

భూభారతి రీసర్వే అవగాహన కార్యక్రమానికి విలాసాగర్ కు వచ్చిన హుజురాబాద్ ఆర్డీవో జల కుమారి జమ్మికుంట తహసిల్దార్ సుధాకర్ రావు తో పాటు ఇతర అధికారులను గ్రామ సర్పంచ్ గరి గంటి శ్రీకాంత్ తో పాటు పాలకవర్గం వారిని ఘనంగా సన్మానించారు. అనంతరం గ్రామంలో నెలకొన్న పలు సమస్యలపై అధికారులకు పాలక వర్గ సభ్యులు తెలిపారు. ఈ విషయంపై స్పందించిన అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారం చేపడతామని పేర్కొన్నారు.

### దూదేకుల కార్పోరేషన్ ఏర్పాటుకై

## ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు వినతి

### నూరు బాషా కార్పొరేషన్ ఏర్పాటుకై ప్రశ్నిస్తానని హామీ



**జమ్మికుంట, జూలై 23 (నినాదం)** ఇటీవల మన రాష్ట్ర ప్రభుత్వం వివిధ రకాల కుల కార్పొరేషన్లను ఏర్పాటు చేసిందని దీనిలో దూదేకుల నూర్ భాషా కుల కార్పొరేషన్ ఏర్పాటు చేయకుండా పక్కన పెట్టిందని దీనిని తక్షణమే కార్పొరేషన్ ఏర్పాటు చేసేలా ప్రభుత్వం పైన ఒత్తిడి తీసుకురావాలని దూదేకుల నూర్ భాషా జేఏసీ లీగల్ సెల్ ఇంచార్జ్ మహమ్మద్ అంకూస్ ఆధ్వర్యంలో గురువారం హైదరాబాదులో ఎమ్మెల్సీ మల్లన్న కార్యాలయం లో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ రానున్న వర్షాకాలపు శాసనసభ సమావేశాల్లో నూర్భాష కులస్తుల కార్పొరేషన్ ఏర్పాటుపై ప్రశ్నిస్తానని ఏర్పాటు చేసేంతవరకు వదిలి పెట్టనని ఈ సందర్భంగా మల్లన్న హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో నూర్భాష జేఏసీ జాయింట్ సెక్రెటరీ రంజాన్, ఎం ఆర్ పి ఎస్ సీనియర్ నాయకులు చంద్రమౌళి పాల్గొన్నారు.

## యంగ్ ఇండియా స్కూల్ నిర్మాణ పనులపై క్షేత్రస్థాయి పరిశీలన

### గడువులోగా నిర్మాణం పూర్తిచేయాలి: కలెక్టర్ సత్యప్రసాద్



**ధర్మపురి జూలై 23( నినాదం ):** నేరెళ్ల గ్రామంలో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ భవన నిర్మాణ పనులను నాణ్యతతో, వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. గురువారం నిర్మాణ పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల పురోగతి, భవనాల రూపకల్పన, తరగతి గదులు, వసతి గృహాలు, ఇతర మౌలిక సదుపాయాల ఏర్పాటుపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్దేశిత గడువులోగా పనులను పూర్తి చేయాలని, నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడొద్దని స్పష్టం చేశారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ద్వారా విద్యార్థులకు ఆధునిక విద్యతో పాటు అత్యుత్తమ వసతులు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని కలెక్టర్ తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రతి పనిని బాధ్యతతో చేపట్టాలని సూచించారు. తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం తదితర మౌలిక సదుపాయాలకు సంబంధించిన ప్రణాళికలను ప్లాన్ మ్యాప్ ద్వారా పరిశీలించిన కలెక్టర్, పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో ఆర్డీవో మధుసూదన్, జిల్లా విద్యాశాఖ అధికారి కె. రాము, తహసీల్దార్ శ్రీనివాస్, ఇంజినీరింగ్ శాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

### 'నీట్'పై కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ

## 'చాయ్ పే చర్చ'

### ధర్మేంద్ర రాజీనామా, ప్రధాని క్షమాపణలు కోరిన మేధావులు విద్యార్థులపై దమనకాండను ఖండించిన కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి



**కరీంనగర్, జులై 23(నినాదం):** నీట్ పరీక్ష ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతోందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి విమర్శించారు. విద్యార్థులపై లాఠీచార్జ్, టియర్ గ్యాస్ ప్రయోగించడం ప్రజాస్వామ్య విరుద్ధమని, దేశం, ధర్మం పేరుతో మాట్లాడే కేంద్ర ప్రభుత్వం ఈ ఘటనపై నైతిక బాధ్యత వహించాలని అన్నారు. ఈ నేపథ్యంలో కరీంనగర్ కలెక్టరేట్ రోడ్డులోని సిరి టీ హోటల్ వద్ద మేధావులు, న్యాయవాదులు, వైద్యులు, వయోవృద్ధులు, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులతో కలిసి 'చాయ్ పే చర్చ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ విధానాలపై చర్చించి, మేధావుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. నీట్ లీకేజీపై నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై బలప్రయోగం చేయడం, శాంతియుత నిరసన తెలిపిన ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతో పాటు కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. మేధావులు మాట్లాడుతూ, విద్యార్థులపై జరిగిన దమనకాండకు ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా బేషరతుగా క్షమాపణలు చెప్పాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యత వహిస్తూ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు కొరివి వేణుగోపాల్, పెంచాల లక్ష్మణ్‌రావు, వైద్యులు చాట్ల శ్రీధర్, వొద్దే రాంరెడ్డి, గుడిపాటి రమణారెడ్డి, పి. కిషన్‌రావు, ఎల్లారెడ్డి, బోయిని అశోక్, పలువురు మేధావులు, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు పాల్గొన్నారు.

# పార్కింగ్ ఫీజు.. మురుగు కష్టాలు

## దేవుడి దర్శనానికి వెళ్తే.. దోమలతో పోరాటం



**ధర్మపురి,జూలై 23 (నినాదం):** జగిత్యాల జిల్లా ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి నిత్యం వేలాది మంది భక్తులు తరలివస్తుంటారు. వారి వాహనాల కోసం మున్సిపాలిటీ ఏర్పాటు చేసిన పార్కింగ్‌లో కనీస పారిశుధ్య నిర్వహణ లేకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పార్కింగ్ కోసం కేటాయించిన స్థలం మురుగు నీటితో నిండిపోయి బురదమయంగా మారింది. రోజుల తరబడి నిల్వ ఉన్న మురుగు నీటిలో దోమలు విపరీతంగా పెరిగాయని భక్తులు చెబుతున్నారు. వాహనాలను నిలిపిన తర్వాత కార్ల డోర్లు తెరవగానే దోమలు గుంపులుగా లోపలికి దూసుకొస్తుండటంతో చిన్నారులు, మహిళలు, వృద్ధులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నా రని వాపోతున్నారు. పార్కింగ్ స్థలాన్ని వినియోగించలేని పరిస్థితి ఏర్పడడంతో పలువురు భక్తులు తమ వాహనాలను ఆలయానికి వెళ్లే ప్రధాన రహదారులపైనే నిలుపుతున్నారు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. పార్కింగ్ ఫీజు మాత్రం క్రమం తప్పకుండా వసూలు చేస్తున్నా, పార్కింగ్ స్థలాన్ని వినియోగానికి అనువుగా ఉంచడంలో మున్సిపాలిటీ విఫలమైందనే విమర్శలు వినిపిస్తున్నాయి. నిల్వ ఉన్న మురుగు నీటిలో దోమలు, ఇతర క్రిమికీటకాలు విస్తరిస్తుండటంతో దోమల ద్వారా వ్యాపించే వ్యాధులపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భక్తుల ఆరోగ్యంతో పాటు పట్టణ ప్రతిష్ఠకు సంబంధించిన ఈ సమస్యను అధికారులు ఇకనైనా సీరియస్‌గా తీసుకుని మురుగు నీటిని వెంటనే తొలగించి, పార్కింగ్ స్థలాన్ని పరిశుభ్రంగా మార్చడంతో పాటు దోమల నివారణ చర్యలు చేపట్టాలని భక్తులు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



# రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని ప్రత్యేక పూజలు

### హుస్నాబాద్‌లో పలు ఆలయాల్లో మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రార్థనలు



**హుస్నాబాద్, జూలై 23(నినాదం):** రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతాంగం సుభిక్షంగా ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలంతా ఆయురారోగ్యాలు, సుఖశాంతులతో జీవించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ హుస్నాబాద్ పట్టణంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారిని దర్శించు కుని రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం ప్రత్యేక పూజలు చేసిన మంత్రి, అనంతరం అయ్యప్ప ఆలయంలో 108 మంది ఋత్వికులు, 21 హోమగుండాలతో నిర్వహించిన శ్రీ వారాహి మూలమంత్ర హోమ మహా యజ్ఞంలో పాల్గొన్నారు. ఆ తర్వాత శ్రీకృష్ణ దేవాల యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, మరకత శివాలయంలో 108 కలశాలతో నిర్వహించిన వరుణ యాగంలో పాల్గొని రాష్ట్రంలో సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని, చెరువులు, కుంటలు, జలాశయాలు నిండిపోవాలని, రైతుల పంటలు సమృద్ధిగా పండాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాలు ఆలస్యమవుతున్న నేపథ్యంలో రైతాంగం ఆందోళన చెందుతోందని, అమ్మవారి అనుగ్రహంతో రాష్ట్రవ్యాప్తంగా సమృద్ధిగా వర్షాలు కురిసి వ్యవసాయం పుంజుకోవాలని, రైతులు ఆర్థి కంగా బలోపేతం కావాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్క రూ తమ కుటుంబ సభ్యుల సంక్షేమంతో పాటు లిలి" సర్వేజనా సుఖినో భవంతు"లిలి అనే భావనతో సమాజ శ్రేయస్సు కోసం కూడా ప్రార్థించాలని పిలుపుని చ్చారు. రైతు అభివృద్ధి చెందితేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడుతుందని, రైతు బాగుంటేనే వ్యాపారులు, కార్మికులు, చేతివృత్తులవారు సహా సమాజంలోని ప్రతి వర్గం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. వారాహి అమ్మవారి కృపాకటాక్షంతో రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో ఉం డాలని, ప్రతి ఇంట ఆనందం వెల్లివిరియాలని ఆకాం క్షిస్తూ ఈ మహాయజ్ఞాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న వేద పండితులు, నిర్వాహకులు, యజ్ఞ దంపతులను అభినందించారు. కార్యక్రమాల్లో హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మీ, వైస్ చైర్మన్ చిత్తారి పద్మ, మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, వేద పండితులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వరికి బదులు ఆరుతడి పంటలే మేలు

### ఆరుతడి పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలి: వ్యవసాయశాఖ అధికారి భాస్కర్



**ధర్మపురి జూలై 23( నినాదం ):** ఎల్ నినో ప్రభావంతో ప్రస్తుత వానాకాలంలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు వరి సాగుకు బదులుగా ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించేలా విస్తృతంగా అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్ వ్యవసాయ అధికారులను ఆదేశించారు. గురువారం ధర్మపురి రైతు వేదికలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ధర్మపురి డివిజన్ పరిధిలోని మండల వ్యవసాయాధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులతో ఆయన ఎల్ నినో ప్రభావం, ఖరీఫ్ సీజన్ పరిస్థితులు, ఆరుతడి పంటల ప్రణాళికపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్ మాట్లాడుతూ, ఎల్ నినో ప్రభావం కారణంగా ఈ ఏడాది వానాకాలంలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఇలాంటి పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు అధిక నీటి అవసరం ఉన్న వరి సాగును తగ్గించి, తక్కువ నీటితో అధిక దిగుబడులు అందించే ప్రత్యామ్నాయ పంటలైన కంది, మొక్కజొన్న, పెసర, మినుము, జొన్న, వేరుశెనగ వంటి ఆరుతడి పంటలను సాగు చేసేలా గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. రైతులకు అవసరమైన నాణ్యమైన విత్తనాలు సకాలంలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, విత్తనాల సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. రైతులకు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక, సాగు విధానాలపై సాంకేతిక సూచనలు అందిస్తూ నష్టాలను తగ్గించే దిశగా వ్యవసాయ శాఖ సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జగిత్యాల ఆత్మ డిపిడి జాన్ సుధాకర్, ధర్మపురి సహాయ వ్యవసాయ సంచాలకులు (ఏడీఏ) రాంచందర్, ధర్మపురి ఏఈఓ రాజ్ కుమార్, డివిజన్ పరిధిలోని మండల వ్యవసాయాధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

## నీట్ లీకేజీపై కాంగ్రెస్ నిరసన



**భిక్కనూరు, (నినాదం)** నీట్ పేపర్ లీకేజీ ఘటనను నిరసిస్తూ బిక్కనూరు మండల కాంగ్రెస్, యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం ర్యాలీ, రాస్తారోకో, దిష్టిబొమ్మ దహనం నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, నీట్ పేపర్ లీకేజీతో విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతింటోందని ఆరోపిస్తూ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని, ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం. చంద్రకాంత్ రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఇంద్రకరణ్ రెడ్డి, బిక్కనూరు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నరేందర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుదర్శన్, మం డల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీరామ్ వెంకటేష్, మాజీ మం డల అధ్యక్షుడు, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు భీమ్ రెడ్డి, సర్పంచ్ బల్యాల రేఖ, సొసైటీ చైర్మన్ భూమ య్య, ఆలయ కమిటీ చైర్మన్ లింబాద్రి, జిల్లా కార్యదర్శి రాజబాబు గౌడ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు జీవన్, యువజన కాంగ్రెస్ స్పోక్ పర్సన్ ప్రదీప్, కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కర్నాల శ్రీను, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ విధానం

### ఆర్టీసీ బస్సులో సురక్షితంగా ప్రయాణం చేద్దాం: జమ్మికుంట గద్దపాక బస్ సర్వీస్ ను ప్రారంభించిన ప్రణవ్





**జమ్మికుంట జూలై 23 (నినాదం):** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే మహిళలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి ఉచిత బస్ సౌకర్యాన్ని కల్పించామని,మహిళల చుట్టే కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలు అమలు చేస్తున్నామని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు. గురువారం జమ్మికుంట నుండి గద్దపాక వరకు నడిచే బస్ సర్వీసును బొంతుపల్లిలో రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు ప్రణవ్ కు మంగళ హారతు లతో ఘన స్వాగతం పలికారు. అనంతరం మహి ళలతో కలిసి టికెట్ తీసుకొని బస్ లో ప్రయాణిం చారు. మహాలక్ష్మీ,ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని మహిళలను అడగగా అందుతున్నాయని చాలా సంతోషంగా ఉన్నామని వారు తెలిపారు. అంతకు ముందు ఇదే గ్రామంలో 8 లక్షల ఎస్డియఫ్ నిధులతో నిర్మించిన కల్వర్టును ప్రణవ్ ప్రారంభించారు. ఈ కల్వర్టు ద్వారా సుమారు 60 ఎకరాల పై చిలుకు రైతులకు ఇది ఉపయోగపడుతుందని, ఈ విషయంపై హుజురా బాద్ ఇంచార్జి దృష్టికి తీసుకెళ్లిన వెంటనే మంజూరు చేపించిన ప్రణవ్‌కు గ్రామస్థులు రైతులు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ప్రణవ్ మాట్లాడుతూ కోటి మంది మహిళలు కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి ముందుకు వెళ్తున్నారని,ఇందిరా మహిళా శక్తి ద్వారా మహిళలకు ప్రయోజనం చేకూరే పనులు చేస్తున్నామని,గ్రామాల్లో రవాణా వ్యవస్థను మెరుగు పరిచేందుకు రవాణా సౌకర్యం కల్పిస్తున్నామని దీన్ని గ్రామాల ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు. ఈ సర్వీసు మంజూరుకు కృషి చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్,జిల్లా ఇంచార్జి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ వీణవంక మండల అధ్యక్షుడు రఘుపాల్ రెడ్డి తోపాటు పలువురు కాంగ్రెస్ నాయకులు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

### సర్ కార్యక్రమంలో నియోజకవర్గం

## మొదటి స్థానంలో ఉండాలి.

### మ్యాపింగ్ అన్ మ్యాపింగ్ వివరాలు బిఎల్ఎల వద్ద ఉండాలి బిఎల్ఎల సమీక్షా సమావేశంలో ప్రణవ్



**జమ్మికుం, జూలై 23 (నినాదం):** హుజురాబాద్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో హుజురాబాద్ మండల,పట్టణ బిఎల్ఏలతో సమగ్ర ప్రత్యేక ఓటరు నమోదు ప్రక్రియ(సర్) పై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ గారు. ఇప్పటివరకు వార్డు,గ్రామాల్లో మ్యాపింగ్,అన్ మ్యాపింగ్ సంబంధించి పూర్తి వివరాలు బిఎల్ఏ దగ్గర ఉండాలని,సమస్యలు ఉన్న దగ్గర సంబంధిత కో ఆర్డినేటర్లకు సమాచారం అందజేయాలని,త్వరితగతిన ప్రక్రియ పూర్తి చేసి హుజురాబాద్ నియోజకవర్గాన్ని అగ్ర స్థానంలో ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ సుహాసిని,కౌన్సిలర్లు, మండల,పట్టణ అధ్యక్షులు, వార్డ్ అధ్యక్షులు,బిఎల్ఏలు పాల్గొన్నారు.

### 'నీట్'పై ఢిల్లీ పోలీసుల

## చర్యలు ఖండనీయం

### శాంతియుత నిరసన హక్కును గౌరవించాలి జిల్లా కాంగ్రెస్ వైద్య విభాగం చైర్మన్ డా.వెంకటేశ్వర్లు



**కరీంనగర్, జూలై 23(నినాదం):** నీట్ పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా ఢిల్లీలో శాంతి యుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులపై ఢిల్లీ పోలీసులు వ్యవహరించిన తీరును తీవ్రంగా ఖండిస్తున్నట్లు జిల్లా కాంగ్రెస్ వైద్య విభాగం చైర్మన్ డా. వెంకటేశ్వర్లు తెలిపారు. దేశంలో సివిల్స్‌తో సమానమైన ప్రతిష్ఠ కలిగిన ప్రవేశ పరీక్షగా భావించే నీట్ కోసం విద్యార్థులు వేల గంటలపాటు కఠోరంగా శ్రమించడంతో పాటు కుటుంబాలు ఆర్థిక, మానసిక త్యాగాలు చేస్తాయని అన్నారు. అలాంటి పరీక్ష ప్రశ్నాపత్రం పదేపదే లీక్ కావడం వల్ల విద్యార్థుల భవిష్యత్తుతో పాటు దేశ విద్యా వ్యవస్థ విశ్వసనీయత కూడా దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అన్యాయాన్ని ప్రశ్నిస్తూ శాంతియుతంగా ఆందోళన చేపట్టిన విద్యార్థులు, తల్లిదండ్రులపై పోలీసులు, గుర్తు తెలియని వ్యక్తులు హింసకు పాల్పడడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, మేధావులు ఈ ఘటనపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారని, విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడటం క్షమించరాని చర్య అని అన్నారు. అదే సమయంలో తెలంగాణ పోలీసులు ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ శాంతిభద్రతలను సమర్థవంతంగా పరిరక్షిస్తున్న తీరును అభినందించారు. నిరసన తెలిపే హక్కును గౌరవిస్తూ సమస్యలను సంయమనంతో పరిష్కరించే విధానం దేశవ్యాప్తంగా ఆదర్శంగా నిలవాలని డా. వెంకటేశ్వర్లు ఆకాంక్షించారు.

## ఖోఖో పోటీలకు ఆల్ఫోర్స్ ఈ-టెక్నో స్కూల్ సర్వం సిద్ధం

### తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుంచి 155 జట్లు.. జూలై 24న ఘనంగా ప్రారంభం ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి



**కరీంనగర్, జులై23(నినాదం):** కరీంనగర్ కొత్తపల్లిలోని ఆల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాలలో జూలై 24 నుంచి ప్రారంభమయ్యే సీబీఎస్ఈ క్లస్టర్-7 ఖో-ఖో పోటీల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి తెలిపారు. పోటీల ఏర్పాట్లను ఖో-ఖో ప్రతినిధులతో కలిసి పరిశీలించిన ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల్లో మానసిక ఉల్లాసం, ఒత్తిడి నివారణతో పాటు క్రమశిక్షణ, జట్టు స్ఫూర్తిని పెంపొందిం చడంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ఆల్ఫోర్స్ విద్యాసంస్థలు విద్యతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యం ఇస్తూ అవసరమైన అన్ని వసతులు కల్పిస్తున్నాయని పేర్కొన్నారు. పాఠశాల మౌలిక సదుపాయాలను దృష్టిలో ఉంచుకుని సీబీఎస్ఈ ఈ టోర్నీ నిర్వహణ బాధ్యతలను అప్పగించింద న్నారు. అండర్-14, అండర్-17, అండర్-19 బాలికల విభాగాల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి మొత్తం 155 జట్లు పాల్గొంటున్నాయని తెలిపారు. వీటిలో అండర్-14లో 87 జట్లు, అండర్-17లో 55 జట్లు, అండర్-19లో 13 జట్లు ఉన్నాయి. క్రీడాకారిణులకు వసతి, భోజనం తదితర అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. జూలై 24 ఉదయం 11 గంటలకు జరిగే ప్రారంభోత్సవానికి చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ మేడిపల్లి సత్యం, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా (ఐఏఎస్), సీబీఎస్ఈ ప్రాంతీయ అధికారి జంగం సునీల్ కుమార్ హాజరుకానున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర, కరీం నగర్ జిల్లా ఖో-ఖో సంఘాల ప్రతినిధులు కూడా పాల్గొంటారని చెప్పారు. సీబీఎస్ఈ పరిశీలకుడు ఇప్పటికే పాఠశాలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలిం చినట్లు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ ఖో-ఖో సంఘం రిఫరీ బోర్డు కన్వీనర్ వి. సూర్యప్రకాశ్, అంతర్జాతీయ ఖో-ఖో రిఫరీ ఏ. రవీందర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, వివిధ జట్ల నిర్వాహకులు, శిక్షకులు పాల్గొన్నారు.

# పట్టణ అభివృద్ధి పనుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

- ప్రకృతి వనాలు, డంపింగ్ యార్డ్, ఇండోర్ స్టేడియం పరిశీలించిన జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి





**యాదాద్రి భువనగిరి, జూలై 23 (నినాదం) :** భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని డంపింగ్ యార్డ్, ఇండోర్ స్టేడియం, పట్టణ ప్రకృతి వనాన్ని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావుతో కలిసి గురువారం పరిశీలించారు. ముందుగా డంపింగ్ యార్డ్‌ను సందర్శించిన కలెక్టర్ తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసే విధానం, సేంద్రియ ఎరువు తయారీ ప్రక్రియ, బయో మైనింగ్ పనుల పురోగతిని పరిశీలించారు. మున్సిపాలిటీలో మొత్తం ఎంత మంది శానిటేషన్ సిబ్బంది పనిచేస్తున్నారని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. చెత్త సేకరణకు ఎన్ని వాహనాలు వినియోగిస్తున్నారని , ఇంటింటికి తిరిగి చెత్తను ఏ విధంగా సేకరించి డంపింగ్ యార్డ్‌కు తరలిస్తున్నారనే వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. డపింగ్ యార్డ్ ను సమర్ధవంతంగా సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. పట్టణ పారిశుధ్య నిర్వహణను మరింత సమర్ధవంతంగా చేపట్టాలని, సూచించారు. అనంతరం ఇండోర్ స్టేడియాన్ని పరిశీలించిన కలెక్టర్, క్రీడాకారులకు మెరుగైన వసతులు కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. స్టేడియం చుట్టూ ప్రహరీ గోడ నిర్మించాలని, ప్రధాన ప్రవేశ ద్వారానికి గేటు ఏర్పాటు చేయాలని, స్టేడియం లోపల తగినంత లైటింగ్ సౌకర్యం కల్పించాలని సూచించారు. క్రీడాకారులు, యువత సౌకర్యవంతంగా వినియోగించుకునేలా అవసరమైన మౌలిక వసతులను త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. తదుపరి పట్టణ ప్రకృతి వనాన్ని సందర్శించిన కలెక్టర్,పట్టణ ప్రకృతి వనం శుభ్రంగా ఉండే విధంగా, ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించే విధంగా ఉండాలన్నారు. మంచి మొక్కలు, నీడనిచ్చే చెట్లు, ఇతర ఉపయోగకరమైన మొక్కలు పెంచాలని సూచించారు. అందుకు అనుగుణంగా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. పచ్చని చెట్ల తో వాతావరణాన్ని పరిరక్షిస్తూ ప్రజలకు ఉపయోగపడే విధంగా అభివృద్ధి పనులను ప్రణాళికా బద్ధంగా చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ శ్రీవాణి రవికుమార్, మున్సిపల్ కమిషనర్ చంద్ర ప్రకాష్ రెడ్డి , వార్డు కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, శానిటేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు అవుట్ రీచ్ ప్రోగ్రాం



**సూర్యాపేట ప్రతినిధి, జులై 23 (నినాదం):** పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో 167వ ఆదాయ పన్ను దినోత్సవాన్ని సందర్భంగా కామర్స్ విద్యార్థులకు అవుట్ రీచ్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆదాయపు పన్ను ఆఫీసర్ శ్రీ నిశాంత్ గోయల్ ఎం .ప్రసాద్ పాల్గొన్నారు . ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆదాయపు పన్ను సకాలంలో చెల్లించడం ఐ టి ఆర్ దాఖలు చేయడం ద్వారా దేశ అభివృద్ధికి తోడ్పడడంతో పాటు వ్యక్తిగతంగా ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని అన్నారు ఆదాయానికి బలమైన రుజువు గా వ్యక్తి సంపాదనకు ప్రామాణికమైన అధికారికమైన రుసుమును పొందుతారని పేర్కొన్నారు. స్వయం ఉపాధి వ్యక్తులకు ఎంతగానో ఉపయోగపడుతుందని గృహ రుణాలు వాహన రుణాలు వ్యక్తిగత రుణాలు తీసుకునేటప్పుడు బ్యాంకులో ఐటిఆర్ రికార్డులను పరిశీలిస్తానని తెలిపారు. విదేశాలకు ప్రయాణించడానికి వీసా దరఖాస్తు చేసుకునేటప్పుడు ఆదాయపన్ను రిటర్న్ సమర్పించాలని అన్నారు. అదేవిధంగా ఎస్వి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కెప్టెన్ ప్రొఫెసర్ వి వెంకటేశులు మాట్లాడుతూ బీకాం సీఎ చదువుతున్న విద్యార్థులు ఇన్కమ్ టాక్స్ సబ్జెక్టు నేర్చుకోవడం ద్వారా బ్యాంకు సెక్టార్లలో ఇతర ప్రభుత్వ ఉద్యోగాలలో స్థిరపడవచ్చు అని సూచించారు. ప్రభుత్వ ఏడేడు ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ కోర్సులలో బీకాం కంప్యూటర్ గ్రూపులో విద్యార్థులు అధిక సంఖ్యలో అడ్మిషన్లు పొందుతున్నారని తెలిపారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి ప్రశంస పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వాణిజ్యశాస్త్ర హెచ్ ఓ డి చక్రవర్తి అధ్యాపకులు అనిల్ పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

### సర్పంచ్ హసీనాబాను అక్బర్ ఖాన్



**మహాదేవపూర్, జూలై 23,(నినాదం);** పరిసరాల పరిశుభ్రత తోనే ప్రజలు ఆరోగ్యంగా జీవించవచ్చని జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ సర్పంచ్ హసీనాబాను అక్బర్ ఖాన్ అన్నారు. మండల కేంద్రంలోని 1,2 వార్డులలో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కాలనీలోని చెత్తాచెదారాన్ని శుభ్రం చేయించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నివసించే పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటే ఈగలు, దోమలు క్రిమి కీటకాలు చేరి మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్, నీరు కలుషితమై శ్వాసకోశ వ్యాధులు ప్రబలి ఇబ్బందులను ఎదుర్కొంటారని ఆమె తెలిపారు. పరిసరాల పరిశుభ్రత తోనే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు సమ్మయ్య, లావణ్య, స్వామి, మహమ్మద్ బిన్ అలీ, చంద్రశేఖర్, రాములు తోపాటు గ్రామ ప్రజలు గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## డ్రగ్స్ రహిత భవిష్యత్ నిర్మాణానికి ప్రతిఒక్కరూ బాధ్యులు కావాలి

### రాష్ట్ర అటవి పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ





**హన్మకొండ, జూలై 23(నినాదం):** తెలంగాణ రాష్ట్ర జర్నలిస్ట్ యూనియన్ (టీ ఎస్ జే యూ) హనుమకొండ యూనిట్ ఆధ్వర్యంలో గురువారం బ్రేక్ ఫ్రీ ఫ్రం డ్రగ్స్ బిల్డ్ ఏ బ్రైట్ ఫ్యూచర్ సే నో టు డ్రగ్స్ అనే నినాదాలతో హనుమకొండ కలెక్టరేట్ నుంచి కాళోజీ జంక్షన్ వరకు 2కే రన్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర అటవి పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా హాజరైన ఈ ర్యాలీలో ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్ణాటి వరుణ్ రెడ్డి, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న, హనుమకొండ అదనపు కలెక్టర్ రవి, వరంగల్ డీసీపీ ధారా కవిత, తదితరులు ముఖ్య అతిథులుగా హాజరై జెండా ఊపి 2కే రన్‌ను ప్రారంభించారు. అనంతరం అధికారులు, విద్యార్థులు, జర్నలిస్టులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజలతో కలిసి "సే నో టు డ్రగ్స్" ప్రతిజ్ఞ చేయించారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి, ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకోవాలని, సమాజ నిర్మాణంలో బాధ్యతాయుతమైన పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ఈ ర్యాలీలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి అప్పయ్య డీ పీ ఆర్ ఓ అయుబ్ అలీ, కుడా మాజీ చైర్మెన్ సుందర్ రాజ్ యాదవ్ తో పాటు జర్నలిస్ట్ యూనియన్ బాధ్యులు , విద్యార్థులు, యువత, జర్నలిస్టులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, అధికారులు పాల్గొని డ్రగ్స్ వ్యతిరేక నినాదాలతో ప్రజల్లో అవగాహన కల్పించారు.

## వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

- జన విజ్ఞాన వేదిక జాతీయ నాయకులు డాక్టర్ ముఖ్వ రామరావు



**మిర్యాలగూడ, జులై 23 (నినాదం ):** జ్యోతి హాస్పిటల్స్ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జన విజ్ఞాన వేదిక జాతీయ నాయకులు,జ్యోతి హాస్పిటల్స్ అధినేత డాక్టర్ ముఖ్వ రామరావు కోరారు. గురువారం త్రిపురారం మండలం చెన్నైపాలెం గ్రామంలో జ్యోతి హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాలలో ప్రజలు వైద్యం అందక అనేక రకాల ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ఆయా ప్రజలకు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వందలాది మంది ప్రజలకు బిపి, షుగర్, గుండె సంబంధిత పరీక్షలు నిర్వహించి మందు లు పంపిణీ చేసినట్లు చెప్పారు. కార్యక్ర మంలో గ్రామ సర్పంచ్ రాము, మాజీ ఎంపీటీసీ చేన్నలు, బంజారా ఉద్యోగుల సంఘం తెలంగాణా రాష్ట్ర కన్వీనర్ మాలోత్ దశరథ్ నాయక్,వైద్య బృందం డాక్టర్లు వినీత్,సాయి,విక్రమ్, వైద్య సిబ్బంది నాగేంద్రబాబు, నాగరాజు, విష్ణు, సంధ్య, రేణుక,ప్రత్యూష పాల్గొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాల తనిఖీ



**అమరచింత, జూలై 23, (నినాదం):** ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఇంటర్మీడియట్ విద్యాధికారి నరేంద్ర కుమార్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా ఆయన కళాశాలలోని రికార్డులను తనిఖీ చేసి ప్రిన్సిపల్ సైదులు తో విద్యార్థుల హాజరు శాతాన్ని సంఖ్యను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన కొత్త పాఠ్యపుస్తకాలు అందాయా లేదా అని అలాగే ప్రాక్టికల్స్ గురించి కళాశాలలో వసతుల గురించి విద్యార్థులతో అడిగి తెలుసుకున్నారు. అనంతరం కళాశాలలో ఎన్ ఎస్ ఎస్ యూనిట్ – 2 ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వన మహోత్సవంలో పాల్గొని మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సీనియర్ లెక్చరర్స్ భాగ్య వర్ధన్ రెడ్డి, టి. జె. విశ్వేశ్వర్, ఎన్ఎస్ఎస్ యూనిట్ –2 ప్రోగ్రాం అధికారి కురుమూర్తి, రాఘవేందర్ రావు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల ప్రత్యేక వైద్య శిబిరాల ఏర్పాటు



**కమలాపూర్, జులై 23 (నినాదం):** కమలాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఆరోగ్య ఉపకేంద్రం అంబాల, శ్రీరాములపల్లి రెండు గ్రామాల్లో గురువారం సీజనల్ వ్యాధుల నివారణ, నియంత్రణలో భాగంగా ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కమలాపూర్ వైద్యాధికారి డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల నియంత్రణలో ఆరోగ్య సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని అన్నారు. గ్రామంలో ఇంటింటా జ్వర సర్వే నిర్వహించే సమయంలో జ్వరం లేదా ఇతర లక్షణాలు ఉన్న వారిని వెంటనే గుర్తించి, అవసరమైన ప్రాథమిక చికిత్స అందించాలన్నారు. మెరుగైన వైద్యం అవసరమైన వారిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కమలాపూర్‌కు సకాలంలో తరలించాలని తెలిపారు. అలాగే గ్రామ ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, దోమల నివారణ చర్యలు చేపట్టడం, జ్వరం వచ్చిన వెంటనే సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని తెలిపారు. ఈ వైద్య శిబిరంలో మొత్తం 98 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. జ్వర లక్షణాలతో ఉన్న 6 మందికి రక్త పరీక్షలు నిర్వహించి, అవసరమైన చికిత్స అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ గుర్రం దిలీప్,డా మానస, హెల్త్ ఎడ్యుకేటర్ రవీందర్, ఏఎన్ఎం జ్యోతి, హెల్త్ అసిస్టెంట్లు గోవర్ధన్, బాబు, అలాగే ఆశా కార్యకర్తలు రమ, ఇందిర,పలువురు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర వైఖరికి నిరసనగా నిరసన



**వేములపల్లి, జూలై23, (నినాదం):** నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారంపై శాంతియుతంగా నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ అగ్రప్రతినిధులు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను అరెస్టు చేయడం తీవ్ర అప్రజాస్వామికమని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు మాలి కాంతారెడ్డి ధ్వజమెత్తారు. రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు వేములపల్లి మండల కేంద్రంలోని నార్కట్‌పల్లి–అద్దంకి ప్రధాన రహదారిపై గురువారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారీ రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీట్ పేపర్ లీకేజీపై న్యాయం కావాలని కోరుతున్న విద్యార్థులు, ప్రతిపక్ష ప్రతినిధులపై పోలీసులు విచక్షణారహితంగా లాఠీఛార్జ్ చేయడం, అక్రమ కేసులు నమోదు చేయడం దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్న కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ మెంబర్ చిరుమర్రి కృష్ణయ్య, రావు ఎల్లారెడ్డి, రేగట్టె రవీందర్‌రెడ్డి, పుట్టల కృపయ్య, సర్పంచులు పిల్లల సందీప్, దేశిరెడ్డి శ్రీనివాసరెడ్డి, బొంగర్ల వినోద్, పుట్టల వెంకటేశ్వర్లు, గంజి శ్రీను, సతీష్‌రెడ్డి, సత్తిరెడ్డి, హాజి, శ్రీనివాసరెడ్డి, నరేష్, చంటి, సురేందర్, అశోక్, గురువయ్య, రమేష్, ప్రవీణ్, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆగస్టు1 నుంచి మూడు నెలల రేషన్ బియ్యం


- ఏర్పాట్లకు సన్నద్ధమౌతున్న అధికార యంత్రాంగం



**హన్మకొండ,జూలై23, (నినాదం):** వర్షాకాలం నేపథ్యంలో ప్రభుత్వం లబ్ధిదారులకు అందించే సన్న బియ్యాన్ని ఆగస్టు 1 నుంచి ప్రారంభించి సెప్టెంబర్, అక్టోబర్ నెలల రేషన్ బియ్యాన్ని ఒకేసారి మూడు నెలల బియ్యాన్ని ఇవ్వడానికి ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశాలు జారీచేసింది. ఇందుకు సంబంధిత అధికారులు రేషన్ బియ్యాన్ని ఆగస్టు 1 వ తేదీ నుంచి లబ్ధిదారులకు అందించేందుకు ఏర్పాట్లకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తుంది. జిల్లాలో 414 రేషన్ షాపులకు గాను 246543 రేషన్ కార్డులు, 742917 యూనిట్లు ఉన్నాయి. వీరికి నెలకు సంబంధించిన మొత్తం బియ్యం 4676582 మెట్రిక్ టన్నులు కాగా మూడు నెలకు గాను 14029746 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ప్రభుత్వం కేటాయించనున్నది. ఒక్కో యూనిట్ కు ఆరు కిలోలు చొప్పున సన్న బియ్యం పంపిణీ చేయనున్నారు. ఈ నేపథ్యంలో జూలై నెలకు సంబంధించిన సన్న బియ్యాన్ని ఇప్పటికే అన్ని రేషన్ దుకాణాలు లబ్ధిదారులకు పంపిణీ ప్రక్రియను పూర్తి చేశారు. గత వేసవిలో ఏప్రిల్, మే, జూన్ నెలకి సంబంధించిన రేషన్ బియ్యాన్ని పంపిణీ చేసిన తరహాలోనే ఈ వర్షాకాలంలో బియ్యం పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. అందులో భాగంగానే ప్రస్తుతం జూలై నెలకి సంబంధించినా బియ్యం పంపిణీ ప్రక్రియను డీలర్లు పూర్తి చేశారు. ఆగస్టు 1 నుంచి మరోసారి మూడు నెలల సన్న బియ్యాన్ని బియ్యం పంపిణీ చేసేందుకు అధికారులు రంగంసిద్ధం చేస్తున్నట్లు తెలుస్తుంది.

## బాలకృష్ణ త్వరగా కోలుకోవాలని

### సాయిబాబా దేవాలయంలో ప్రత్యేక పూజలు



**మిర్యాలగూడ, జులై 23 (నినాదం):** పద్మ శ్రీ నందమూరి బాల కృష్ణ ప్రమాదం లో గాయపడిన త్వరగా కోలుకోవాలని టీడీపి పట్టణ కన్వీనర్ నందమూరి యువసేన జిల్లా కన్వీనర్ ఆధ్వర్యంలో సాయిబాబా ఆలయం లో పూజలు నిర్వహించడం జరిగింది. బసవ తారకం క్యాన్సర్ హాస్పిటల్ చైర్మన్ గా ఎంతో మంది పేదల ను ఆదుకొనే బాలకృష్ణ సామజిక సేవలో ముందుండే బాలకృష్ణ కోలుకోవాలని అభిమానులు సాయిబాబా ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో మేక అంజి ఇండ్ల గణేష్ పాల్గొన్నారు.

## చేనేత సహకార సంఘాలకు ఆర్డర్లు లేవు, అమ్మకాలు లేవు

- ఉపాధి లేక వలస బాటపడుతున్న చేనేత కార్మికులు
- అందనంత దూరంలో ప్రభుత్వ ప్రోత్సాహకాలు




**హన్మకొండ, జూలై23, (నినాదం):** చేనేత వృత్తినే నమ్ముకొని కుటుంబాలను పోషించుకున్న నేతన్నల ఉపాధి కరువైంది. ప్రత్యామ్నాయంగా ఉపాధి కోసం సూరత్, బీమాండి, సిరిసిల్ల లాంటి ప్రాంతాలకు వలసలకు వెళ్తున్నారు. నేత కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శలు కూడా ఉన్నాయి. ఒకప్పుడు గ్రామాల్లో మగ్గాల చప్పుల్లతో కళకళ లాడిన సంఘాలు 13 సంవత్సరాలుగా ప్రభుత్వ ప్రోత్సాహకాలు లేకపోవడంతో పాటు పాలక వర్గాల నిర్లక్ష్యం కారణంగాబ్ సంఘాలు అభివృద్ధికి నోచుకోకుండా పోయాయనే ఆరోపణ వినవస్తున్నాయి. వృత్తినే దైవంగా భావించుకున్న నేత కార్మికులకు ప్రస్తుతం సరియైన ఉపాధి లేక ఇల్లు గడవని దుస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. కార్మికులకు రావలసిన థ్రిఫ్ట్ ఫండ్ లో భాగంగా 15 నెలలకు సంబంధించిన థ్రిఫ్ట్ ఫండ్ లో కేవలం మూడు నెలల కు సంబంధించిన డబ్బులే మాత్రమే వచ్చాయని కార్మికులు తెలుపుతున్నారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చేనేత సహకార సంఘాలకు కొత్త పాలకవర్గాలు కొలువుదీరాయి. సంఘాల అభివృద్ధిని కాంక్షిస్తూ కొత్త పాలకవర్గాలు చిత్తశుద్ధితో పని చేస్తూ సంఘాలలో పేరుకుపోయిన సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తేనే సంఘాలకు మళ్ళీ పూర్వవైభవం వచ్చే అవకాశం ఉందని కార్మికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. గతంలో సంఘాలలో తయారు చేసిన వస్త్రాలను టెస్కో కొనుగోలు చేసి ఆర్థిక భరోసా కల్పించింది. కానీ ప్రభుత్వం ఇటీ వల టెండర్ ద్వారా ప్రైవేట్ సంస్థకు కొనుగోలు ప్రక్రియను అప్పగించడంతో ఆ సంస్థ కొనుగోళ్లకు ముందుకు రాకపోవడంతో నేసిన వస్త్రాలు ఒక్కొక్క సంఘంలో రూ 5 లక్షల నుండి రూ 10 లక్షల విలువైన వస్త్రాల నిల్వలు ఉన్నట్లు తెలుస్తుంది. ఈ క్రమంలోనే సంఘాలు ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయని కార్మికులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం నూతన పాలకవర్గాలను ప్రోత్సహించి తద్వారా సంఘాల అభివృద్ధికి తోడ్పడాలని కార్మికులు కోరుతున్నారు. లిసంఘాల అభివృద్ధికిలి సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం ఆర్డర్లు, అమ్మకాల బాధ్యత తీసుకోవాలి, పావలా వడ్డీకే రుణాల మంజూరు చేయాలి, క్యాష్ క్రెడిట్ సౌకర్యాన్ని కల్పించాలి, సంఘాలకు ఆర్థిక భరోసా ఇచ్చేందుకు నూతన సంస్కరణలు చేపట్టాలి, సంఘాల్లో మగ్గం నేసే కార్మికులకే ప్రత్యేక ప్రోత్సాహకాలు నేరుగా అందేలా చూడాలి, ఈనెల 10 న జరిగిన ఎన్నికల్లో కొత్త పాలకవర్గాలు బాధ్యతలు చేపట్టాయి. జిల్లావ్యాప్తంగా ఉన్న సంఘాలలో కొన్ని సంఘాలలో పాలకవర్గాలు ఇదివరకే ప్రమాణ స్వీకారం చేయగా మరికొన్ని సంఘాలు శుక్రవారం ప్రమాణ స్వీకారం చేసి కొలువు తీరనున్నారు. ఈ పాలకవర్గాలు సంఘాలను బలోపేతం చేసి కార్మికులకు ఉపాధి కల్పించే దిశగా కృషిచేస్తారని సభ్యులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## మద్యం మత్తు... జీవితం చిత్తు



**నూతనకల్ ,జూలై 23 (నినాదం):** మత్తు పదార్థాలకు అలవాటు పడితే జీవితాలు చిత్తు అవుతాయని సమాజానికి అందరు కృషి చేయాలని మండల కేంద్రంలో గురువారం ఎస్సై నాగరాజు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ సహా మత్తు పదార్థాల నిర్మూలనను ప్రజా ఉద్యమంగా మార్చాల్సిన అవశ్యకత ఉందని ఇందులో మీడియా కీలక భాగస్వామిగా ఉండాలని ప్రతి గ్రామాన్ని మత్తు రహితంగా తీర్చిదిద్దే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పేర్కొన్నారు. ఈనాటి కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, వివిధ గ్రామ ప్రజలు,యువకులు ఉన్నారు.

## ప్రశ్నించే గొంతులను నొక్కుతున్న కేంద్రం



- ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

**మిర్యాలగూడ జూలై 23 (నినాదం ):** ఏఐసీసీ అగ్రనేతలు రాహుల్ గాంధీ గారి , ప్రియాంక గాంధీ అక్రమ అరెస్టులను నిరసిస్తూ గురువారం నల్గొండ జిల్లా మిర్యాలగూడ నియోజకవర్గంలో కాంగ్రెస్ శ్రేణులు పెద్దఎత్తున ఆందోళనలు చేపట్టా యి. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ,టీపీసీసీ అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్ పిలుపు మేరకు నియోజకవర్గ పరిధిలోని దామరచర్ల, అడవిదేవులపల్లి, వేములపల్లి, మాడ్గులపల్లి మండలాల్లో పెద్ద ఎత్తున నిరసనలు తెలిపారు. అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూప్రశ్నించే గొంతులను అణచివేయడమే ధ్యేయంగా కేంద్రం పనిచేస్తుందని విమర్శించారు. రాహుల్, ప్రియాంక గాంధీల అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామని, వారిపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమాలలో నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, మండల పార్టీ అధ్యక్షులు, వివిధ విభాగాల నాయకులు, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యుఐ ప్రతినిధులు,భారీ సంఖ్యలో విద్యార్థులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ తీరుపై బీజేపీ మండిపాటు

- రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మ దహనం



**వేములపల్లి, జూలై 23 (నినాదం):** కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి తట్టుకోలేకనే కాంగ్రెస్ ప్రతినిధులు అసత్య ఆరోపణలతో విద్యార్థుల మధ్య చిచ్చు పెడుతూ దేశాన్ని విచ్ఛిన్నం చేయడానికి పూనుకుంటున్నారని బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు పెదమాం భరత్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రధాని నరేంద్ర మోదీ ఇంటి ముట్టడికి కాంగ్రెస్ యత్నించడాన్ని నిరసిస్తూ వేములపల్లి మండల కేంద్రంలో గురువారం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంపై పార్లమెంట్‌లో చర్చకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించినప్పటికీ, ప్రతిపక్ష ప్రతినిధులు చర్చల్లో పాల్గొనకుండా విద్యార్థులను రెచ్చగొడుతూ రోడ్లపైకి తీసుకురావడం దారుణమన్నారు. విద్యార్థుల భవిష్యత్తుపై ఏమాత్రం ఆందోళన ఉన్నా పార్లమెంట్ వేదికగా జరిగే చర్చల్లో పాల్గొని తమ అభిప్రాయాలను వ్యక్తం చేయాలని, అంతే తప్ప నిరంకుశంగా వ్యవహరించడం సరైన పద్ధతి కాదని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ప్రతినిధులు చలమల్ల సీతారాంరెడ్డి, జవ్వాజి సత్యనారాయణ, పందిరి భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

# భక్తి వెల్లువలో.. మైసమ్మ తల్లి బోనాల జాతర

### వేడుకలో పాల్గొన్న మేయర్ మధుకర్



**మంచిర్యాల, జులై 23(నినాదం) :** ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సీసీసీ రాయల్ టాకీస్ సమీపంలోని వారసంత ప్రాంగణంలో అన్నపూర్ణ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ మైసమ్మ తల్లి బోనాల జాతర భక్తిశ్రద్ధల నడుమ అత్యంత వైభవంగా జరిగింది. జాతరకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకలకు మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ దర్ని మధుకర్, టీపీసీసీ సభ్యులు నూకల రమేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వాదాలు పొందారు. అనంతరం జాతర ఏర్పాట్లను పరిశీలించి నిర్వాహకులను అభినందించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను ప్రజలు ఐక్యంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఇలాంటి ఆధ్యాత్మిక వేడుకలు సమాజం లో ఐక్యతను, సాంస్కృతిక విలువలను మరింత బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. జాతరలో స్థానిక కార్పొరేటర్ తాళ్ళ సంపత్ రెడ్డి, అన్నపూర్ణ వార సంత గౌరవ అధ్యక్షుడు రాచకొండ వెంకటేశ్వర్ రావు, స్థానిక వ్యాపారస్తులు, అన్నపూర్ణ సొసైటీ సభ్యులు, మహిళలు, యువకులు, భక్తులు పాల్గొన్నారు.

# ఎల్‌నినోతో అప్రమత్తం.. తక్కువ నీటి పంటలే సాగు చేయాలి

### చింతలమానేపల్లిలో వ్యవసాయ శాఖ అత్యవసర ప్రణాళిక సమావేశం



**చింతలమానేపల్లి, జులై 23:** ఎల్‌నినో ప్రభావంతో జూలై-ఆగస్టు నెలల్లో వర్షాలు బలహీనంగా ఉండే అవకాశం ఉన్నందున రైతులు తక్కువ నీటి అవసరం ఉన్న పంటల సాగుపై దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయ అధికారి బుర్కుట్ వెంకట్ సూచించారు. గురువారం మండలంలోని బాలాజీ అనుకోడ రైతు వేదికలో ఆయన అధ్యక్షతన, మండల వ్యవసాయ అధికారి కార్తీష ఆధ్వర్యంలో డీలర్లు, ఏఈఓలు, రైతులతో అత్యవసర (కాంటింజెన్సీ) పంటల ప్రణాళిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీలర్లకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఎంఆర్పీ ధరల కంటే ఎక్కువకు ఎరువులు విక్రయించరాదని, పారాక్వాట్, మోనో, గ్లైఫోసేట్ వంటి మందులు విక్రయించవద్దని, గడువు ముగిసిన పురుగుమందులు అమ్మరాదని స్పష్టం చేశారు. బిల్లు పుస్తకాలు, స్టాక్ రిజిస్టర్లు తప్పనిసరిగా నిర్వహించి, రైతులకు బిల్లులు అందజేయాలని సూచించారు. సమావేశంలో తెలంగాణ ప్రభుత్వం రూపొందించిన 2026 అత్యవసర పంటల ప్రణాళికను వివరించారు. నీటి వసతి ఉన్న ప్రాంతాల్లో మాత్రమే వరి సాగు చేయాలని, వర్షాధార ప్రాంతాల్లో వరి సాగును నివారించాలని సూచించారు. కందులు, మినుములు, పెసర, మొక్కజొన్న, జొన్న, సజ్జ, కొర్రలు, నువ్వులు, పల్లీలు, సూర్యకాంతి, అలాగే కూరగాయలు, తోటపంటల సాగుపై రైతులు దృష్టి పెట్టాలని తెలిపారు. ఆగస్టు 20 వరకు పత్తి, కంది, పెసర వంటి పంటలు, అనంతరం నువ్వులు, జొన్న, సజ్జ తదితర పంటలు సాగు చేయాలని సూచించారు. పంటల ఎంపిక, విత్తనాలు, ఎరువుల వినియోగం, భూసార పరీక్షలు, పీహెచ్ స్థాయి వంటి అంశాలపై రైతులకు సాంకేతిక అవగాహన కల్పించారు. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ అత్యవసర ప్రణాళికను అనుసరించాలని, సందేహాల నివృత్తికి ఏఈఓలు లేదా మండల వ్యవసాయ అధికారిని సంప్రదించాలని అధికారులు రైతులకు విజ్ఞప్తి చేశారు.

# కోర్టు కేసుల్లో శిక్షల శాతం పెంచేందుకు కృషి చేయాలి

### ఏసీపీ కిరణ్ కుమార్



**మంచిర్యాల, జులై 23(నినాదం):** ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే పోలీసుల లక్ష్యమని బెల్లంపల్లి ఏసిపి కిరణ్ కుమార్ పేర్కొన్నారు. గురువారం వార్షిక తనిఖీలలో భాగంగా గురువారం బెల్లంపల్లి సబ్ డివిజన్ లోని దేవాపూర్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించిన ఆయన, స్టేషన్‌లోని వివిధ రకాల కీలక రికార్డులు, శాంతిభద్రతల నిర్వహణకు సంబంధించిన ఫైళ్లను తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. ఫిర్యాదులు,కేసులను పెండింగ్‌లో ఉంచకుండా సకాలంలో పరిష్కరించాలని, సీసీటీఎన్ఎస్‌లో నమోదులు ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని సూచించారు. కోర్టులతో సమన్వయంతో పనిచేసి ఎక్కువ కేసుల్లో శిక్షలు అమలయ్యేలా కృషి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా సిబ్బందితో వ్యక్తిగతంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు రక్షణ, భద్రత కల్పించడం పోలీసుల ప్రాథమిక విధి,బాధ్యత అని పేర్కొన్నారు. సిబ్బంది విధులను నిరంతరం పర్యవేక్షిస్తూ,వారు సమర్థవంతంగా పనిచేసేలా వారి నైపుణ్యాలను పెంపొందించాలని సూచించారు. క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ ప్రజలతో మమేకమై నేరాల నివారణకు కృషి చేయాలని అన్నారు. ఈ తనిఖీలో మందమర్రి సీఐ పి. రమేష్,దేవాపూర్ ఎస్ఐ గంగారం పాల్గొన్నారు.

## పట్టణాభివృద్ధిపై పట్టు పెంచేందుకు

# ప్రత్యేక శిక్షణ కార్యక్రమం

### పాలన-ప్రజాసేవపై ప్రత్యేక శిక్షణలో పాల్గొన్న కౌన్సిలర్లు



**సుల్తానాబాద్, జులై 23 (నినాదం):** సుల్తానాబాద్ మున్సిపల్ కౌన్సిలర్లుపట్టణాభివృద్ధి, సమర్థవంతమైన పాలన, ప్రజాసేవలో నైపుణ్యాలను పెంపొందించుకునేందు కు హైదరాబాద్‌లో నిర్వహిం చిన ప్రత్యేక శిక్షణ కార్యక్ర మంలో పాల్గొన్నారు. గచ్చిబౌలిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్‌మెంట్ హాల్‌లో తెలంగాణ రాష్ట్రంలో ని మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ల వార్డు కౌన్సిలర్ల కోసం నిర్వహిస్తున్న "ట్రైనింగ్ ప్రోగ్రామ్ ఫర్ వార్డ్ మెంబర్స్ ఆఫ్ మున్సిపాలిటీస్ అండ్ మున్సిపల్ కార్పొరేషన్స్ఇన్ తెలంగాణ" కార్యక్రమానికి సుల్తానా బాద్ మున్సిపల్ కౌన్సిలర్లు హాజరయ్యారు. ఈ శిక్షణలో పట్టణ ప్రణాళిక, ము న్సిపల్ పరిపాలన, పారిశుద్ధ్యం, తాగునీటి నిర్వ హణ, పౌర సేవల మెరుగుదల, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు,ప్రజా సమస్యల పరిష్కారంపై ని పుణులు అవగాహన కల్పించారు. ఈ శిక్షణ ద్వా రా వార్డు స్థాయిలో మరింత సమర్థవంతంగా సేవలందించేందుకు అవసరమైన అవగాహన, నై పుణ్యాలు పెంపొందుతా యని కౌన్సిల ర్లు తెలిపా రు. హైదరాబాద్ లోని ఈ శిక్షణ కార్యక్రమంలో పా ల్గొన్న అనంతరం ప్రజలకు మరింత మెరుగైన ము న్సిపల్ సేవలు అందిం చేందుకు కృషి చేస్తామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఈర్ల స్వ రూప శేఖర్, గాజుల రాజమ ల్లు, కందునూరి సమ త కుమార్, గరిగే శోభ రాణి శ్రీ నివాస్, బాకం సాయికిరణ్, ఊట్ల వరప్రదీప్,చింతల రాజు,తోర్రికొం డ ప్రభాకర్, అంతటి పుష్పలత, కల్వల శంకర మ్మ, అమీరి శెట్టి శ్రావణి రాకేష్, సిద్ద తిరుప తి, వేగోళం పద్మ అబ్బయ్య గౌడ్, గాదాసు మంజుల రవి కౌన్సి లర్లు పాల్గొన్నారు.

# భూముల రీ సర్వే పారదర్శకంగా సాగాలి



**ధర్మారం జులై 23 (నినాదం) :** మండలం లోని పాడి చింతలపల్లి గ్రామంలో జరుగుతున్న భూముల సర్వే పారదర్శకంగా జరగాలని ఈరోజు కలెక్టర్ అధికారులకు సూచించారు. నిబంధనల ప్రకారం సర్వేను పారదర్శకం గా నిర్వహించి గ్రామ సభల ద్వారా రైతులకు రి సర్వే ప్రయోజనాలను వివరించాలని ప్రజల పూర్తి సహాయ సహకారాలు తో విజయవంతంగా చేయాలని రెవెన్యూ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.

# విద్యార్థుల భవిష్యత్ లక్ష్యంగా నాణ్యమైన విద్య

### కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల,జులై 23 (నినాదం):** ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య అందించేందుకు చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని హాజీపూర్ మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి భోజనశాల, అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తూ విద్యార్థులకు అన్ని సౌకర్యాలతో కూడిన నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని, ఈ క్రమంలో పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలతో కూడిన ఆహారం, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని తెలిపారు. ఉపాధ్యాయులు విధుల పట్ల సమయపాలన పాటించాలని, వర్షాకాలం దృష్ట్యా విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. పాఠశాలలలో విద్యార్థుల సంఖ్య పెంపొందించే విధంగా కృషి చేయాలని తెలిపారు. మండల తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి తహసిల్దార్ పుష్పలత తో కలిసి ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ నిర్వహణను పరిశీలించారు. ప్రజల నుండి సేకరించిన ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. బూత్ స్థాయి అధికారులు ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియలో జాగ్రత్త వహించాలని, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా స్పష్టంగా వివరాలు నమోదు చేయాలని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరి వివరాలు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రక్రియ వేగవంతానికి బూత్ స్థాయి ఏజెంట్లు, వాలంటీర్లు, యువత సహకారం తీసుకోవాలని తెలిపారు. భూభారతి, సాదా బైనమా, రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తుల పరిష్కార ప్రక్రియ తీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం లక్షెట్టిపేట మండల కేంద్రంలోని 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి అత్యవసర విభాగం, సామాజిక వార్డులు, ల్యాబ్, మందుల నిల్వలు, పారిశుద్ధ్య నిర్వహణ, ఓ.పి. రిజిస్టర్ అంశాలను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, వర్షాకాలం అయినందున అంటువ్యాధుల నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించాలని, తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించాలని తెలిపారు. వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలని తెలిపారు. అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని, ఆసుపత్రి పరిసరాలలో పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ విజయ్ కుమార్ తో కలిసి మున్సిపల్ పరిధిలో అమృత్ 2.0 పథకంలో భాగంగా చేపట్టిన పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి అదనపు గదులు, భోజనశాల నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. వంటశాలను పరిశీలించి వంట సిబ్బంది ఆహారం తయారీ సమయంలో శుభ్రత నిబంధనలు పాటించాలని, తాజా కూరగాయలు, ధాన్యమైన నిత్యావసర సరుకులను వినియోగించాలని తెలిపారు. విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారం అందించాలని ఆదేశించారు.

# గడువులోగా ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ పూర్తి చేయాలి

### ఓటరు జాబితా సవరణలో పారదర్శకతకు ప్రాధాన్యం
### కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల, జులై 23 (నినాదం):** జిల్లాలో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐ ఆర్) కార్యక్రమాన్ని పారదర్శకంగా, వేగవంతం గా పూర్తి చేసి ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తిచేయా లని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు ప్రతి దశను పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. గురువారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు పి. చంద్రయ్య, వి. రాములతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడు తూ జిల్లాలో సేకరించిన ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ఇప్పటికే 90 శాతం పూర్తయిం దని, మిగిలిన ప్రక్రియను కూడా నిర్ణీత గడువు కంటే ముందుగానే పూర్తిచేసేందుకు అధికారు లు ప్రత్యేక కార్యాచరణతో పనిచేస్తు న్నారని తెలిపారు. ప్రతి ఫారాన్ని క్షుణ్ణంగా పరిశీలించి ఖచ్చితమైన వివరాలతో డిజిటలైజేషన్ చేయాలని సూచించారు. జిల్లాలో అనామోలీస్ (వివరాల్లో వ్యత్యాసాలు) అధికంగా ఉన్నాయని పేర్కొన్న ఆయన, డిజిటలైజేషన్ పూర్తయిన తర్వాత సంబంధిత ఓటర్లకు నోటీసులు జారీ చేస్తామని తెలిపారు. అయితే నోటీసులు అందిన ఓటర్లు ఎలాంటి అపోహలు, ఆందోళనలకు గురికావద్దని, అందులో పేర్కొన్న ధ్రువపత్రాల ను సమర్పించడం ద్వారా తమ ఓటు హక్కును కొనసాగించుకోవచ్చని స్పష్టం చేశారు. డబుల్ ఎంట్రీలు, మరణించిన వ్యక్తుల పేర్లు, ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా మారిన వారి పేర్లను ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం మాత్రమే తొలగిస్తామని తెలిపారు. అదే సమయంలో ఇంకా ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించని అర్హులైన ఓటర్లను గుర్తించి, బూత్ స్థాయి ఏజెంట్ల సహకారంతో బూత్ స్థాయి అధికారులకు ఫారాలు అందజేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తయిన అనంతరం పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ చేపట్టి ఓటర్లకు మరింత సౌకర్యవంతమైన ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా ఎన్నికల ప్రక్రియలో సహకరించి అర్హులైన ప్రతి ఓటరు జాబితాలో ఉండేలా చూడాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి మోతిరాం, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రకళ, మంచిర్యాల రాజస్వ మండలాధికారి శ్రీనివాసరావు, ఎన్నికల విభాగం అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## 'జలసిరి' ఫామ్ పాండ్‌లు భూగర్భ జలాల

# పెంపుదలకు దోహదం చేస్తాయి

### కలెక్టర్ భవేశ్ మిశ్రా



**నిర్మల్ ప్రతినిధి,కుబీర్: జులై 23 (నినాదం):** జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా గురువారం కుబీర్ మండలం దోడర్న గ్రామంలో జలసిరి కార్యక్రమంలో భాగంగా, ఫామ్ పాండ్ నిర్మాణ శంకుస్థాపన చేశారు. గ్రామానికి చెందిన రైతు దంపతులు గోరేకర్ సంతోష్, సాగరలకు చెందిన వ్యవసాయ క్షేత్రంలో, ఫామ్ పాండ్ నిర్మాణానికి కలెక్టర్ గురువారం భూమిపూజ చేసి, శంకుస్థాపన చేశారు. ఫామ్ పాండ్ నిర్మాణానికి ముందుకు వచ్చిన రైతులను ఈ సందర్భంగా కలెక్టర్ శాలువాతో సన్మానించి, అభినందించారు. వారి వ్యవసాయానికి సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భూగర్భ జలాల సంరక్షణకు ఫామ్ పాండ్ ల నిర్మాణాలు దోహదం చేస్తాయని వివరించారు. ప్రతి రైతు బాధ్యతగా తమ వ్యవసాయ క్షేత్రాల్లో ఫామ్ పాండ్ లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రభుత్వం ఈ నిర్మాణాలకు ఆర్థిక సహాయం అందజేస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తక్కువ ఉన్నాయని, ఇటువంటి నీటి నిల్వ నిర్మాణాల వల్ల అత్యవసర పరిస్థితుల్లో పంటకు నీరు అందుతుందని తెలిపారు. భూగర్భ జలాలు పెరుగుతాయని చెప్పారు. రైతులు పెద్ద ఎత్తున ఫామ్ పాండ్ ల నిర్మాణానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం తెలంగాణ జలసిరి కార్యక్రమానికి సంబంధించి గోడ ప్రతులను కలెక్టర్, అధికారులు, రైతులు కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, డిఆర్డిఓ విజయలక్ష్మి, తహసిల్దార్ శ్రీదేవి, ఎంపీడీఓ శ్రీనివాస్, సర్పంచ్ జాదవ్ సావిత్రి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

### జిల్లా సమీకృత కలెక్టరేట్లో నూతన జనరేటర్ ప్రారంభం

**నిర్మల్ ప్రతినిధి, జులై 23 ( నినాదం ):** జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన నూతన జనరేటర్‌ను జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్ఓ) రాథోడ్ రమేష్ గురువారం ప్రారంభించారు. స్విచ్ ఆన్ చేసి జనరేటర్‌ను వినియోగంలోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా డీఆర్ఓ మాట్లాడుతూ, విద్యుత్ అంతరాయాల సమయంలో కూడా కలెక్టరేట్‌లోని కార్యాలయాల పనులు నిరంతరాయంగా కొనసాగేందుకు ఈ నూతన జనరేటర్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రజలకు సేవలందించే ప్రభుత్వ కార్యాలయాల పనితీరులో ఎలాంటి అంతరాయం కలగకుండా అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు పేర్కొన్నారు.



# ఘనంగా టిజెఎ 12 వ ఆవిర్భావ వేడుకలు

### జర్నలిస్టుల హక్కుల రక్షణే 'టిజెఎ' ధ్యేయం
### వృద్ధులకు అన్నదానం చేసి మానవత్వం చాటుకున్న జర్నలిస్టులు
### లక్ష్మణ్ నాయకత్వంలో రాష్ట్రంలో బలమైన శక్తిగా అసోసియేషన్.. మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు పార్వతి సురేష్





**ఉమ్మడి ఆదిలాబాద్ బ్యూరో, జులై 23 (నినాదం) :** మంచిర్యాల జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, సమస్యల తక్షణ పరిష్కారమే ధ్యేయంగా తెలంగాణ జర్నలిస్టు అసోసియేషన్ నిరంతరం పోరాడుతోందని టిజెఎ జిల్లా అధ్యక్షుడు పార్వతి సురేష్ స్పష్టం చేశారు. జిల్లా కేంద్రంలో గురువారం తెలంగాణ జర్నలిస్టు అసోసియేషన్ (టిజెఎ) 12వ ఆవిర్భావ వార్షికోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఉప్పల లక్ష్మణ్ ఆదేశాల మేరకు, రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా అధ్యక్షుడు పార్వతి సురేష్ నేతృత్వంలో ఈ వేడుకలను వైభవంగా చేపట్టారు. ఈ సందర్భంగా వార్షికోత్సవాన్ని పుర స్కరించుకుని జర్నలిస్టులు వృద్ధులకు అన్నదానం చేసి తమ మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు. అనంతరం అసోసియేషన్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు పార్వతి సురేష్ ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేసి వేడుకలను అధికారికంగా ప్రారంభించారు. ఈ వేడుకల్లో జిల్లాలోని జర్నలిస్టు నాయకులు, సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. రాష్ట్రంలోని జర్నలిస్టులందరినీ ఒకే తాటి పైకి తెచ్చి వారి ఐక్యతను చాటడంలో టిజెఎ కీలక పాత్ర పోషిస్తోందని నాయకులు పేర్కొన్నారు. సంస్థను రాష్ట్రవ్యాప్తంగా అగ్రగామిగా, బలమైన శక్తిగా తీర్చిదిద్దడంలో వ్యవస్థాపక అధ్యక్షుడు ఉప్పల లక్ష్మణ్ అందిస్తున్న సేవలు, క్రమశిక్షణ అభినందనీయమని కొనియాడారు. భవిష్యత్తులోనూ జర్నలిస్టుల సంక్షేమానికి, వృత్తిపరమైన రక్షణకు టిజెఎ అండగా ఉంటుంద ని పునరు ద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో టిజెఎ జిల్లా నాయకులు సారంగరావు,దేగ ఆంజనేయులు, గట్టయ్య, గంగులు,అమర్నాథ్ రెడ్డి, గౌతం, పురుషోత్తం, ప్రేమ్ జీవన్,సతీష్,వినీత్, సభ్యులు, స్థానిక జర్నలిస్టులు పాల్గొన్నారు.

# జలసిరితో జలభద్రతకు బాటలు..

### భూగర్భ జలాల పెంపుపై అధికారులకు దిశానిర్దేశం
### ప్రతి ఇంటికి ఇంకుడు గుంతలు
### ప్రతి గ్రామంలో ఊటకుంటలు, బోరు రీఛార్జ్‌లకు ప్రాధాన్యం
### ఎంపీడీవో నీలగిరి దివ్యదర్శనరావు



**సుల్తానాబాద్, జులై 23 (నినాదం):** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చే స్తున్న 'జలసిరి' కార్యక్రమాన్ని విజయవంతం చే యడమే లక్ష్యంగా మండల పరిషత్ అభివృద్ధి అ ధికారి నీలగిరి దివ్యదర్శన్‌రావు అధ్యక్షతన మం డల స్థాయి సమన్వయ సమావేశం గురువారం నిర్వహించారు. వివిధ శాఖల అధికారులతో క లిసి కార్యక్రమ అమలు, కార్యాచరణపై సమగ్రం గా చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లా డుతూ, భూగర్భ జలాల పెంపు, నీటి నిల్వల సం రక్షణే జలసిరి కార్యక్ర మం ప్రధాన ఉద్దేశమని పే ర్కొన్నారు. ప్రతి ఇంటికి ఇంకుడు గుంతలు, రైతు ల పొలాల్లో పంట కుంటలు, గ్రామాల్లో ఊట కుం టలు, బోరు బావుల రీఛార్జ్ నిర్మాణాలను పెద్ద ఎత్తున చేపట్టి భవిష్యత్ తరాలకు నీటి భద్రత కల్పించాలని సూచించారు. వ్యవసాయ శాఖ అ ధికారులు ప్రతి గ్రామం నుంచి 2 నుంచి 5 పంట కుంటల నిర్మాణానికి ప్రతిపాదనలు సమర్పించా లని ఆదేశించారు. మహిళా సమాఖ్య, శిశు సంక్షే మ శాఖ, పంచాయతీ కార్యదర్శులుసమన్వయం తో పనిచేసి ఇంకుడు గుంతలు లేని ఇళ్లను గుర్తిం చి ప్రతిపాదనలు పంపాలని సూచించారు. నీటి పారుదల శాఖ అధికారులు ఊట కుంటల నిర్మా ణానికి అనువైన స్థలాలను గుర్తించాలని, గ్రామ పంచాయతీ పరిధిలోని బోరు బావుల రీఛార్జ్ ప్ర తిపాదనలను తాగునీటి సరఫరా శాఖ ద్వారా సమర్పించాలని కోరారు. అన్ని శాఖలు సమిష్టిగా పనిచేసి భూగర్భ జలాలను పెంపొందించ డం ద్వా రా భవిష్యత్తులో తాగునీరు, సాగునీటి కొరత లే కుండా చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ పిలుపు ని చ్చారు. ఈసమావేశంలో తెలంగాణ జలసిరి పో స్టర్‌ను ఆవిష్కరించి, నీటి సంరక్షణకు కట్టుబడి పనిచేస్తామని అధికారులు ప్రతిజ్ఞ చేశారు. ఈ సమావేశంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శ్యాంసుందర్, మండల వ్యవసాయ అధికారి పై డితల్లి, నీటిపారుదల శాఖ సహాయ ఇంజనీర్ మణి మారుతి, తాగునీటి సరఫరా శాఖ సహాయ ఇంజనీర్ శ్రీకాంత్, మండల పంచాయతీ అధికారి మౌనిక, ఏపీఓ, ఏపీఎం, ఐసీడీఎస్ సూపర్వైజర్, ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శు లు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

# కేటీఆర్ జన్మదిన వేడుకలకు సేవా సందడి

### డా. చిరుమిల్ల రాకేష్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆస్పత్రిలో పండ్లు, బ్రెడ్ల పంపిణీ



**సుల్తానాబాద్, జులై 23 (నినాదం):** బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ 50వ జన్మదినాన్ని పురస్కరించుకుని సు ల్తానాబాద్‌లో ముందస్తు వేడుకలు సేవా కార్యక్ర మాలతో ఘనంగా నిర్వహించారు. టీఎస్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డా. చిరుమిల్ల రాకేష్ కుమార్ ఆధ్వర్యంలో గురు వారం ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు బిఆర్ఎస్ శ్రేణులతో కలిసి పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డా. చిరుమిల్ల రాకేష్ కుమార్ మా ట్లాడుతూ, ప్రజా సంక్షేమానికి కేటీఆర్ అందించిన సేవలను స్మరించుకుంటూ ఆయన జన్మదినాన్ని సామాజిక సేవా కార్యక్రమాలతో నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. రోగుల పట్ల మానవతా దృక్పథంతో చేపట్టిన ఈ కార్యక్రమానికి ఆస్పత్రి లోని రోగులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్య క్రమంలో బీఆర్ఎస్ శ్రేణులు పారుపల్లి గుణపతి, సుర శ్యామ్, జూపల్లి సందీప్ రావు, తిప్పారపు దయాకర్, పసిడ్ల సంపత్, ఆరేపల్లి రాకేష్, బండి సంపత్ గౌడ్, చొప్పరి అరుణ్, గందె మల్లికార్జున్ లు పాల్గొని కేటీఆర్‌కు ముందస్తు జన్మదిన శుభా కాంక్షలు తెలిపారు.




# సింగరేణిలో అత్యాధునిక జియో సైన్స్ లేబరేటరీ ప్రారంభం

## ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రారంభోత్సవం.. శాస్త్రీయ పరిశోధనలకు మరింత ఊతం

**కొత్తగూడెం, జూలై 23(నినాదం)**

సింగరేణి సంస్థలో భూగర్భ శాస్త్ర పరిశోధనలు, ఖనిజాల విశ్లేషణను మరింత ఆధునీకీకరించే లక్ష్యంతో కొత్తగూడెం కార్పొరేట్ ఏరియాలో ఏర్పాటు చేసిన అత్యాధునిక జియో సైన్స్ లేబరేటరీని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు గురువారం ప్రారంభించారు.జిల్లా పర్యటనలో భాగంగా కొత్తగూడెంకు చేరుకున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు జిల్లా కలెక్టర్ అంకిత్ పూల మొక్క అందజేసి ఘన స్వాగతం పలికారు. అనంతరం జియో సైన్స్ లేబరేటరీని ప్రారంభించి, అక్కడ ఏర్పాటు చేసిన అత్యాధునిక యంత్ర పరికరాలు, ఖనిజాల విశ్లేషణ, బొగ్గు నాణ్యత నిర్ధారణ, భూగర్భ శాస్త్ర పరిశోధనలకు వినియోగిస్తున్న సాంకేతిక వ్యవస్థలను పరిశీలించారు. లేబరేటరీలో అందుబాటులో ఉన్న పరీక్షా విధానాలు, విశ్లేషణ సామర్థ్యం, పరిశోధనల ప్రాముఖ్యతపై సింగరేణి అధికారులు ఉప ముఖ్యమంత్రికి వివరించారు. ఈ లేబరేటరీ ద్వారా ఖనిజాల నమూనాల విశ్లేషణ, బొగ్గు నాణ్యత నిర్ధారణ, భూగర్భ శాస్త్ర పరిశోధనలు మరింత వేగవంతంగా, కచ్చితత్వంతో నిర్వహించే అవకాశం లభిస్తుందని తెలిపారు. దీనివల్ల సింగరేణిలో శాస్త్రీయ పరిశోధనలకు ప్రోత్సాహం లభించడంతో పాటు ఆధునిక గనుల నిర్వహణకు అవసరమైన సాంకేతిక సేవలు మరింత మెరుగుపడనున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, సింగరేణి సీఎండీ బుద్ధ ప్రకాశ్ జ్యోతి (ఐఏఎస్), డైరెక్టర్ (పర్సనల్, అడ్మినిస్ట్రేషన్ అండ్ వెల్ఫేర్) గౌతమ్ పొట్రూ, కొత్తగూడెం మేయర్ మూడ్ గణేష్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రాహుల్, సింగరేణి ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

### ఇందిరా, రాజీవ్‌లు ఈ దేశ ప్రజల కోసం

# ప్రాణత్యాగాలు చేశారు

## బీజేపీలో ఎవరైనా దేశం కోసం ప్రాణాలు అర్పించారా?.... టీపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

**సంగారెడ్డి బ్యూరో, జూలై 23 (నినాదం):**




దేశ ప్రజల కోసం ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ ప్రాణ త్యాగాలు చేశారని...మరి బీజేపీలో ఎవరైనా దేశం కోసం ప్రాణాలు అర్పించిన వారున్నారా అని ప్రశ్నించారు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి. నీట్ పేపర్ లీకేజీపై కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలు చేస్తున్న ఆందోళనలకు మద్దతుగా సంగారెడ్డిలో వెయ్యి మంది కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి జగ్గారెడ్డి పాదయాత్ర నిర్వహించారు. ఈ పాదయాత్రలో అందరూ బ్లాక్ టీషర్టులు వేసుకుని పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ  నీట్ పేపర్ లీకేజితో లక్షల మంది విద్యార్థులు నష్టపోయారన్నారు. ఎగ్జామ్ రాసిన పిల్లల తల్లిదండ్రులకు ఆ బాధ తెలుసని..బీజేపీ పార్టీ నేతల పిల్లలు నీట్ ఎగ్జామ్ రాయలేదేమో..అందుకే వారికి ఆ బాధ కలగడం లేదని విమర్శించారు. సంగారెడ్డిలో ఓ స్టూడెంట్ కి నీట్ ఎగ్జామ్ లో మొదటిసారి 444 మార్కులు వస్తే రెండో సారి రాస్తే 386 మార్కులు వచ్చాయన్నారు. రెండో సారి వచ్చిన ఫలితాలతో ఆ అమ్మాయి నీట్ కి క్వాలిఫై కాలేదన్న విషయాన్ని గుర్తు చేశారు. దీనికి బాధ్యత ఎవరు వహిస్తారో ప్రధాని మోదీ సమాధానం చెప్పాలిని జగ్గారెడ్డి డిమాండ్ చేశారు. ఇదే అంశంపై జంతర్ మంతర్ దగ్గర విద్యార్థులు ఆందోళన చేస్తే లాఠీలతో చావబాదారని...అందుకే కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలు ప్రధాని ఇంటిని ముట్టడించారన్నారు. అసలు ప్రధాని పదవి గాంధీ కుటుంబం నుంచే పుట్టిందని.. అలాంటిది ప్రధాని పదవి వద్దనుకొని వేరే వాళ్ళని ప్రధాని చేసిన ఘనత సోనియాగాంధీకి దక్కుతుందని చెప్పారు. రాహుల్ గాంధీ కుటుంబం దేశ ప్రజల కోసం కోసం ప్రాణాలు ఆర్పించిందని.. మరి బీజేపీ పార్టీ నుంచి దేశం కోసం ప్రాణాలు అర్పించిన నేతలు ఎవరైనా ఉంటే చెప్పాలంటూ బిజెపి నేతలకు సవాల్ విసిరారు. రాహుల్ గాంధీ చేసే పోరాటం సరైందని..ఆయన పదవుల కోసం పాకులాడే వ్యక్తి కాదన్నారు. రాహుల్ గాంధీ, విద్యార్థులకు మద్దతుగా న్యాయం కోసం పోరాడుతుంటే ప్రధాని, బీజేపీ నేతలు స్పందించకపోవడం సిగ్గు చేటని విమర్శించారు. రాహుల్ గాంధీది ఇచ్చే గుణం అయితే బిజేపి పార్టీది తీసుకునే గుణమన్నారు. ఇది రాజకీయ విమర్శ కాదని వాస్తవాన్ని చెబుతున్నానన్నారు. రాహుల్ గాంధీకి ప్రధాని పదవి ఆఫర్ వస్తే..ఆయన తిరస్కరించి మన్మోహన్ ని పదేళ్ళ పాటు ప్రధానిని చేశారన్నారు. మోడీ వేరే వారికి ప్రధాని పదవి ఆఫర్ ఇస్తే వందల మంది క్యూ లో ఉంటారని..అందులో ముందువరుసలో అమిత్ షా ఉంటారని సెటైర్లు చేశారు. ఇది కాంగ్రెస్ పార్టీకి..బీజేపీ పార్టీకి ఉన్న తేడా అని స్పష్టం చేశారు. నీట్ పేపర్ లీకేజీపై ప్రధాని మోడీ విద్యార్థులకు క్షమాపణ చెప్పాలని..విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఉద్యమం ఇంతటితో ఆగదని..రోజుకో రీతిలో నిరసన చేపడు తామని అన్నారు జగ్గారెడ్డి.



# పీవీ ఆశయాలకు ప్రతీకగా వంగరలో విజ్ఞాన కేంద్రం

## మంత్రి పొన్నం ప్రభాకర్

**భీమదేవరపల్లి జూలై 23 (నినాదం):**

మాజీ ప్రధాని, భారతరత్న పీవీ నరసింహారావు స్వగ్రామం వంగరలో నిర్మాణంలో ఉన్న పీవీ విజ్ఞాన కేంద్రం పనులను రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. తుది దశలో ఉన్న నిర్మాణ పనులను నాణ్యతతో పాటు వేగంగా పూర్తి చేసి త్వరలోనే ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. విజ్ఞాన కేంద్రంలోని ఫోటో గ్యాలరీ, సైన్స్ మ్యూజియం, అంపీథియేటర్, ఆడిటోరియం, ధ్యాన మందిరాన్ని పరిశీలించిన మంత్రి, పీవీ నరసింహారావు జీవిత విశేషాలు, దేశానికి చేసిన సేవలను భావితరాలకు చేరవేసేలా కేంద్రాన్ని తీర్చిదిద్దాలని సూచించారు. కేంద్రం పరిసరాల్లో గార్డెన్ అభివృద్ధి, పచ్చదనం ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీవీ నరసింహారావు కుమారులు ప్రభాకర్ రావు, రాజేశ్వర్ రావు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, సర్పంచులు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

# ఓటర్ సవరణపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలి

## మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

**వనపర్తి ప్రతినిధి, జూలై 23 (నినాదం)**



ఓటర్ జాబితా సవరణపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి కోరారు. గురువారం వనపర్తి పట్టణంలోని (బాలభవన్) 22వ వార్డులో సర్ ప్రక్రియను మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ ఏర్వ అరుణ శ్రీనివాసులును నిరంజన్ రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో సర్ ప్రక్రియ మందకొడిగా సాగుతుందని, అధికారులు ప్రత్యేక దృష్టి సారించి 100శాతం ఓటర్ నమోదు జరిగేవిధంగా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. 22 వ వార్డు కౌన్సిలర్ ఏర్వ అరుణ శ్రీనివాసులు సర్ ప్రక్రియ ప్రారంభం నుండి ప్రజలకు అందుబాటులో ఉంటూ సర్ ప్రక్రియ సాజావుగా సాగడానికి చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. అన్ని వార్డులలో నాయకులు శ్రద్ధ వహించి అర్హులైన ఓటర్లు తుది జాబితాలో ఉండేవిధంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. నిరంజన్ రెడ్డి వెంట బీఆర్ఎస్ నాయకులు నందిమల్ల అశోక్, జోహెబ్ హుస్సేన్, హేమంత్ ముదిరాజ్, చిట్యాల రాము, లక్ష్మణ్ గౌడ్, క్రాంతి, గౌనికాడి యాదయ్య, యూసుఫ్, హరీఫ్, బిఎల్ఓ ఖాతున్, అంగన్వాడీ టీచర్ ఈశ్వరమ్మ, యువరాజ్ ఉన్నారు

# ఎమ్మెల్యే రాగమయి చొరవతో.. సింగరేణిపై భట్టి ఫోకస్!

## సత్తుపల్లి ఓసీని క్షేత్రస్థాయిలో పరిశీలించిన డిప్యూటీ సీఎం

**సత్తుపల్లి, జూలై 23 (నినాదం )**




సత్తుపల్లి నియోజకవర్గ అభివృద్ధి, సింగరేణి ప్రాంత సమస్యలపై ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి దయానంద్ చొరవతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు సత్తుపల్లి సింగరేణి ఓపెన్‌కాస్ట్ గనిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సింగరేణిని కాపాడుకోవడంతో పాటు భవిష్యత్ తరాలకు లాభదాయకంగా అందించడమే ప్రభుత్వ లక్ష్యమని భట్టి తెలిపారు. బొగ్గు నాణ్యతను పెంచడంతో పాటు ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించి ప్రైవేటు పోటీని తట్టుకునేలా సంస్థను బలోపేతం చేయాలని సూచించారు. సింగరేణి భవిష్యత్తులో సౌర విద్యుత్, క్రిటికల్ మినరల్స్, రేర్ ఎర్త్ మినరల్స్ రంగాల్లోనూ విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు.ఎమ్మెల్యే రాగమయి చొరవతో సత్తుపల్లి సింగరేణి ప్రాంతంపై ప్రభుత్వ స్థాయిలో మరింత దృష్టి ఏర్పడిందని స్థానికులు పేర్కొన్నారు. అనంతరం కిష్టారం ప్రాంతంలో నిర్మించిన సింగరేణి క్వార్టర్లను డిప్యూటీ సీఎం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే రాగమయి దయానంద్, అధికారులు, ప్రజాప్రతినిధులు, సింగరేణి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

NINADAM CINEMA

# రాజకీయ ఎంట్రీ ఆధారంగా జనానాయగన్



తమిళనాడు ముఖ్యమంత్రి, కథానాయకుడు విజయ్ నటించిన చివరి చిత్రం 'జన నాయగన్' తెలుగులో 'జన నాయకుడు' పేరుతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. సంక్రాంతికి విడుదల కావాల్సిన ఈ మూవీ సమస్యలను దాటుకుని ఎట్టకేలకు విడుదలైంది.  తెలుగులో విజయంతమైన 'భగవంత్ కేసరి' స్ఫూర్తితో రూపొందిన చిత్రమిది. ఇది మక్కీకి మక్కీ రీమేక కానప్పటికీ... ఆ కథలోని ఆత్మ, పాత్రలు పక్కాగా కనిపిస్తాయి. దాంతో తెలుగు ప్రేక్షకులకు అడుగడుగునా 'భగవంత్ కేసరి' సినిమానే గుర్తొస్తుంది.విజయ్ రాజకీయ అజెండా, మితిమీరిన వాణిజ్యాంశాల మధ్య కథలోని అసలు ఆత్మ నలిగిపోయింది. తమిళనాడు ఎన్నికలకు ముందు రూపొందిన ఈ సినిమా విజయ్ రాజకీయ ఆలోచనల్ని, అజెండాని మాత్రం పక్కాగా తెరపై ఆవిష్కరించింది. ఆయనకు రాజకీయంగా లబ్ది చేకూర్చే విషయాలు సినిమాలో అడుగడుగునా కనిపిస్తాయి.



# రణ్‌వీర్ ప్రళయ్‌లో కళ్యాణి ప్రియదర్శన్

బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌వీర్ సింగ్ నటిస్తున్న భారీ బ్జడెట్ చిత్రం 'ప్రళయ్'పై ఇప్పటికే సినీ వర్గాల్లో మంచి అంచనాలు నెలకొన్నాయి. తాజా వార్త ఇప్పుడు మరింత ఆసక్తిని పెంచుతోంది. ఈ చిత్రంలో హీరోయిన్‌గా దక్షిణాది నటి కళ్యాణి ప్రియదర్శన్ ఎంపికైనట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. కళ్యాణి ప్రియదర్శన్ ఇప్పటికే తెలుగు, తమిళం, మలయాళ భాషల్లో పలు విజయవంతమైన చిత్రాల్లో నటించి మంచి గుర్తింపు సంపాదించారు. సహజమైన నటన, అందంతో యువతలో ప్రత్యేకమైన ఫాలోయింగ్ ఏర్పరచుకున్న ఆమెకు ఇప్పుడు బాలీవుడ్‌లో భారీ అవకాశం దక్కబోతుందనే వార్త చర్చనీయాంశంగా మారింది. రణ్‌వీర్ సింగ్ వంటి స్టార్ హీరో సరసన నటించే అవకాశం రావడం ఆమె కెరీర్‌లో కీలక మలుపుగా భావిస్తున్నారు. రణ్‌వీర్ సింగ్ తన ఎనర్జిటిక స్క్రీన్ ప్రెజెన్స్, విభిన్న పాత్రలతో ప్రేక్షకులను అలరిస్తూ వస్తున్నారు. అలాంటి హీరోతో కళ్యాణి జోడీ కట్టడం సినిమాపై మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ ఇద్దరి మధ్య కెమిస్ట్రీ ఎలా ఉంటుందో తెలుసుకోవాలని అభిమానులు ఎదురుచూస్తున్నారు. ముఖ్యంగా దక్షిణాది ప్రేక్షకుల్లో కూడా ఈ కాంబినేషన్‌పై చర్చ మొదలైంది. 'ప్రళయ్' చిత్రాన్ని భారీ స్థాయిలో తెరకెక్కిస్తున్నట్లు సమాచారం. యాక్షన్ సీక్వెన్సులతో పాటు భావోద్వేగాలకు కూడా ప్రాధాన్యత ఇచ్చే కథగా రూపొందుతోందని సినీ వర్గాలు చెబుతున్నాయి. అంతర్జాతీయ స్థాయి సాంకేతిక ప్రమాణాలతో సినిమాను రూపొందించేందుకు మేకర్స్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం కళ్యాణి ప్రియదర్శన్ ఎంపికపై అధికారిక ప్రకటన రాకపోయినా, త్వరలోనే చిత్రబృందం పూర్తి తారాగణాన్ని ప్రకటించే అవకాశం ఉందని సమాచారం.





# విశ్వనాథం అండ్ సన్స్ నుంచి కొత్త లుక్ విడుదల

కోలీవుడ్ స్టార్ హీరో సూర్యకు తమిళంతో పాటు తెలుగులోనూ భారీ అభిమాన వర్గం ఉంది. ఇటీవల విడుదలైన 'వీరభద్రుడు' సినిమాతో మాస్ హిట్ అందుకున్న ఆయన, ఇప్పుడు మరో ఆసక్తికరమైన ప్రాజెక్టతో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్నారు. టాలీవుడ్ దర్శకుడు వెంకీ అట్లూరి తెరకెక్కిస్తున్న 'విశ్వనాథ్ అండ్ సన్స్' సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. సూర్య పుట్టినరోజు సందర్భంగా చిత్రబృందం విడుదల చేసిన కొత్త పోస్టర్లు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ముఖ్యంగా బ్రౌన్ కలర్ సూట్‌లో సూర్య కనిపించిన స్టైలిష్ లుక అభిమానులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. చాలా కాలం తర్వాత సూర్యను ఇలాంటి క్లాస్, వింటేజ్ స్టైల్‌లో చూడటం ఫ్యాన్స్‌కు ప్రత్యేకమైన ఆనందాన్ని కలిగిస్తోంది. ఈ పోస్టర్లతో సినిమాపై మరింత హైప్ పెంచిన మేకర్స్ మరో సర్‌ప్రైజ్ కూడా ప్రకటించారు. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్‌కు మంచి స్పందన రావడంతో, ఈ కొత్త పాటపై కూడా అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది. వెంకీ అట్లూరి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం కుటుంబ భావోద్వేగాలతో పాటు కమర్షియల్ అంశాలను కలగలిపిన కథతో తెరకెక్కుతున్నట్లు తెలుస్తోంది. సూర్యను కొత్త కోణంలో చూపించే ఈ సినిమా ఆయన కెరీర్‌లో మరో ప్రత్యేక చిత్రంగా నిలుస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# బోల్డ్ సన్నివేశాల్లో నటించలేను: కాజల్

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ కాజల్ అగర్వాల్ మరోసారి తన వ్యక్తిగత అభిప్రాయాలను స్పష్టంగా వెల్లడించారు. సినిమాల్లో బికినీ, బోల్డ్ సన్నివేశాలు, రొమాంటిక సీన్స్‌పై ఇటీవల జరుగుతున్న చర్చల మధ్య ఆమె చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ముఖ్యంగా పెళ్లి తర్వాత హీరోయిన్లు గ్లామర్ పాత్రలు చేయడంపై వస్తున్న విమర్శల నేపథ్యంలో కాజల్ స్పందించిన తీరు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ప్రస్తుతం 'ది ఇండియా స్టోరీ' సినిమా ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్న కాజల్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, కెరీర్ ప్రారంభం నుంచే తాను బికినీ లేదా అతిగా బోల్డ్ సన్నివేశాల్లో నటించడానికి ఆసక్తి చూపలేదని తెలిపారు. అలాంటి పాత్రలు చేయడం తనకు వ్యక్తిగతంగా అసౌకర్యంగా అనిపిస్తుందని, అందుకే ఎన్నో భారీ చిత్రాలను కూడా వదులుకున్నానని వెల్లడించారు. సినిమాల కోసం లేదా డబ్బు కోసం నా వ్యక్తిత్వాన్ని మార్చుకోలేను. నాకు కొన్ని విలువలు, సిద్ధాంతాలు ఉన్నాయి. వాటిని నేను ఎప్పుడూ రాజీ పడను. తెరపై బోల్డ్ సీన్స్ చేయాల్సిన అవసరం ఉందని నేను భావించను అని కాజల్ స్పష్టం చేశారు. తల్లి అయిన తర్వాత తన ఆలోచనల్లో మరింత మార్పు వచ్చిందని కూడా ఆమె తెలిపారు.

Printed, Published & Owned by B. Srinivas, Printed at RAHNUMA-E-DECCAN PRESS, H.No.12-2-837/A/3, Asifnagar, Hyderabad., Telangana-500028
Published at 6-3-439, Kisannagar, Karimnagar-505001(TS) Editor: B. Srinivas, PRGI.REGN.NO. APTEL/2003/11288, Gmail: ninadamnews@gmail.com, CELL: +91 8333068787